


VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 137 విశాఖపట్నం, 05 మార్చి 2026 గురువారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00

## స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ: చంద్రబాబు




**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 4 :** వైకాపా హయాంలో అనేక కంపెనీలను తరిమేశారని సీఎం చంద్రబాబు అన్నారు. జాకీ, లులు, అమర్‌రాజా, ఫ్రాంక్లిన్, టెంపుల్‌టన్ కంపెనీలను వెళ్లగొట్టారని తెలిపారు. పెట్టుబడులు, మౌలిక వసతులు, ఉద్యోగాల కల్పన అంశంపై శాసనసభలో సీఎం ప్రసంగించారు. "వైకాపా హయాంలో ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు. గత ప్రభుత్వంలో యువత పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన పరిస్థితి. ఎవరికీ నైపుణ్యాలను కల్పించలేకపోయారు. 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి దానిపై ఓ కమిటీని కూడా నియమించాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే చిరునామా ఏపీ ఉండేది. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ మారింది. 26 పాలసీలతో వేగంగా పెట్టుబడులకు అనుమతులు ఇస్తున్నాం. పర్యాటకానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు కూడా ఏర్పాటు చేస్తున్నాం. అలాగే పారిశ్రామిక ప్రోత్సాహకాలను కూడా రూ.210 కోట్ల మేర విడుదల చేశాం"

"ఇటీవల విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వాటిద్వారా 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఎంఎస్ఎంఈలో 2.48 లక్షల మందికి, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 1.46 లక్షలు, పరిశ్రమల్లో 95 వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ 64 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. మెగా డీఎస్సీ, పోలీసు కానిస్టేబుళ్లు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు 30,500 మందికి వచ్చాయి. మొత్తంగా 6.28 లక్షల మందికి ఉద్యోగాల కల్పన ఇప్పటి వరకూ జరిగింది. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ జోన్స్‌తో అభివృద్ధి చేస్తున్నాం. 2047కు 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ తయారవుతుంది" అని చంద్రబాబు అన్నారు.

## మండలి ఛైర్మన్‌పై అవిశ్వాసం పెట్టే యోచనలో వైకాపా ఎమ్మెల్సీలు

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 4 :** వైకాపాకు రాజీనామా చేసిన ఎమ్మెల్సీలు శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజుపై అవిశ్వాసం పెట్టే యోచనలో ఉన్నారు. ఐదుగురు సభ్యులు రాజీనామా చేసినా ఇంతవరకూ మండలి ఛైర్మన్ ఆమోదించలేదు. ఛైర్మన్ తీరుకు నిరసనగా ఆయనపై అవిశ్వాసం పెట్టాలని ఆ ఎమ్మెల్సీలు భావిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సరిపడా సంఖ్యాబలం ఉండటంతో ఈ నిర్ణయం దిశగా ఆలోచిస్తున్నారు. వైకాపా నుంచి ఎమ్మెల్సీలుగా గెలిచిన పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కల్యాణ చక్రవర్తి, మర్రి రాజశేఖర్, జయమంగళ వెంకటరమణ తదితరులు అవిశ్వాసం పెట్టే యోచనలో ఉన్నారు.



## లడ్డూ కల్తీ.. వారిని దేవుడు వదిలిపెట్టడు: మంత్రి లోకేశ్



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 4 :** దేవుడిపై తమకు అపారమైన నమ్మకం ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. దేవుడిపై నమ్మకం ఉందని డిక్లరేషన్‌పై జగన్ కనీసం సంతకం పెట్టలేదన్నారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసన మండలిలో జరిగిన చర్చలో లోకేశ్ మాట్లాడారు. "ప్రస్తుతం మార్కెట్ ధర పెరిగింది. వాళ్లు చేసినట్లు మేం కూడా కల్తీ చేసిన నెయ్యి వాడాలా? లడ్డూలో కల్తీ జరిగిందా లేదా అనేది తప్ప మిగిలినవన్నీ మాట్లాడుతున్నారు. కల్తీ జరిగిందని స్పష్టంగా సీబీఐ నివేదికలో ఉంది. వైవీ సుబ్బారెడ్డి కూడా దీనిని ఒప్పుకొన్నారు. లడ్డూ కల్తీ విషయంలో తప్పు చేసిన వారిని దేవుడు వదిలిపెట్టడు" అని లోకేశ్ అన్నారు. వేంకటేశ్వర స్వామిపై జగన్‌కు ఏమాత్రం నమ్మకం లేదని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. దేవుడిపై ఇంత కక్ష ఎందుకో వాళ్లే చెప్పాలన్నారు. ఎవరి మత విశ్వాసాలు వారివని.. తాము కాదనమని చెప్పారు.



### పెంటగాన్ నివేదిక లీక్..
### అమెరికా వద్ద తగ్గిపోతున్న క్షిపణి నిల్వలు

**ఇంటర్నెట్ డెస్క్:** ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో.. అగ్రరాజ్య (US) క్షిపణి నిల్వలకు సంబంధించిన కీలక నివేదికలు బయటకు వచ్చాయి. అందులో క్షిపణుల నిల్వలు తగ్గిపోతున్నట్లు పెంటగాన్ వెల్లడించింది. ముఖ్యంగా ఇంటర్‌సెప్టర్ క్షిపణులు, గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ల నిల్వలు గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను ఎదుర్కోవడంలో ప్రస్తుతం ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. ట్రంప్ మరో 10 రోజులు ఇలాగే దాడులు కొనసాగిస్తే అవి పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆయుధ, క్షిపణి నిల్వలను తిరిగి పెంచుకోవడానికి అధిక ఖర్చులను భరించాల్సి ఉంటుందని ఈ మేరకు పెంటగాన్ ట్రంప్‌నకు తెలిపినట్లు నివేదికలు వెల్లడించాయి. కీలకమైన ఆయుధాల కొరత వల్ల ఇరాన్ దాడులను తిప్పి కొట్టడం కూడా అసాధ్యంగా మారే అవకాశం ఉందని హెచ్చరించాయి. కొన్నేళ్లుగా ఇజ్రాయెల్, ఉక్రెయిన్ వంటి మిత్రదేశాలకు సైనిక సహాయం అందిస్తుండడంతో.. అమెరికా నిల్వలు తగ్గినట్టు తెలిపాయి. అయితే ట్రంప్‌తమ వద్ద లెక్కలేనన్ని ఆయుధాలు ఉన్నట్లు మంగళవారం ట్రూత్ వేదికగా పేర్కొన్నారు. ఇరాన్‌తో పోరాటానికి కావాల్సినన్ని ఆయుధ నిల్వలు ఉన్నాయన్నారు. ఉన్నతశ్రేణి ఆయుధాలను ఇతర దేశాల్లోనూ ⏭ తరువాయి 2లో..

## జగన్, భూమన, వైవీ సుబ్బారెడ్డి ఆర్గనైజ్డ్ క్రైమ్ చేశారు : పంచుమర్తి అనురాధ

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 4 :** తిరుమల శ్రీవారిపై గతంలో జగన్ ప్రభుత్వం కక్షగట్టిందని తెదేపా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసన మండలిలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. టెండర్ నిబంధనలను సవరించి ఇష్టానుసారం వ్యవహరించారని విమర్శించారు. "అనేక భయంకరమైన రసాయనాలు కలిసి ఉన్నవాటికి ఆవు నెయ్యి అని పేరు పెట్టారు. రోజుకు 4లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సడలించారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించేశారు. టర్నోవర్ ఏడాదికి రూ.250 కోట్లు అని ఉన్న నిబంధనను రూ.150 కోట్లకు పరిమితం చేశారు. సాంకేతిక అధ్యయనం, క్షేత్రస్థాయి పరిశీలిన లేకుండా టెండర్లు కట్టబెట్టారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చేశారు. టెండర్ నిబంధనల సడలింపుపై తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సంతకం చేశారు. నెయ్యి కల్తీ



## ఫ్యాక్షన్ రాజకీయాలను జగన్ పెంచి పోషించారు: మంత్రి లోకేశ్



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 4 :** ఫ్యాక్షన్ రాజకీయాలను గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాత జగన్ పెంచి పోషించి వందల మంది తెదేపా కార్యకర్తల హత్యలకు కారకులయ్యారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో దారుణహత్యకు గురైన తెదేపా నేత తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇచ్చేందుకు వీలుగా ఏపీ పబ్లిక్ సర్వీసు నియామకాల సవరణ బిల్లును శాసనసభలో మంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. 2025 సెప్టెంబర్ 27న శాసనసభలో బిల్లును ఆమోదించి మండలికి పంపించామని.. అక్కడ బిల్లును చర్చకు తీసుకోలేదన్నారు. వంద రోజులు దాటడంతో మళ్లీ బిల్లును శాసనసభలో పెట్టాల్సి వచ్చిందని వివరించారు.

బీసీ వర్గానికి చెందిన తోట చంద్రయ్యను 2022 జనవరి 12న హత్య చేశారని, నమ్ముకున్న సిద్ధాంతం కోసం నిలబడి ప్రజల కోసం ఆయన పోరాడారన్నారు. నడిరోడ్డుపై చంద్రయ్యను గొంతు కోసి చంపారని.. దేశమంతా ఇది చూసిందని చెప్పారు. ఆయన కుమారుడికి ఉద్యోగం ఇచ్చేందుకు కూటమి పార్టీలు సమ్మతించాయని.. అందుకే బిల్లు పెట్టినట్లు సభకు వివరించారు. అనంతరం ఆ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది.



## ఉపాధ్యాయులపై విద్యార్థుల దాడి

**హనుమాన్ జంక్షన్, విశాఖ సమాచారమ్, మార్చి 4 :** కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరవల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులపై విద్యార్థులు దాడికి దిగారు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. విరామ సమయంలో మరుగుదొడ్ల వద్ద సిగరెట్లు తాగుతున్న ముగ్గురు విద్యార్థులను గమనించి ల్యాబ్ అసిస్టెంట్ రవీంద్ర మందలించారు. దీనిపై ప్రధానోపాధ్యాయునికి ఫిర్యాదు చేశారు. దీంతో సదరు విద్యార్థులు రవీంద్రతో వాగ్వాదానికి దిగి.. ఆయనపై దాడి చేశారు. ఈ ఘటనను వీడియో తీస్తున్న వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. అదే రోజు ఉపాధ్యాయులు వీరవల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## హర్మూజ్‌లో చమురు నౌకలకు అమెరికా నేవీ రక్షణ: ట్రంప్ హామీ



**అమెరికా :** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నామని ఇరాన్ ప్రకటించింది. దీంతో ఇంధన రవాణాకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ మీదుగా వెళ్లే చమురు ట్యాంకర్లకు అవసరమైతే అమెరికా నేవీ రక్షణ కల్పిస్తుందని వెల్లడించారు. వీలైనంత త్వరగా దీనిపై నిర్ణయం తీసుకుంటామని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచానికి ఇంధన సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా అమెరికా తప్పకుండా చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు తన ట్రూత్ ఖాతా పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇక, గల్ఫ్ మీదుగా సముద్ర మార్గాల్లో జరిపే వాణిజ్యానికి ఆర్థిక భద్రత, అందుబాటు ధరల్లో బీమా, ⏭ తరువాయి 2లో..

## ఆ దేశాలపై అమెరికా యుద్ధం రూ.లక్షల కోట్ల ఖర్చు

**అమెరికా :** విదేశీ యుద్ధాల్లో జోక్యాన్ని తగ్గించుకుంటామని అమెరికా పలు సందర్భాల్లో పేర్కొన్నప్పటికీ.. తాజాగా ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై భీకర దాడులు కొనసాగిస్తోంది. మాజీ అధ్యక్షుల మాదిరిగానే డొనాల్డ్ ట్రంప్ కూడా పశ్చిమాసియాలో తన వ్యూహాలను అమలు చేస్తున్నారు. సెప్టెంబర్ 11, 2001 దాడుల తర్వాత మూడు దేశాలపై పూర్తిస్థాయి యుద్ధం చేసిన అమెరికా, రెండున్నర దశాబ్దాల్లో మొత్తంగా పది దేశాలపై సైనిక చర్య చేపట్టింది. ఇందుకోసం భారీగా ఖర్చు చేసింది.



సెప్టెంబర్ 2001 తర్వాత 'ఉగ్రవాదంపై పోరు'కు సిద్ధమని ప్రకటించిన నాటి అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ అఫ్గానిస్థాన్‌పై యుద్ధం మొదలుపెట్టారు. 'ఆపరేషన్ ఎండ్యూరింగ్ ఫ్రీడమ్'తో మొదలైన ఆ సైనిక చర్య దాదాపు 20ఏళ్లు కొనసాగింది. అమెరికా చరిత్రలోనే సుదీర్ఘ యుద్ధంగా నిలిచింది. ఇరాక్‌పైనా దాడి చేసింది. 2001-2023 మధ్యకాలంలో బుష్, ఒబామా, ట్రంప్, బైడెన్‌ల హయాంలో ⏭ తరువాయి 2లో..

# మనిషి వెంట్రుకలతో ఎరువు తయారీ

**ఉత్తర్‌ప్రదేశ్ :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పుర్‌కు చెందిన హృతిక్ మనిషి వెంట్రుకలతో ఎరువు తయారు చేయొచ్చని రుజువు చేశారు. పంజాబ్ యూనివర్సిటీలో ఆయన ఈ మేరకు పరిశోధనలు చేశారు. హెయిర్ సెలూన్ల నుంచి వెంట్రుకలను సేకరించి, వాటికి ఎంజైమ్‌లను జోడించి ఎరువును తయారుచేసినట్లు తెలిపారు. వెంట్రుకల్లో నత్రజని, ప్రొటీన్, అమైనో ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయని, ఈ ఎరువు మొక్కల ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా దీన్ని ఉపయోగించవచ్చని చెప్పారు. 2018లో యూనివర్సిటీలో ఘనవ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టు సమయంలో తనకు ఈ ఆలోచన వచ్చినట్లు వెల్లడించారు. ఈ స్టార్టప్‌నకు ఐఐటీ కాన్పుర్ రూ.20 లక్షల నిధులను సమకూర్చింది.

# రూ.5,083 కోట్ల రక్షణ ఒప్పందాలు

ఒప్పంద పత్రాలను చూపుతున్న రక్షణ, హెచ్‌ఏఎల్ ప్రతినిధులు



**విశాఖపట్నం :** విశాఖపట్నం (సింధియా), భారత తీరగస్తీ అవసరాల నిమిత్తం ఆరు అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు (ఏఎల్‌హెచ్), వర్టికల్ లాంచ్ మిసైల్స్ (వీఎల్‌ఎం) తయారీకి రెండు సంస్థలతో రక్షణ మంత్రిత్వశాఖ రూ.5,083 కోట్ల విలువగల ఒప్పందాలను చేసుకుందని రక్షణ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఈ రెండు ఒప్పంద పత్రాలపై రక్షణశాఖ కార్యదర్శి రాజేష్‌కుమార్ సింగ్ సమక్షంలో సంతకాలు జరిగాయి. ఆరు ఏఎల్‌హెచ్‌ల కోసం రూ.2,901 కోట్ల విలువగల ఆర్డర్‌కు హిందుస్థాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)తో, వీఎల్‌ఎంల కోసం రూ.2,182 కోట్ల ఆర్డర్‌కు రష్యాకు చెందిన జేఎస్సీ రోసోబొరాన్ ఎక్స్‌పోర్ట్ ఫెడరేషన్‌తో ఒప్పందాలు కుదిరాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మిగతావారికి ఇవి ఎన్నికలు.. మా పార్టీకి భావోద్వేగం: విజయ్



**చెన్నై :** కొన్ని నెలల్లో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈసారి ప్రముఖ నటుడు విజయ్ పార్టీ టీవీకే (తమిళగ వెట్రి కళగం) బరిలో ఉండటమే అందుకు కారణం. తంజావూరు జిల్లాలో జరిగిన బహిరంగ ర్యాలీలో పార్టీ మ్యానిఫెస్టోను విజయ్ ఆవిష్కరించారు. ఈసారి జరిగే ఎన్నికలు ఇతరులకు సాధారణమేనని, అయితే తనకు మాత్రం ఇవి ఓ భావోద్వేగమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

"తమిళనాడులో ఈసారి జరిగే ఎన్నికలు ఇతరులకు సాధారణమేనని.. కానీ నాతో పాటు నన్ను ప్రేమించే ప్రజలకు భావోద్వేగం. ఈ సారి ఎన్నికల్లో దిల్లీ టీమ్ (భాజపా)తో సహా అన్ని జట్లను టీవీకే ఓడిస్తుంది. క్రికెట్‌లో తమిళనాడు సీఎస్కేకు విజిల్ వేస్తే.. ఈ ఎన్నికల్లో టీవీకే 'విజిల్' (టీవీకే పార్టీ గుర్తు) మారుమోగనుంది. ప్రజలకు ఉన్న అనుబంధాన్ని ఎవరూ విడగొట్టలేరు" అని విజయ్ అన్నారు. అలాగే పలు హామీలు ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే, రెండు ఎకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న రైతు బిడ్డల ఉన్నతవిద్యకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అయితే ఆ కుటుంబాల్లో ఏ ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం ఉండకూడదన్నారు. ఉన్నత విద్యకోసం భారీగా ఖర్చు చేయలేని పేద కుటుంబాలకు సహకరించడమే తమ ఉద్దేశమన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు రక్షణ కల్పిస్తామన్నారు. అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ ఏడాది పొంగల్‌కు విడుదల కావాల్సిన విజయ్ చిత్రం 'జననాయగన్' న్యాయపరమైన చిక్కులతో ఆగిపోయింది. ఈ సభలో దానిగురించి ప్రస్తావించారు. " ఈ విషయంలో చాలామంది మద్దతుగా తమ గళాన్ని వినిపించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా వారిలో ఉన్నారు. ఆయనకు కృతజ్ఞతలు. అయితే ఆయన మద్దతు ఇచ్చినా.. పరిస్థితిలో మార్పు కనిపించలేదు" అని వ్యాఖ్యానించారు.

# దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పిస్తాం: ఏపీఎస్ ఆర్టీసీ

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 4 :** 'ఇంద్ర ధనస్సు'లో భాగంగా దివ్యాంగులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని ఏపీఎస్‌ఆర్టీసీ తెలిపింది. ఈ కార్యక్రమాన్ని మార్చి 18న సీఎం చంద్రబాబు లాంఛనంగా ప్రారంభిస్తారని ఆర్టీసీ ఎండీ ప్రకటించారు. 40 శాతం, ఆ పైన వైకల్యం ఉన్న దివ్యాంగులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అమలు చేస్తామన్నారు. దివ్యాంగుల సహాయకుడికి టికెట్ ఛార్జీలో 50 శాతం రాయితీ ఉంటుందని వివరించారు.




# విజయవాడ - విశాఖపట్నం మధ్య బుల్లెట్ రైల్ కారిడార్



## విజయవాడ నుంచి కర్నూలుకు సెమీ హైస్పీడ్ రైల్ కారిడార్

## హైదరాబాద్-శ్రీశైలం-మార్కాపురం మధ్య కొత్త రైల్వే లైన్

## 8 రూట్లలో ఫైనల్ లొకేషన్ సర్వేకు రైల్వేశాఖ ప్రతిపాదనలు

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 4 :**

రాష్ట్రంలో రెండు కీలక నగరాలైన విజయవాడ-విశాఖపట్నం మధ్య బుల్లెట్ రైల్ నడిపేందుకు హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మించే ప్రతిపాదనను రైల్వేశాఖ పరిశీలిస్తోంది. దీనికోసం ఫైనల్ లొకేషన్ సర్వే చేయాలని భావిస్తోంది. అలాగే విజయవాడ-కర్నూలు మధ్య నేరుగా రైళ్లు నడపటమే కాకుండా, తక్కువ ప్రయాణ సమయం ఉండేలా చూసేందుకు సెమీ హైస్పీడ్ రైల్ కారిడార్ కూడా నిర్మించాలనుకుంటోంది. వీటితోపాటు మరో ఆరు మార్గాల్లో కొత్త రైల్వే లైన్లు నిర్మించడంపై దృష్టిపెట్టింది. వీటన్నింటికీ ఫైనల్ లొకేషన్ సర్వే చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ రైల్వే అధికారులు.. రైల్వే బోర్డుకు ప్రతిపాదనలను పంపారు. బోర్డు నుంచి క్లియరెన్స్ వస్తే వీటిపై ముందడుగు పడనుంది.

రాష్ట్రంలో నాలుగో మార్గంలో బుల్లెట్ రైల్ కారిడార్: దేశంలో వివిధ నగరాల మధ్య ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లు నిర్మించనున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇందులో మన రాష్ట్రంలో.. రాజధాని అమరావతి మీదుగా హైదరాబాద్-చెన్నై కారిడార్, కర్నూలు, అనంతపురం మీదుగా హైదరాబాద్-బెంగళూరు కారిడార్, చిత్తూరు మీదుగా చెన్నై-బెంగళూరు కారిడార్ కలిపి మొత్తం మూడు ఉన్నాయి. ఇప్పుడు విజయవాడ-విశాఖపట్నం మధ్య కూడా మరో హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. 350 కి.మీ. ఉండే ఈ కారిడార్ ఏలూరు, రాజమహేంద్రవరం, కాకినాడ మీదుగా వెళ్లేలా చూడనున్నారు. ఇది అందుబాటులోకి వస్తే గరిష్ఠంగా గంటకు 320 కి.మీ. వేగంతో బుల్లెట్ రైళ్లు రెండు నగరాల మధ్య పరుగులు పెడతాయి. అయితే ఈ కారిడార్ అమరావతి-విజయవాడ-విశాఖపట్నం మధ్య ఉండేలా చూస్తే.. హైదరాబాద్-అమరావతి-చెన్నై కారిడార్‌కు అనుసంధానం అయినట్లు అవుతుంది.

**విజయవాడ-కర్నూలు మధ్య ఇంటర్ సిటీ రవాణా కోసం..**

విజయవాడ-కర్నూలు మధ్య ప్రస్తుతం నేరుగా నడిచే రైళ్లు లేవు. డోన్‌లో గానీ, నంద్యాలలో గానీ దిగి కర్నూలుకు మరో రైలులో వెళ్లాల్సి ఉంటోంది. ఇప్పుడు ఈ రెండు నగరాల మధ్య సెమీ హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మించాలని రైల్వేశాఖ ప్రతిపాదించింది. గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం, కంభం, నంద్యాల మీదుగా మొత్తం 350 కి.మీ. మేర ఈ లైన్ నిర్మించాలనుకుంటోంది. సెమీ హైస్పీడ్ కారిడార్‌లో రైళ్లు గరిష్ఠంగా గంటకు 220 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయి. భవిష్యత్‌లో ఇది అందుబాటులోకి వస్తే.. విజయవాడ నుంచి కర్నూలుకు 2 గంటల్లో చేరుకునే అవకాశం ఉంటుంది.

**మాచర్ల నుంచి గద్వాల్ వరకు..**

పల్నాడు జిల్లా మాచర్ల నుంచి తెలంగాణలోని గద్వాల్ వరకు 184 కి.మీ. కొత్త లైన్‌కు ప్రతిపాదనలు పంపారు. తెలంగాణ, కర్ణాటక వైపు నుంచి ఏపీలోని నౌకాశ్రయాలకు అనుసంధానం కల్పించేందుకు వీలుగా ఈ రైల్వే లైన్ కీలకంగా ఉంటుంది.

నెల్లూరు నుంచి రాజంపేటకు 120 కి.మీ. రైల్వే లైన్ నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదించారు. ప్రస్తుతం నెల్లూరు నుంచి రాజంపేట, కడపవైపు రైలులో వెళ్లాలంటే రేణిగుంట, రైల్వేకోడూరు మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది. దీనికి బదులు నేరుగా నెల్లూరు నుంచి రాజంపేటకు రైల్వేలైన్ ఉండేలా చూడాలని భావిస్తున్నారు. సామర్లకోట నుంచి చింతూరుకు 150 కి.మీ. కొత్త లైన్ నిర్మించేలా ప్రతిపాదించారు.

కళ్యాణదుర్గం నుంచి అనంతపురానికి 58 కి.మీ. కొత్త లైన్ నిర్మించేందుకు ప్రతిపాదించారు. ఇప్పటికే రాయదుర్గం-కళ్యాణదుర్గం మధ్య రైల్వేలైన్ ఉంది. కొత్తది నిర్మిస్తే రాయదుర్గం నుంచి అనంతపురానికి రైల్వే లైన్ అందుబాటులోకి వస్తుంది.

గూడూరు నుంచి దుగరాజపట్నం వద్ద నిర్మించే పోర్టుకు రైల్వే లైన్ నిర్మాణం కోసం సర్వే చేసేందుకు ప్రతిపాదించారు. దీనికి 2016లోనే డీపీఆర్ రూపొందించారు. అయితే ఇది గిట్టుబాటు కాదంటూ అప్పట్లో పక్కనపెట్టారు. ఇప్పుడు దుగరాజపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, షిప్ బిల్డింగ్ యూనిట్ నిర్మాణ ప్రతిపాదనలు ఉండటంతో.. రైల్వే లైన్ కోసం మళ్లీ సర్వేచేసి, ప్రతిపాదనలు పంపాలని భావిస్తున్నారు. శ్రీశైల మల్లన్న పుణ్యక్షేత్రానికి రైల్వే లైన్ నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం మీదుగా మార్కాపురం వరకు 290 కి.మీ. మేర కొత్త లైన్ నిర్మించేందుకు ప్రతిపాదించారు. దీనివల్ల అటు హైదరాబాద్ నుంచి, ఇటు మార్కాపురం వైపు నుంచి శ్రీశైలానికి రైలు మార్గం అందుబాటులోకి వస్తుంది.

# సీఎం కుర్చీ కోసం విప్లవం అవసరం లేదు: డీకే శివకుమార్

**కర్ణాటక :** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి చర్చకు వచ్చింది. ఈ విషయంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం స్థానం దక్కాలంటే విప్లవం లేవనెత్తాల్సిన అవసరం లేదని.. కాలమే నిర్ణయిస్తుందని అన్నారు. పార్టీ కోసం తాను చేస్తున్న కృషి అందరికీ తెలుసన్నారు. ఏ సమయంలో తనకు ఏ స్థానం ఇవ్వాలనే విషయంపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సహా పార్టీ కేంద్ర నాయకత్వం కర్ణాటక సీఎం మార్పుపై చర్చలు జరిపినట్లు వస్తోన్న వార్తల గురించి తనకు ఎటువంటి సమాచారం లేదన్నారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై తానెప్పుడూ బహిరంగంగా ప్రకటనలు చేయలేదని శివకుమార్ అన్నారు. ఆ పదవి ఖాళీ అయినప్పుడే మరొకరికి అవకాశం వస్తుందన్నారు. కానీ అలా కావాలని తానెప్పుడూ కోరుకోలేదన్నారు. తాను ప్రజల కోసం పలు పోరాటాలు చేశానని.. కానీ పదవి కోసం ఎప్పుడూ పోరాడలేదని అన్నారు.

**మాది పాలు-తేనె వంటి బంధం: సిద్ధరామయ్య**

సీఎం స్థానం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు మధ్య విభేదాలు నెలకొన్నట్లు వస్తున్న వార్తలను సిద్ధరామయ్య కొట్టిపడేశారు. అవన్నీ ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలని అన్నారు. డీకే శివకుమార్‌కు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేల ఫోన్లను తాను ట్యాపింగ్ చేయించినట్లు విపక్ష నేత ఆర్.అశోక్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలు-తేనె వంటి తమ బంధాన్ని ఎలాగైనా నాశనం చేయాలనే ఉద్దేశంతోనే వారు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

# వాట్సప్ చాట్‌ల ఆధారంగా విడాకులివ్వలేం: బాంబే హైకోర్టు

**న్యూఢిల్లీ :** ఓ జంట విడాకుల కేసులో బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం వాట్సప్ చాట్‌ల ఆధారంగా చేసిన క్రూరత్వం ఆరోపణలు పరిగణనలోకి తీసుకుని విడాకులు మంజూరు చేయలేమని పేర్కొంది. ఈ క్రమంలోనే గతంలో ఫ్యామిలీ కోర్టు మంజూరు చేసిన విడాకుల ఉత్తర్వులను పక్కన పెట్టింది. ఈ కేసులో భార్యకు తన వాదనలను వినిపించేందుకు కింది కోర్టు అవకాశం ఇవ్వలేదని తెలిపింది.

భార్య నుంచి విడాకులు కోరుతూ ఓ వ్యక్తి గతంలో నాసిక్ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. భార్యతో చేసిన వాట్సప్ చాట్‌ల వివరాలను సమర్పించాడు. అందులో కాపురాన్ని నాసిక్ నుంచి పుణెకు మార్చాలని ఆమె డిమాండ్ చేసిందని, అత్త, వదినలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిందని పేర్కొన్నాడు. ఈ ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. వాట్సప్ చాటింగ్ ద్వారా ఆమె భర్తపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు యత్నించారని, ఎమోషనల్ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డారని, అసభ్యకరమైన భాషను ఉపయోగించారని తెలిపింది. ఈ నేపథ్యంలో క్రూరత్వం కింద అతడు విడాకులకు అర్హుడని తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

**సీఎం కుర్చీ కోసం విప్లవం అవసరం లేదు: డీకే శివకుమార్**

దీన్ని సవాల్ చేస్తూ ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో తన వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వకుండా ఫ్యామిలీ కోర్టు ఏకపక్షంగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ పిటిషన్ విచారించిన ఉన్నత న్యాయస్థానం.. ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన



తీర్పును కొట్టేసింది. "భర్త సమర్పించిన సాక్ష్యాలను (వాట్సప్ చాట్‌లు) ఖండించేందుకుగానూ కుటుంబ న్యాయస్థానం ఆమెకు అవకాశం ఇవ్వలేదు. కేవలం వాట్సప్ చాట్‌లపై ఆధారపడి, విడాకులను మంజూరు చేయలేం. ఎందుకంటే ప్రధాన సాక్ష్యాల ద్వారా నిరూపితం కాలేదు" అని పేర్కొంది.

ఈ కేసును మళ్లీ విచారించాలంటూ ఫ్యామిలీ కోర్టుకు పంపింది. ఈసారి భార్యకూ వాదనలు వినిపించేందుకు, సాక్ష్యాలను సమర్పించేందుకు అవకాశం ఇవ్వాలని ఆదేశించింది. అదే సమయంలో ఈ జంట తిరిగి కలిసివుండేందుకు మధ్యవర్తిత్వం అవకాశాలనూ పరిశీలించాలని సూచించింది.

# పెంటగాన్ నివేదిక లీక్ అమెరికా వద్ద తగ్గిపోతున్న క్షిపణి నిల్వలు

(మొదటి పేజీ తరువాయి)

నిల్వ చేసినట్లు చెప్పారు. ఇరాన్‌పై దాడులు మరో 5వారాలు కానీ..అంతకంటే ఎక్కువకాలం కానీ కొనసాగొచ్చని పేర్కొన్నారు.

# జగన్, భూమన, వైవీ సుబ్బారెడ్డి ఆర్గనైజ్డ్ క్రైమ్ చేశారు : పంచుమర్తి అనురాధ

(మొదటి పేజీ తరువాయి)

జరిగిందని ఎన్డీడీబీ నివేదిక ఇచ్చింది. ఇది కుంభకోణమే కాదు.. హిందుత్వంపై దాడి. మాజీ సీఎం జగన్, తితిదే మాజీ ఛైర్మన్లు భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఆర్గనైజ్డ్ క్రైమ్ చేశారు" అని పంచుమర్తి అనురాధ అన్నారు.

# ఆ దేశాలపై అమెరికా యుద్ధం రూ.లక్షల కోట్ల ఖర్చు

(మొదటి పేజీ తరువాయి)

సిరియా, యెమెన్, సోమాలియా, లిబియా, నైజీరియాలపై వైమానిక దాడులు జరిపింది. ఇటీవల వెనెజువెలాపై సైనిక చర్య చేపట్టిన అగ్రరాజ్యం, తాజాగా ఇరాన్‌పైనా మరోసారి భీకర దాడులు చేస్తోంది.

**అమెరికా కన్నేస్తే.. ప్రపంచ నేతలూ తప్పించుకోలేరు..!**

బ్రౌన్ యూనివర్సిటీ వాట్సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్ ప్రకారం.. రెండున్నర దశాబ్దాల్లో అమెరికా యుద్ధాల కారణంగా దాదాపు తొమ్మిది లక్షలమందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. వీరిలో దాదాపు సగం మంది సామాన్యులేనని చెప్పింది. ఆహారం, వైద్యం, యుద్ధ సంబంధిత వ్యాధులతో అనేక మంది మరణించినట్లు తెలిపింది.

ఇలా రెండు దశాబ్దాలకుపైగా సైనిక చర్యల కోసం అమెరికా దాదాపు 5.8 ట్రిలియన్ డాలర్లు ఖర్చుపెట్టినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటితోపాటు రానున్న రోజుల్లో మాజీ సైనికుల ఆరోగ్య సంరక్షణ కోసం మరో 2.2 ట్రిలియన్ డాలర్లు అవసరం అవుతాయని తెలుస్తోంది. మొత్తంగా 2001 నుంచి యుద్ధాలపై అమెరికా పెట్టే ఖర్చు సుమారు 8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా.

# హర్మూజ్‌లో చమురు నౌకలకు అమెరికా నేవీ రక్షణ: ట్రంప్ హామీ

(మొదటి పేజీ తరువాయి)

ఇతర గ్యారెంటీలన్నీ తక్షణమే అందించాలని యూఎస్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఆదేశించినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ ప్రకటన తర్వాత చమురు మార్కెట్లు స్వల్పంగా కోలుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర 73 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇటీవల ఇది 80 డాలర్లకు పైనే ట్రేడ్ అయిన సంగతి తెలిసిందే. హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నామని, ఆ దిశగా నౌకలు వస్తే నిప్పు పెడతామని ఇరాన్ నిన్న హెచ్చరించింది. దీంతో ఈ మార్గంలో చమురు రవాణా స్తంభించింది. హర్మూజ్‌కు అటూఇటూ వందల సంఖ్యలో నౌకలు నిలిచిపోయినట్లు మారిటైమ్ అనలిటిక్స్ సంస్థల గణాంకాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే ట్రంప్ నుంచి ప్రకటన వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# అమెరికా కన్నేస్తే.. ప్రపంచ నేతలూ తప్పించుకోలేరు




**అమెరికా :** మదురో నిర్బంధం.. ఖమేనీ మృతి.. యావత్ ప్రపంచాన్ని ఉలికిపాటుకు గురిచేసిన ఘటనలివి. నిత్యం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉండే నేతలను సైతం అమెరికా గురిపెట్టి తమ లక్ష్యాలను సాధించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అమెరికా కన్నేస్తే ప్రపంచ నేతలూ తప్పించుకోవడం కష్టమే అనే సందేశాన్నిస్తోంది. అగ్రరాజ్య శత్రువుల కదలికలను కనిపెట్టడంలో ఆ దేశ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఏఐ) వ్యవస్థ అత్యంత కీలకం.

**ప్రచ్ఛన్న యుద్ధం నాటినుంచే..**

ప్రపంచ స్థాయి నేతలపై అమెరికా (USA) నిఘా పెట్టడం ప్రచ్ఛన్న యుద్ధం నాటి నుంచే ఉంది. ఆయా నేతల కదలికలు, సంభాషణలను యూఎస్ నిఘా సంస్థలు గుర్తిస్తున్నాయని గతంలో అనేకసార్లు కథనాలు వచ్చాయి. చైనా నాయకులు, ఆ దేశ అణ్వాయుధ కార్యక్రమాలను ట్రాక్ చేసేందుకు అమెరికా ప్రయత్నించిందని 14 ఏళ్ల క్రితం వికీలీక్స్ సంచలన పత్రాలు విడుదల చేసింది. జర్మనీ మాజీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ కూడా ఈ నిఘా బారిన పడ్డవారే. తన వ్యక్తిగత సెల్‌ఫోన్‌ను తమ మిత్ర దేశమే ట్యాప్ చేసిందని మెర్కెల్ గతంలో వెల్లడించారు. దీనిపై నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాకు ఫిర్యాదు కూడా చేసినట్లు వార్తలు వచ్చాయి.

**మదురో నివాసం నమూనాతో..**

ఈ ఏడాది జనవరిలో వెనెజువెలా నేత మదురోను నిర్బంధించడంలో కూడా సీఐఏ ప్రధాన పాత్ర పోషించింది. గతేడాది ఆగస్టులోనే ఈ ఏజెన్సీ బృందం వెనెజువెలా వెళ్లి కారకాస్ చుట్టుపక్కల మదురో (చీఅఎశీశ్రీఖం మీఖంబతీశీ) కదలికలపై నిఘా వేసింది. సన్నిహిత వ్యక్తుల నుంచి సమాచారం సేకరించింది. మదురో తిరిగే ప్రదేశాలపై స్పష్టమైన మ్యాప్ తయారుచేసింది. ఆయన ఇంటి నమూనాను కెంటకీలో సృష్టించి తలుపులు ఎలా బద్దలు కొట్టాలన్న దానిపై అమెరికా దళాలు సాధన చేశాయి. ఇలా పక్కా ప్రణాళికతో ఆపరేషన్ నిర్వహించి మదురోను బంధించి అగ్రరాజ్యానికి తీసుకురాగలిగింది.

**ఎలక్ట్రానిక్ సెన్సర్లతో..**

ఈ మధ్య సాంకేతికతను ఎక్కువగా వినియోగించుకుని వీఐపీల కదలికలపై అమెరికా నిఘా పెడుతున్నట్లు సమాచారం. వీధులు, డోర్‌బెల్ కెమెరాలు, టోల్ హైవేలపై ఎలక్ట్రానిక్ సెన్సర్ల వినియోగం పెరుగుతోంది. ఈ సెన్సర్లను హ్యాక్ చేసి కృత్రిమ మేధ సాయంతో బిలియన్ల కొద్దీ డేటాను సేకరించే వీలవుతుంది. తద్వారా ప్రముఖుల కదలికలను ఇట్టే పసిగట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. అత్యంత కట్టుదిట్టమైన ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ డోర్లను ఎలా తెరవాలి.. విదేశీ నేతల బాడీగార్డులు, కుటుంబసభ్యుల వ్యక్తిగత సెల్‌ఫోన్ల లొకేషన్లను ఎలా గుర్తించాలి అన్న వాటిపై ప్రపంచవ్యాప్తంగా స్పై ఏజెన్సీలకు శిక్షణ ఉంటుంది.

**నాడే ఖమేనీకి ట్రంప్ వార్నింగ్..**

ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ కూడా ఎప్పటినుంచో సీఐఏ రాడార్‌లో ఉన్నారు. ఆ విషయాన్ని దాదాపు ఎనిమిది నెలల కిందటే గతేడాది జూన్‌లో ట్రంప్ స్వయంగా వెల్లడించారు. "ఇరాన్ గగనతలం పూర్తిగా మా నియంత్రణలో ఉంది. సుప్రీం లీడర్ దాక్కొన్న కచ్చితమైన లొకేషన్ మాకు తెలుసు. అతడు మాకు సులువైన టార్గెట్. కానీ, ప్రస్తుతానికి చంపాలనుకోవడం లేదు. లొంగిపోయే అవకాశం ఇస్తున్నాం" అని నాడు ట్రంప్ పోస్ట్ చేశారు. అయితే, ఈ హెచ్చరికలను ఇరాన్ గానీ, ఖమేనీ గానీ పట్టించుకోనట్లు తెలుస్తోంది. మరోవైపు, టెహ్రాన్‌లోని ట్రాఫిక్ కెమెరాలు, ఫోన్ నెట్‌వర్క్‌ను ట్రాక్ చేసి ఖమేనీ కదలికలపై అగ్రరాజ్యం నిఘా పెట్టింది. ఈ క్రమంలోనే ఫిబ్రవరి 28న ఖమేనీ తన అధికారిక నివాసంలో సమావేశంలో ఉండగా అమెరికా ఇచ్చిన నిఘా సమాచారంతో ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది.

# ఫ్రీ షాప్.. ఇక్కడన్నీ ఉచితమే



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** విశాఖపట్నం: వినియోగించని దుస్తులు, వస్తువులను అవసరమైనవారికి ఇవ్వాలని కొందరు ఆలోచిస్తుంటారు. సరైన దుస్తులు లేక, కొత్తవి కొనుక్కోలేక మరికొందరు సాయం కోసం ఎదురుచూస్తుంటారు. ఇలా ఉన్నవారికి.. లేనివారికి మధ్యలో అంతరం పూరించాలని నిర్ణయించుకున్నారు విశాఖకు చెందిన దంపతులు విజయ్, నీరజ. గతేడాది సెప్టెంబరులో 'ఫ్రీ షాప్' పేరిట ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనికి కొందరు స్నేహితులు సహకరిస్తున్నారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో దాతల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు 3000 మందికి పైగా అవసరార్థులకు దుస్తులు, ఇతర వస్తువులు అందజేశారు. ప్రతి ఆదివారం కార్యకలాపాలు: విజయ్, నీరజ గతంలో స్వచ్ఛంద సంస్థ ద్వారా వైద్య శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. పిల్లలు యుక్త వయసుకు రావడంతో వీరి సమయాన్ని సమాజానికి ఉపయోగపడే పనులకు వినియోగించాలనుకున్నారు. అక్కయ్యపాలెంలో పోర్టు స్టేడియం వెనుక వీరి నివాసం. ఇంటి వద్ద ఒక చిన్న గదిలో 'ఫ్రీ షాప్' పేరిట దుకాణం ప్రారంభించారు. ప్రతి ఆదివారం ఉదయం 9 గంటలకే ఆ దుకాణం తెరచుకుంటుంది. అక్కయ్యపాలెం, నరసింహనగర్, గణేశ్‌నగర్, కంచరపాలెం, మురళీనగర్ తదితర ప్రాంతాలకు చెందినవారు వస్తున్నారు. ప్రతి ఒక్కరు ఎవరినీ అడగకుండానే తమకు నచ్చిన ఏదైనా ఒక వస్తువు తీసుకుని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు పలువురికి దుస్తులు, విద్యుత్తు ఉపకరణాలు, వంట వస్తువులు, ఫ్యాన్లు, షూలు, కళ్లద్దాలు.. ఇలా వివిధ రకాలు అందజేశారు. వారంలో ఒక రోజు: దాతల నుంచి దుస్తులు, వస్తువులు అందుతున్నాయి. కొందరు దుకాణానికి తీసుకొచ్చి ఇస్తుండగా.. ఒక్కోసారి దాతల వద్దకే వెళ్లి సేకరిస్తున్నారు. పొరుగు ప్రాంతాల నుంచి మరికొందరు పార్సిల్స్ పంపిస్తున్నారు. దుకాణానికి వచ్చిన దుస్తులను పిల్లలు, పెద్దలు, స్త్రీ, పురుషుల అవసరాలను బట్టి వేరు చేస్తారు. వాటన్నింటినీ ఉతికి, ఇస్త్రీ చేసి దుకాణంలో అందుబాటులో ఉంచుతారు. వారంలో ఒక రోజు ఈ పనులన్నీ చేసుకుంటారు. ఈ దంపతులకు మరో 15 మందికి పైగా స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు. ఇకపై ప్రతి నెల రెండో శనివారం అవసరంలో ఉన్న వారి వద్దకే వాటిని తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ నెలలో మల్కాపురంలో 1000 మందికి అందించాలనే లక్ష్యంతో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# క్షణికావేశంలో నిర్ణయం వద్దు..ఒక్క క్షణం ఆలోచించండి

**అనకాపల్లి, విశాఖసమాచారం:** అనకాపల్లి పట్టణం, చింతపలి, 'మమ్మీ.. డాడీ.. ప్రేమించిన వ్యక్తిని మరచిపోలేకపోతున్నా. మిమ్మల్ని మోసం చేయలేను. ప్రేమించిన అబ్బాయిని విడిచి ఉండటం నావల్ల కావడం లేదు. ఏదోలా ఉంది. ఏమీ అనుకోవద్దు. చెల్లి, తమ్ముడు జాగ్రత్త' అంటూ విశాఖలో ఫిజియోథెరపీ విద్యార్థిని రజిని (21) ఈ నెల 25న ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ప్రేమించినమరదలితో పెళ్లికి ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదన్న కారణంతో చింతపల్లి సాయినగర్‌కి చెందిన మోస సాయి (20) ఈ నెల 26న చెట్టుకు ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. పిల్లలు పుట్టగానే తల్లినయ్యాయని అమ్మ ఎంతో మురిసిపోతుంది. తనకు వారసుడొచ్చాడని నాన్న ఎంతో ఆనందిస్తారు. వారు పెరిగి పెద్దవారై తమ కలలను నిజం చేస్తారన్న ఆశతో బతుకుతారు. ప్రేమో, మరో కారణంతోనో ప్రాణాలు తీసుకుంటే తల్లిదండ్రుల కడుపుకోత అంతా ఇంతా కాదు. పేగు బంధం దూరమైతే కలిగే బాధ అది అనుభవించే వారికే తెలుస్తుంది.

అమ్మ తిట్టిందనో, నాన్న కొట్టారనో, పరీక్ష తప్పారనో, ఎంత చదివినా బుర్రకెక్కడం లేదనో, భార్య కోప్పడిందనో, ప్రేమించిన యువతితో పెళ్లి జరగలేదని, కోరుకున్న వాడితో పెళ్లి కాలేదని.. ఇలా చిన్న చిన్న కారణాలకే తీవ్ర మనస్తాపానికి గురై ప్రాణాలు తీసుకుంటూ బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. చింతపల్లి మండలం అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో కప్పగొంది గ్రామంలో కందుల చంద్రకళ (22) సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తోందని ఆమె తల్లి గట్టిగా మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది.

ఇలా గెలుద్దాం జీవితంలో విఫలం అయ్యామనే భావనతో ఆవేదనకు గురైనప్పుడు సానుకూల దృక్పథం కలిగించే అంశాలపై దృష్టి సారించాలి. యోగా, ధ్యానం, మార్షల్ ఆర్ట్స్, ఆటలు, పాటలు వంటి ఏదో ఒక రంగంలో శిక్షణ పొందితే మేలు. వీలైనంత వరకు నలుగురి మధ్యలో గడపాలి. ఫలితంగా జీవితంలో ఏదైనా సాధించాలన్న పట్టుదల అలవడుతుంది. తద్వారా ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన దూరమవుతుంది.

బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్న వారిలో యువత, మధ్యవయస్కులు అధికంగా ఉంటున్నారు. కుటుంబానికి ఆధారంగా నిలవాల్సిన వ్యక్తులు దూరం కావడంతో ఆ కుటుంబం కోలుకోలేని ఆవేదనలో కూరుకుపోతోంది.



దూరమైన వారి జ్ఞాపకాలతోనే జీవితాంతం బాధపడుతూ ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఓదార్పు అవసరం: చాలావరకూ బలవన్మరణాలన్నీ క్షణికావేశంలో జరిగేవే. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు ఏదో ఒక సమయంలో తల్లిదండ్రులు, స్నేహితులు, తాము ఇష్టపడే వారితో సమస్యను పంచుకుంటారు. ఆ సమయంలో వారిలో ఆత్మస్థైర్యం నింపే ప్రయత్నం చేయాలి. కుంగుబాటులో ఉన్న యువతకు దాని గురించి తెలియదు. సంతోషం లోపించడం, ఎక్కువగా ఒంటరితనాన్ని కోరుకోవడం, విడిగా ఉండిపోవడం, ముభావంగా

**జిల్లాలో రెండేళ్లలో ఆత్మహత్యలకు పాల్పడిన వారి వివరాలివీ..**

| సంవత్సరం | పురుషులు | మహిళలు | బాలుడు | బాలికలు | మొత్తం |
|---|---|---|---|---|---|
| 2024 | 137 | 32 | 1 | 5 | 175 |
| 2025 | 111 | 41 | 4 | 5 | 161 |

ఉండటం వంటి లక్షణాలను గమనించాలి. తల్లిదండ్రుల నిశిత పరిశీలన అవసరం: ఇటీవల కాలంలో యువత సెల్‌ఫోన్‌తోనే ఎక్కువగా కాలక్షేపం చేస్తున్నారు. ఇది కొన్నిసార్లు అనేక అనర్థాలకు దారితీస్తోంది. చెడు ఆలోచనల వైపు ఉసిగొల్పేలా పలు ఉదంతాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంట్లో తల్లిదండ్రులు, విద్యాలయాల్లో గురువులు, బయట స్నేహితులు ఇలా నిత్యం ఎవరో ఒకరి పరిశీలన ఉండాలి. యువతలో చెడు ఆలోచనలు రాకుండా ఉండాలంటే వారిలో మానసిక పరివర్తన పెరగాలి.

# నకిలీ కరెన్సీ చలామణి కేసులో ఏడుగురికి జైలుశిక్ష

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** భారతీయ నకిలీ కరెన్సీ నోట్లు చలామణి చేసిన కేసులో ఏడుగురు నిందితులకు విశాఖలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక కోర్టు శిక్ష విధించింది. ఆ వివరాలు... అస్సాం, పశ్చిమబెంగాల్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఎస్.హుస్సేన్, రుస్తుమ్, అమీరుల్ హక్, మహ్మద్ హకీమ్ షేక్, సద్దామ్ హుస్సేన్, సయ్యద్ ఇమ్రాన్, మహ్మద్ అక్బర్ ఆలీని నిందితులుగా గుర్తించారు. 2015లో వారు ఇండో- బంగ్లాదేశ్ సరిహద్దు మార్గం ద్వారా నకిలీ కరెన్సీ నోట్లను అక్రమంగా దేశంలోకి తీసుకొచ్చి పలు ప్రాంతాల్లో చలామణి చేసినట్టు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. నిందితుల్లో ఎస్.హుస్సేన్, అమీరుల్ హక్‌కు పదేళ్ల చొప్పున సాధారణ జైలు శిక్ష, రూ.5 వేలు చొప్పున జరిమానా, రుస్తుమ్‌కు ఏడేళ్ల సాధారణ జైలు, రూ.2 వేల జరిమానా, మహ్మద్ హకీమ్ షేక్‌కు ఎనిమిదేళ్ల సాధారణ జైలు, రూ.5 వేలు జరిమానా, సద్దామ్ హుస్సేన్‌కు, సయ్యద్ ఇమ్రాన్‌కు, మహ్మద్ అక్బర్ ఆలీకు ఏడేళ్ల చొప్పున సాధారణ జైలు, రూ.2 వేలు చొప్పున జరిమానా విధించారు. నిందితులు జరిమానా చెల్లించని పక్షంలో అదనపు కాలం జైల్లో ఉండాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. 2015 డిసెంబరులో ఎన్ఐఏ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టింది. 2016 జులైలో ఎస్.హుస్సేన్‌పై తొలి ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా, మిగిలిన ఆరుగురిపై 2018, 2019లో అదనపు ఛార్జ్‌షీట్లు దాఖలు చేసింది. ఎన్ఐఏ విశాఖపట్నంలో నమోదు చేసిన మరో కేసులో నిందితుడు సయ్యద్ ఇమ్రాన్ దోషిగా తేలాడు

# అధికారులు తెరవెనుక.. అక్రమ నిర్మాణాలు చకచకా



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగాన్ని కొందరు అధికారులు అవినీతికి చిరునామాగా మార్చేశారు. అనధికార నిర్మాణాలు, ప్లాన్ ఉల్లంఘనలకు పాల్పడినవారికి ధైర్యంగా సహకరిస్తూ దర్జాగా జేబులు నింపేసుకుంటున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో చక్రంతిప్పిన కొందరు అధికారులు కూటమి ప్రభుత్వంలోనూ కీలక జోన్‌లలో పని చేస్తున్నారు. ఇన్‌ఛార్జి మంత్రి, మాజీ మేయర్ దృష్టికి పట్టణ ప్రణాళిక విభాగంపై ఫిర్యాదులందితే అధికారుల తీరుపై బహిరంగంగానే అసహనం వ్యక్తం చేసిన సందర్భాలెన్నో. ఇటీవల గాజువాక ఏసీపీ అక్రమాలు ఇవిగో అంటూ అమరావతిలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు అందింది. కొందరు ఆక్రమణలు, అనధికార నిర్మాణాల జాబితా దగ్గర పెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. ఆ నేత ప్రాజెక్టులున్నచోటే విధులు: ఓ అధికారి కాకినాడలో కీలక హోదాలో పని చేస్తూ స్టేడియం స్థలానికి ఏకంగా రూ.128 కోట్ల మేర టీడీఆర్ బాండ్లు మంజూరు చేశారు. ఆ బాండ్లను విశాఖలో సిరిపురం వద్ద వైకాపా నేత చేపట్టిన ఓ ప్రాజెక్టుకు ఉపయోగించారు. ఆ సమయంలో సదరు అధికారిని బదిలీపై తెచ్చి విశాఖలో నియమించారు. మధురవాడ జోన్ పరిధిలోని సదరు వైకాపా నేత ప్రాజెక్టులన్నింటికీ ప్లాన్ అనుమతులు, టీడీఆర్ బాండ్లు ఇవ్వడంలో ఈ అధికారే కీలకంగా వ్యవహరించారని, ప్రస్తుతం హోదా మారినా ఇంకా వైకాపా నేతలకు అనుకూలంగానే కొమ్ముకాస్తున్నట్లు చర్చ సాగుతోంది. పట్టణ ప్రణాళిక విభాగంలో ఓ కీలక అధికారి అండదండలుండటంతో ఫిర్యాదులు ఎన్ని వెళ్లినా చర్యలుండటం లేదని సమాచారం. ఫిర్యాదులు చేస్తున్నా.. పట్టించుకోరు: మిథిలాపురి వంద అడుగుల రోడ్డులో ఓ చోట వెయ్యి గజాల ప్రైవేటు స్థలం ఉంది. జీవీఎంసీ ప్లాన్ అనుమతు ల్లేకుండా ఇక్కడ వాణిజ్య నిర్మాణం సాగుతుందంటూ, వైకాపాకు చెందిన ఓ మాజీ కార్పొరేటర్ ఈ నిర్మాణం చేపట్టారని కూటమి నేతలు ఫిర్యాదులు చేశారు. మధురవాడ జోన్‌లోని ఏసీపీ, ప్లానింగ్ కార్యదర్శిని కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, వైకాపా నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెదేపా వాణిజ్య విభాగ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి పి. వెంకట్రావు జీవీఎంసీ పీజీఆర్ఎస్‌లో ఈనెల 2న పట్టణ ప్రణాళిక డీసీపీకి ఫిర్యాదు చేశారు. నాడు మంత్రి బంధువుగా: మధురవాడ జోన్‌లో పనిచేస్తున్న ఓ అధికారి వైకాపా హయాంలో అప్పటి ఓ మంత్రి బంధువునంటూ చక్రం తిప్పారు. కూటమి అధికారంలోకి రాగానే బదిలీపై వెళ్లగా, నెలల వ్యవధిలోనే తిరిగి మధురవాడ జోన్‌కే వచ్చారు. వివిధ అంశాలపై శాఖాపరమైన విచారణ సైతం జరిగింది. గతంలో మధురవాడ జోన్‌లో పని చేసిన ఓ అధికారి బదిలీ అయినా మళ్లీ ఇక్కడికే వచ్చారు. నగరంపాలెంలో టీడీఆర్ బాండ్ల జారీ విషయంలో సదరు అధికారి కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణ లున్నాయి. బీ ప్రస్తుతం ఈ అధికారికి, వైకాపా మాజీ మంత్రి బొంధువుగా చెప్పుకున్న అధికారికి వసూళ్ల విషయంలో వాగ్వాదాలు జరుగుతున్నట్లు సమాచారం.

# వృక్షశాస్త్రం పరిశోధనలతో గుర్తింపు

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** జ్ఞానాపురం, మొక్కల్లో దాగి ఉన్న ఔషధ గుణాలను వెలికితీసేందుకు ఆమె అహర్నిశలు కృషి చేస్తుంటారు. వాటితో మానవాళికి ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో.. తెలియజెప్పేందుకు తపిస్తుంటారు. ఆ తపనే ఆమెను పరిశోధకురాలిగా, విజ్ఞానశాస్త్రాల గ్రంథ రచయితగా నిలబెట్టింది. ఆమే విశాఖకు చెందిన డాక్టర్ కంభం మాణిక్యకుమారి. తొలి నుంచీ ఆసక్తి: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో వృక్షశాస్త్ర విభాగాధిపతిగా పని చేస్తున్న మాణిక్యకుమారి ఏయూలో పీజీ పూర్తి చేసి, అనంతరం ఔషధమొక్కలపై పీహెచ్‌డీ చేశారు. ఆమెకు తొలినుంచీ మొక్కలపై పరిశోధనలంటే ఆసక్తి. అటవీ ప్రాంతంలోని అరుదైన మొక్కల్ని తీసుకొచ్చి కళాశాల ఆవరణలో, ఇంటి వద్ద సంరక్షిస్తున్నారు. ఇవీ విజ్ఞానశాస్త్ర రచనలు: మొక్కల పెంపకం, వాటిల్లోని ఔషధ గుణాలపై దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ఐదుగురు శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు, 90 మంది రీసెర్చ్ స్కాలర్స్ సమకూర్చిన పరిశోధన పత్రాలను మిళితం చేసి 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్‌వాల్యూ ఎడిషన్ టు ప్లాంట్స్ అండ్ ప్రొడక్ట్స్' అనే పుస్తకాన్ని రూపొందించారు. ఔషధ మొక్కల్లోని జీవ రసాయనాలతో కాలేయ సంబంధిత వ్యాధులను ఎలా నయం చేయొచ్చు..? అనే అంశాలతో గ్రంథం రాసి పీహెచ్‌డీ పొందారు. విద్యార్థుల సౌలభ్యం కోసం 'హ్యాండ్ బుక్ ఆన్ నర్సరీ మేనేజ్‌మెంట్' అనే పుస్తకాన్ని సిద్ధం చేశారు. 'బయోలాజికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్ బయోయాక్టివ్ మాలిక్యూల్స్ ఫ్రమ్ సెలెక్టెడ్ ట్రెడిషనల్ మెడిసిన్ ప్లాంట్ ఆఫ్ ఇండియా' పేరిట ఓ పుస్తకాన్ని ప్రచురించారు. బయోలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెలువడే



మాణిక్యకుమారి రచించిన పుస్తకం

బయోప్లాష్ మ్యాగజైన్‌కు వృక్షశాస్త్రంపై తరచూ వ్యాసాలు రాస్తుంటారు. సేవలు- పురస్కారాలు: ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీకి రాష్ట్ర స్థాయి రిసోర్స్‌పర్సన్‌గా కొనసాగుతూ.. ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణిగా వాలంటీర్లతో కలిసి తరచూ సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు. ఆమె సేవలకు గుర్తింపుగా... రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు, రాష్ట్ర ఉత్తమ ఎన్ఎస్ఎస్ అధికారి అవార్డు, రాష్ట్ర ఎమినెంట్ క్రిస్టియన్ పర్సన్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డుతో పాటు యూజీసీ, సీఎస్ఆర్, ఎన్ఈటీ, జేఆర్ఎఫ్ ఫెలోషిప్ అవార్డులు, యూజీసీ టీచర్ ఫెలోషిప్ పురస్కారాలు దక్కాయి.

# కాలువలు ఆక్రమించి నిర్మాణాలు



**అనకాపల్లి, విశాఖసమాచారం:** అనకాపల్లి పట్టణంలోని ప్రధాన కాలువలు ఆక్రమణల చెరలో చిక్కుకున్నాయి. పట్టణం మీదుగా వెళ్తున్న ఎల్లయ్య, చెర్లోపల్లి కాలువలు క్రమంగా కుంచించుకుపోతున్నాయి. పట్టణ పరిధిలో ఈ కాలువల నిర్వహణ మున్సిపల్ అధికారులు చూడాల్సి ఉన్నా.. పట్టించుకోవడంలేదు. దీంతో అక్రమార్కులు కాలువలను ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేస్తున్నారు. దీంతో మురుగునీరు, సాగునీరు కలిసిపోయి.. దుర్గంధం పెరుగుతోంది. దోమల బాధ ఎక్కువవుతోంది. శారదా నదికి కుడివైపు పులి కాలువ.. ఎడమవైపు చెర్లోపల్లి, ఎల్లయ్య కాలువలున్నాయి. వీటిలో ఎల్లయ్యకాలువ పట్టణం మీదుగా వెళ్తుంది. చెర్లోపల్లి, నాగులాపల్లి కొన్ని ప్రాంతాల మీదుగా ప్రవహిస్తాయి. పట్టణంలోని మురుగంతా అనకాపల్లి ఆవఖండం నుంచి మునగపాక మండలం తోటాడ రెగ్యులేటర్‌కు చేరేది. కొన్నేళ్లుగా పట్టణం విస్తరిస్తుండటం.. జనాభా పెరగడంతో 2007 సమయంలో పట్టణంమీదుగా వెళ్లే ఎల్లయ్య కాలువలో సాగునీరు, పట్టణంలోని మురుగునీరు వేరువేరుగా వెళ్లేలా గతంలో ఏర్పాటు చేశారు. శంకరం దగ్గర మురుగుశుద్ధి కేంద్రాన్ని కూడా కట్టారు. శివారుకు వెళ్లేసరికి మురుగు, సాగునీరు కలిసిపోతున్నాయి. పట్టణంలోని మురుగంతా శంకరం దగ్గర శుద్ధి కేంద్రానికి వెళ్లాలి. దానికి చేరేందుకు పట్టణంలో మూడుచోట్ల సంపులు ఏర్పాటు చేశారు. కానీ.. క్షేత్రస్థాయిలో అలా జరగడంలేదు. శుద్ధి కేంద్రానికి అంతంతమాత్రంగానే మురుగు చేరుతోంది. అత్యధికం ఆవఖండంలోకే వెళ్తోంది. పరిశీలించి చర్యలు తీసుకుంటాం..: పట్టణ పరిధిలో ఎప్పటికప్పుడు ప్రధాన కాలువల నిర్వహణ పనులు చేస్తున్నాం. కొన్ని చోట్ల మురుగు తీసేందుకు వీలు లేకుండా నిర్మాణాలు చేశారు. వాటిని గుర్తిస్తున్నాం. వాటిని తొలగించి.. పట్టణంలో మురుగు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

**కాలువలు ఆక్రమించి నిర్మాణాలు..** మురుగు, సాగునీటి కాలువలు వేర్వేరుగా కట్టిన సమయంలో వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు ఇరువైపులా పది అడుగులు ఖాళీ స్థలాన్ని అప్పట్లో విడిచిపెట్టారు. కానీ.. పట్టణంతోపాటు శివారు ప్రాంతాల్లో కాలువలను ఆనుకుని ఇళ్లు, భవనాలు కట్టేస్తున్నారు. కొన్ని చోట్ల కాలువలనే ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేస్తున్నారు. దీంతో మురుగు తీసేందుకు వీలు లేక ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతోంది. వెలపుల వీధిలో మొత్తం కాలువ గట్టును ఆనుకుని కట్టేశారు. దీని వల్ల కాలువలో చెత్త తీసేందుకు వెళ్లేందుకు ఆస్కారం లేకుండాపోయింది. లక్ష్మీదేవిపేటలో ఓ ప్రైవేటు పాఠశాల కాలువను ఆనుకుని ప్రహరీ నిర్మించేశారు. వీటి అనుబంధ కాలువలు పూర్తిగా ఆక్రమించి నిర్మాణాలు చేశారు. వీటి అనుబంధ కాలువలు పూర్తిగా ఆక్రమించి నిర్మాణాలు చేశారు.

# ధర దక్కక వేదన.. దగాపడి రోదన

**దేవరాపల్లి, విశాఖసమాచారం:** దేవరాపల్లి, కష్టపడి పండించి మార్కెట్ తీసుకొచ్చిన కూరగాయలు అమ్మితే చిల్లర పైసలు కూడా చేతికి రాకపోవడం రైతు కన్నీరుపెడుతున్నాడు. లాభం మాట దేవుడెరుగు.. నష్టాలే మిగులుతుంటే ఎలా మనుగడ సాధిస్తామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దేవరాపల్లి, అనంతగిరి, వేపాడ మండలాలకు చెందిన రైతులు వందలాది ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండిస్తారు. సోమవారం మినహా మిగతా రోజుల్లో వాటిని దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్ తీసుకొచ్చి విక్రయిస్తారు. వ్యాపారులు ఇక్కడ నుంచి కూరగాయలు విశాఖ, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఎగుమతి చేస్తారు. రేట్లు బాగుంటే రోజుకు సుమారు రూ.5 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతుంది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేక రూ. 50 వేల వ్యాపారం జరగడం గగనమవుతోంది. దేవరాపల్లి హోల్‌సేల్ కూరగాయల మార్కెట్లో వారం కిందటి వరకు ధరలు బాగానే ఉండేవి. గతవారం నుంచి ధరలు పూర్తిగా పతనమయ్యాయి. ఒకక్రేటు (30 కేజీలు) టమాటా ధర రూ. 80 లోపే ఉంది. అంటే కేజీకి రూ. 2.5 మించి దక్కలేదు. వంకాయ ధర సైతం క్రేట్ రూ.100 మించడం లేదు. బెండ, బీర తదితర వాటి ధర అంతంతమాత్రంగానే ఉంటున్నాయి.

ధర రాకపోవడంతో విసుగు చెందిన కొంత మంది రైతులు



మంగళవారం దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్కి తీసుకొచ్చిన టమాటాలను రోడ్డుమీద పారబోసి ఇళ్లకు వెళ్లిపోయారు. ఇంకొందరు చేసేది లేక అరువుకు తీసుకోమని చెప్పి ఖాళీ చేతులతో ఇంటిబాట పట్టారు. ఈ పరిస్థితులు చూసి చాలామంది పంట కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు.

# కొత్త పింఛన్లకు ఎదురుచూపులు

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** మునగపాక మండలం ఎం.జగన్నాథపురం గ్రామానికి చెందిన 20 మంది పింఛన్లు మంజూరు చేయాలంటూ ఇటీవల కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామానికి చెందిన జి.పరదేశమ్మ వితంతు పింఛను మంజూరు చేయాలని అధికారుల చుట్టూ గత రెండేళ్లుగా తిరుగుతోంది. కలెక్టరేట్, జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛను పథకంలో నూతన పింఛన్ల మంజూరు కోసం వెల్లువలా దరఖాస్తులు వస్తున్నాయి. అర్జీదారులు కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వృద్ధాప్య, వితంతు పింఛన్లను రూ. 3 వేల నుంచి రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ. 15 వేల చొప్పున పెంచింది. దీంతో పింఛన్ల కోసం డిమాండ్ పెరిగింది. అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తామని ఇటీవల ముఖ్యమంత్రి ప్రకటించడంతో జిల్లాలో ప్రజలు వినతులు అందజేస్తున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌తోపాటు డివిజన్, మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వందల సంఖ్యలో అర్జీలు వస్తున్నాయి. స్వర్ణ గ్రామ, వార్డుల్లో పింఛను కోసం దరఖాస్తు చేస్తున్నారు. పింఛను అందుకుంటున్న భర్త చనిపోయిన సందర్భంలో భార్యకు పింఛను అందిస్తున్నారు తప్ప కొత్త పింఛన్లు ఇవ్వడంలేదు. జిల్లాలో ప్రతి నెల 2,53,987 మందికి రూ. 107 కోట్ల మేర పంపిణీ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 24 మండలాలతోపాటు అనకాపల్లి జీవీఎంసీ, నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీల పరిధిలో వేల సంఖ్యలో అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో మండలంలో 600లకు పైగానే వినతులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో చాలామంది అనర్హులు పింఛను పొందారు. ఇటువంటి వాటిని తొలగించే అధికారం కలెక్టర్లకు ఇచ్చింది. అనుమతులు రాగానే చర్యలు: కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. ప్రస్తుతం పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే తక్షణమే భార్యకు పింఛను మంజూరు చేస్తున్నాం. కొత్త పింఛన్లు మంజూరు కోసం దరఖాస్తులు వస్తున్నాయి. వీటిని తీసుకొని జాబితాలను సిద్ధం చేస్తున్నాం. అనుమతులు రాగానే అర్హులకు మంజూరు చేస్తా,ఒక్కో మండలంలో 600లకు పైగానే వినతులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో చాలామంది అనర్హులు పింఛను పొందారు. ఇటువంటి వాటిని తొలగించే అధికారం కలెక్టర్లకు ఇచ్చింది. అనుమతులు రాగానే చర్యలు: కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. ప్రస్తుతం పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే తక్షణమే భార్యకు పింఛను మంజూరు చేస్తున్నాం. కొత్త పింఛన్లు మంజూరు కోసం దరఖాస్తులు వస్తున్నాయి. వీటిని తీసుకొని జాబితాలను సిద్ధం చేస్తున్నాం. అనుమతులు రాగానే అర్హులకు మంజూరు చేస్తాం.కొత్త పింఛన్లు మంజూరు కోసం దరఖాస్తులు వస్తున్నాయి. వీటిని తీసుకొని జాబితాలను సిద్ధం చేస్తున్నాం. అనుమతులు రాగానే అర్హులకు మంజూరు చేస్తాం.

# కాలుష్యాన్ని నియంత్రిస్తాం

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ఎక్కువ సరకును రవాణా చేయాలనే ఒకే లక్ష్యం కోసం కాకుండా సమయం సద్వినియోగం అయ్యేలా, తద్వారా అన్ని ఖర్చులు తగ్గేలా చూస్తున్నామని పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ రోష్ని అపరంజి తెలిపారు. పోర్టు ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యమని, ప్రతి ఉద్యోగి సంస్థ ప్రగతి కోసం పనిచేయాలన్నారు. పోర్టులో కాలుష్యం తగ్గించే పనులు అన్ని చేపడుతున్నామని, ఒక్క ఫిబ్రవరి నెలలోనే టార్పాలిన్ కప్పకుండా సరకును తరలిస్తున్న 1,191 ట్రక్కులకు జరిమానా విధించామన్నారు. ఆమె మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులు వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...పోర్టును మెకనైజేషన్ చేస్తేనే కాలుష్యం తగ్గుతుంది. ఆ మేరకు 100 శాతం పనులు పూర్తి చేశాం. పోర్టులో 176 కి.మీ. పొడవైన ఇన్నర్ రైల్వే ట్రాక్ ఉంది. ఇప్పుడు 'ఇంజన్ ఆన్ లోడింగ్' అనే విధానంలో రైలు సైడింగ్ (ట్రాక్)పై ఉండగానే సరకును లోడింగ్ చేసేలా వ్యవస్థను ఆధునికీకరిస్తున్నాం. ఈ పనులు కూడా 95 శాతం పూర్తయ్యాయి. పోర్టులో కాలుష్యం తగ్గించే పనులు అన్ని చేపడుతున్నాం. ఒక్క ఫిబ్రవరి నెలలోనే టార్పాలిన్ కప్పకుండా సరకును తరలిస్తున్న 1,191 ట్రక్కులకు జరిమానా విధించాం. గత నవంబరులో ఒక్క లారీకి జరిమానా వేయలేదు. డిసెంబరులో ఆరింటికి, జనవరిలో కేవలం రెండింటికి మాత్రమే జరిమానా వేశారు. ఇప్పుడు కచ్చితంగా టార్పాలిన్ ఉండాల్సిందే


విశాఖపట్నం పోర్టు
డిప్యూటీ చైర్‌పర్సన్ రోష్ని అపరంజి

అని నిబంధన పెట్టి, అవి లేకుండా వెళితే జరిమానా వేస్తున్నాం. కస్టమ్స్ నోటిఫైడ్ ఏరియా మొత్తం పెద్దఎత్తున గోడలు నిర్మించి,కాలుష్యం లేకుండా చేస్తున్నాం. పోర్టులో 'టర్న్ ఎరౌండ్ టైమ్' అనేది చాలా ముఖ్యం. ఒక నౌక పోర్టులోకి వస్తే...ఎంత వేగంగా అందులో సరుకును అన్‌లోడింగ్ చేసి బయటకు పంపించామనేది కీలకం. ఈ అన్‌లోడింగ్, లోడింగ్‌కు తీసుకునే సమయాన్నే 'టర్న్ ఎరౌండ్ టైమ్'గా లెక్కిస్తారు. ఎక్కువ సమయం నౌకను బెర్తుపై ఉంచితే బెర్తు చార్జీలతో పాటు నౌకకు చెల్లించాల్సిన మొత్తం కూడా పెరుగుతుంది. తక్కువ టైమ్‌లో చేస్తే సరుకు తెప్పించుకునేవారికి, పంపేవారికి కూడా లాభదాయకం. అందుకని ఈ టర్న్ ఎరౌండ్ టైమ్ వీలైనంత వరకు తగ్గించడానికి అన్ని రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

# మెయిడ్స్ మోసాలు

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** నరసింహనగర్ ప్రాంతానికి చెందిన ఒక పెద్దాయన పిల్లలు విదేశాల్లో ఉంటున్నారు. దీంతో ఆయన తనకు తోడుగా ఉండేందుకు ఒక పురుషుడిని పనిలో పెట్టుకున్నారు. అతను ఎవరికో వీడియో కాల్ చేసి పెద్దాయనతో మాట్లాడించాడు. ఆ తర్వాత కొద్ది రోజులకు బ్యాంకు ఖాతాలోని డబ్బులు మాత్రం విత్‌డ్రా చేసినట్టు మెసేజ్ వచ్చింది. అప్పటినుంచి పనికి పెట్టుకున్న మనిషి కూడా కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఫేషియల్ రికగ్నైజేషన్ ద్వారా ఖాతాలోని డబ్బును లాగేశారని చెప్పడంతో ఆయన ఖంగుతిన్నారు. ప్రస్తుతం పిల్లలు ఉద్యోగాల నిమిత్తం సుదూర ప్రాంతాల (ఇతర రాష్ట్రాలు/దేశాలు)కు వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులకు రోజువారీ పనులు చేసుకునే శక్తి లేకపోవడంతో వారికి సహాయంగా ఉండేందుకు హోం మెయిడ్ పేరుతో పని మనుషులను పెడుతున్నారు. తల్లిదండ్రులతోపాటు ఇంట్లోనే ఉంటూ వారికి వంట చేసి, ఆహారం పెట్టడం, ఇల్లు శుభ్రం చేయడం, బట్టలు ఉతికి ఆరబెట్టడం వంటి పనులు చేసేలా ఒప్పందం చేసుకుంటున్నారు. దీనికోసం నెలకు రూ.15 వేల వరకు జీతంగా ఇస్తున్నారు. ఇటీవల కాలంలో మెయిడ్‌లకు డిమాండ్ పెరుగుతోంది. ఇదిలావుండగా వృద్ధులైన తల్లిదండ్రులకు పిల్లలు నెలనెలా భారీగా డబ్బులు పంపిస్తుండడం, వాటిని ఇంట్లో సరుకులు, మందులు కొనుగోలు కోసం వెచ్చించాలని పిల్లలు వీడియో కాల్‌లో చెబుతుండడం...పక్కనే ఉంటున్న మెయిడ్స్ వింటున్నారు. తాము సంరక్షిస్తున్న వృద్ధుల ఖాతాలో భారీగా డబ్బు ఉందని తెలుసుకుని కొందరు దురాశకు పోతున్నారు. వారి ఖాతాల్లోని డబ్బును కొల్లగొట్టేందుకు ప్రణాళికలు తయారుచేస్తున్నారు. తమకు తెలిసిన వారికి తమ సెల్‌ఫోన్ నుంచి వీడియో కాల్ చేసి తాము సంరక్షిస్తున్న వారితో మాట్లాడిస్తున్నారు. ఈ క్రమంలో టెక్నాలజీ ఆధారంగా వృద్ధుల ఫేషియల్ రికగ్నైజేషన్ విధానంలో వారి బ్యాంకు ఖాతా వివరాలను సేకరిస్తున్నారు. వాటి ఆధారంగా వృద్ధుల బ్యాంకు ఖాతాలోని డబ్బులు లాగేసి, తర్వాత చడీచప్పుడు లేకుండా పరారైపోతున్నారు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులను వివరణ కోరగా ఈ తరహా మోసాలు ఇటీవల కాలంలో పెరుగుతున్నాయని, తెలిసిన వ్యక్తులను మాత్రమే పనిలో పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

విశాఖ సమాచారమ్
గురువారం 5-3-2026

# విద్యా కమిషన్ వితండవాదం

రెండేండ్లు ప్రొబేషనరీ, ఐదేండ్లు కాంట్రాక్ట్ పద్ధతిలోనే టీచర్లను తీ సుకోవాలని విద్యా కమిషన్ చేసిన సూచన నియామక ప్రక్రియకు తిలోదకాలు ఇచ్చేలా ఉన్నది. నేల విడిచి సాము చేసేలా, ఊహాలోకంలో విహరింపజేసేలా దార్శనికత లేని తెలంగాణ విద్యావిధానం.. తెలంగాణ రైజింగ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను విద్యా కమిషన్ విస్మరించింది. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను రెసిడెన్షియల్ మాడల్‌కు మార్చేప్రతిపాదనలు చేయలేదు. 'కాంట్రాక్ట్ పద్ధతిలోనే నియామకాలు' అనే విధానం ద్వారా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. విద్యాకమిషన్ సిఫారసుల వల్ల రాజకీయ జోక్యం ఉండే అవకాశం ఉన్నది.

రెండేండ్లు ప్రొబేషనరీ, ఐదేండ్లు కాంట్రాక్ట్ పద్ధతిలోనే టీచర్లను తీ సుకోవాలని విద్యా కమిషన్ చేసిన సూచన నియామక ప్రక్రియకు తిలోదకాలు ఇచ్చేలా ఉన్నది. టీచర్‌గా కొనసాగాలంటే వారి పనితీరును మదింపు చేసి, ఐదేండ్లు కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకోవాలని పేర్కొన్నది. 'పనితీరును మెరుగుపరుచుకునేందుకు రెండేండ్ల వ్యవధి ఇవ్వాలి. ఆ తర్వాత ఉద్యోగం నుంచి తీసేయాలి' అంటూ కమిషన్ సూచనలు చేసింది. ఇది పూర్తిగా లోపభూయిష్టం అవుతుంది. కొందరి సొంత ఆలోచనలు బలవంతంగా రుద్దే ప్రయత్నం జరుగుతున్నది.

కొత్తగా టీచర్లను మండలం యూనిట్‌గా నియమించాలని కమిషన్ సూచించింది. 'ఇకనుంచి టీచర్ల బదిలీలు చేపట్టొద్దు. అనారోగ్య కారణాలతోనూ బదిలీలకు అవకాశం కల్పించొద్దు. కొత్తగా నియమితులైనవారు అదే గ్రామం, లేదంటే.. మండలం లోపల 15 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే పనిచేయాలి. అలా ఒప్పంద పత్రం సమర్పించాలి' అని సూచిం చడం అసంబద్ధం. కొత్త నియామకాలు చేపట్టే సమయంలో టీచర్ల హోదాలు మార్చాలని కమిషన్ సిఫారసు చేసింది. టీచర్లు, హెచ్‌ఎంల ఆటోమేటిక్ ప్రమోషన్లు నిలిపివేయాలనే ఆలోచన అందులో కనిపిస్తున్నది.

'రాష్ట్రంలో ఉపాధ్యాయుల వేతనాలు ఎక్కువగా ఉన్నాయి. జీతభత్యాలను హేతుబద్ధీకరించాలి. ఉపాధ్యాయుల వేతనాలను తగ్గించడం ద్వారా మిగిలిన నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించాలి' అని రాష్ట్ర ప్రభుత్వానికి విద్యాకమిషన్ సూచనలు చేసింది. ఈ సందేశంలోని సారం ఉపాధ్యాయుల పట్ల ద్వేషం బయటపడుతున్నది. విద్యాకమిషన్ తాజా సూచనలు వివాదాస్పదం అయ్యాయి. కమిషన్ తీరుపై టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యావేత్తలు మండిపడుతున్నారు.

ఉపాధ్యాయుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా విద్యాకమిషన్ నివేదిక విడుదల చేయడం దార్శనికత లోపమే. నివేదికలో టీచర్లకు వేతనాలు భారీగా ఉన్నాయనే విషయం ఎక్కువ ప్రచారం చేయడాన్ని తప్పుబడుతూ ఉపాధ్యాయులకు సమాజం, మీడియా బలమైన మద్దతుగా నిలిచాయి. 'విద్యాకమిషన్ సూచనలు అమలు చేయడానికి ఎంత బడ్జెట్ ఇస్తారు? ఎంత అవసరం అవుతుంది? అన్నిచోట్లా 'ఆరుట్ల ఫార్ములా' అమలు చేయగలమా? ఇప్పుడు ఉన్న విద్యాలయాలు ఏమి కావాలి? జనాభా ప్రాతిపదికన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పెడితే అందరికీ విద్య అందుబాటులోకి వస్తుందా?' అనే వాటికి జవాబులు లేవు.

మధ్యాహ్న భోజన పథకం చార్జీలను పెంచారు. రోజుకు రూ. 21 చొప్పున ఇంటర్ విద్యార్థులకు, రూ.19 చొప్పున 9, 10వ తరగతి విద్యార్థులకు, రోజుకు రూ.11.79 చొప్పున 6- 8 తరగతులకు, రోజుకు రూ.8.69 చొప్పున 1-5వ తరగతుల విద్యార్థులకు చెల్లించాలని సూచనలు చేసినా అందుకు కావాల్సింది బడ్జెట్. సాధ్యాసాధ్యాలను కమిషన్ పట్టించుకోకుండా వితండ వాదన చేసింది. ప్రాథమిక పాఠశాల టీచర్లకు బీఎడ్, పీజీ ఉండాలనడం సరైన ప్రతిపాదన కాదు. సుప్రీంకోర్టు తీర్పులు, ఎన్సీటీఈ ఉత్తర్వుల ప్రకారం 1-5 తరగతులకు బోధించేందుకు డీఎడ్ వారే అర్హులు. విద్యాకమిషన్ సిఫారసులలో అనేక సాంకేతిక లోపాలు ఉన్నాయి. న్యాయపరంగానూ చిక్కులకు కారణం అవుతున్నది. కేజీ నుంచి పీజీ వరకు ఆంగ్లంలోనే బోధించాలని కోరడం మాతృభాషను మర్చిపోయేలా చేయడం అవుతుంది. విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి దృష్టిలో ప్రభుత్వ ఉపాధ్యాయులే ఉండకూడదు, ప్రభుత్వ విద్యావ్యవస్థ ఉండకూడదనే ఉద్దేశం కనిపిస్తున్నది.

# సీతమ్మని బెదిరించిన రాక్షస స్త్రీలు

వికృత రూపాలున్న రాక్షస స్త్రీలు సీతమ్మ చుట్టూ చేరి "సీతా! దేనికైనా ఇంత అతి పనికిరాదు. రావణుడు అంటే సామాన్యుడు కాదు, బ్రహ్మ కుమారుడు, నాలుగో ప్రజాపతి పులస్త్యబ్రహ్మ కుమారుడైన విశ్రవసోబ్రహ్మ కుమారుడు రావణబ్రహ్మ. సాక్షాత్తు చతుర్ముఖ బ్రహ్మకు మునిమనవడు. లోకంలో అందరినీ జయించాడు. బ్రహ్మ గూర్చి తపస్సు చేశాడు.ఎన్నో గొప్ప వరాలు పొందాడు. అలాంటి రావణుడితో హాయిగా భోగం అనుభవించకుండా ఏమిటి ఈ మూర్ఖత్వం. పోనిలే మెల్లగా మనస్సు మార్చుకుంటావు అని ఇంతకాలం చూశాం,కాని మనస్సు మార్చుకోకుండా ఇలా ఉంటావేంటి, ఎలా చెప్పాలి నీకు" అని గద్దించారు.

అప్పుడు సీతమ్మ

"ఐశ్వర్యం ఉంటే భర్తగా చూడడం, రాజ్యం ఉంటే భర్తగా చూడడం, ఒంట్లో ఓపిక ఉంటే భర్తగా చూడడం నాకు తెలియదు. ఆయన దీనుడు కావచ్చు, రాజ్యహీనుడు కావచ్చు, కాని నా భర్త నాకు గురువు, సమస్తం. సువర్చల సూర్యుడిని ఎలా అనుగమిస్తుందో, వశిష్ఠుడివెంట అరుంధతి, శచీదేవి ఇంద్రుడిని ఎలా అనుసరిస్తుందో, రోహిణి చంద్రుడిని, లోపాముద్ర అగస్త్యుడిని,సుకన్య చ్యవన మహర్షిని, సావిత్రి సత్యవంతుడిని , శ్రీమతి కపిలుడిని ఎలా అనుగమిస్తుందో నేను కూడా అలా రాముడిని అనువర్తిస్తాను. మీరు నన్ను చంపి, నా శరీరాన్ని ముక్కలు చేసి తినెయ్యండి, నేను మాత్రం రాముడిని తప్ప వేరొకడిని కన్నెత్తి కూడా చూడను. రావణుడిని నా ఎడమ కాలితో కూడా ముట్టుకోను. మీరు నాకు ఇలాంటి మాటలు చెప్పవద్దు.నేను వినను " అన్నది. హరిజట అనే రాక్షస స్త్రీ లేచి "ఈమెని రావణుడు అపహరించి తీసుకొచ్చి ఇక్కడ పెట్టినప్పటినుంచి నా నోటి వెంట లాలాజలం కారుతున్నది. ఈమెని ఎప్పుడెప్పుడు తిందామా అని చూస్తున్నాను" అన్నది.

ఈ మాటలు విన్న ఏకజట "నేను బయట పడితే ఎవరన్నా ఈ విషయం చెప్పేస్తారేమో అని భయపడ్డాను. కాని హరిజట బయటపడింది కాబట్టి చెప్తున్నాను. ఆకలితో ఉన్నవాడు ఎదురుగా భోజనాన్ని పెట్టుకుని తినకుండా ఎలా నిగ్రహించుకొని ఉంటాడో, అలా నేను కూడా ఈ నరకాంతని ఎదురుగా పెట్టుకొని తినకుండా నిగ్రహించుకుంటున్నాను. ప్రభువు ఎలాగూ అనుమతి ఇచ్చాడు కదా ఈమెని దండించమని, కాబట్టి ఈమె పీక పిసికేసి తినేద్దాం. ఈమె హృదయం కింద ఉండే భాగం, గుండె, మెదడు నాది" అన్నది.

అప్పుడు మిగతా రాక్షస స్త్రీలు, నావి కాళ్ళు, నావి తొడలు, నావి చేతులు అని వాటాలు వేసుకున్నారు.

తరువాత అజముఖి అనే రాక్షసస్త్రీ"ఈమెని అందరమూ సరిసమానంగా వాటాలు వేసుకుందాం. తొందరగా కల్లు తీసుకురండి. ఈమెని తింటూ, కల్లు తాగుతూ, నికుంబిలా నాట్యం చేద్దాం" అంది.

అప్పుడు సీతమ్మ ఏడుస్తూ "ఇక్కడ మరణిద్దామన్నా కూడా నాకు స్వేచ్ఛ లేదు" అని అనుకొని, ఆ రాక్షస స్త్రీలని చూసి భయపడుతూ కూర్చున్న చోట నుంచి లేచి శింశుపా వృక్షం మొదటికి వెళ్ళి కూర్చుంది.

**యమ్వీఆర్**

# మావోయిస్టు పార్టీ.. ఇక చరిత్రేనా..?

దేశ అంతర్గత భద్రతకు సవాల్‌గా ప్రకటించబడి, సమాంతరంగా ఆదర్శ ప్రభుత్వాన్ని సైతం నడిపిన, గ్రామరాజ్య కమిటీలతో 13 రాష్ట్రాలకు విస్తరించిన మావోయిస్టు పార్టీ మనుగడ పైన చర్చ జరగడం చూస్తుంటే ఎవ్వరికైనా ఆశ్చర్యం కలగక మానదు..



కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు రహిత భారత్ 2026 మార్చి గడువు ప్రకటించిన నేపథ్యంలో ప్రజలలో, బుద్ధి జీవులలో, ప్రజాస్వామిక వాదులలో జరుగుతున్న ఆసక్తికర చర్చ కొత్త మలుపు తీసుకుంది.

కోలుకోలేని దెబ్బ.. నిజమే

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కొత్తగా ప్రకటించిన లొంగుబాట్లతో విషయం అన్ని రంగాల్లోకి చర్చగా వ్యాపించిదనడంలో ఎలాంటి సందేహం లేదు. సుమారు నాలుగు దశాబ్దాలపాటు పలు రాజకీయ పార్టీల ప్రభుత్వాలకు సవాల్‌గా నిలిచిన ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అంతర్ధాన మవుతోందా? అన్నదే ప్రధాన అంశం. మరీ ప్రధానంగా సంవత్సర కాలంగా ఆ పార్టీ నాయకత్వాన్ని కోల్పోవడం (ఎన్ కౌంటర్లు, లొంగుబాట్లతో), ప్రభుత్వ నిఘా, కోవర్ట్ ఆపరేషన్లు, సాంకేతికత వినియోగం, భారీ పోలీసు బలగాలతో అడుగడునా గాలింపు చర్యలతో ఉద్యమాన్ని బలమైన దెబ్బ తీయగలిగింది. శక్తివంతమైన సైనిక శక్తి గల భారత ప్రభుత్వ దాడిని సరైన సమయంలో అంచనా వేయడంలో వైఫల్యం, సకాలంలో సరైన నిర్ణయం తీసుకోవడం అమలు చేయడంలో ఆ పార్టీ నాయకత్వం వైఫల్యం కారణంగా అతి తక్కువ కాలంలోనే ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలిందన్నది పచ్చి నిజం.

నాయకత్వాన్ని కోల్పోవడమే సమస్య!

ఒక రాజకీయ పార్టీగా ఏర్పడి, ఆయుధాలు వీడి ప్రజా పోరాటాల జరపాలని, ఇక యుద్ధం చేసి గెలవలేమని చాలా కాలంగా పార్టీ నేతలు కొందరు బహిరంగంగానే చర్చకు దిగారు. ఇది రెండు పంథాల మధ్య వైరుధ్యంలా కొనసాగింది. అనేకమంది సీనియర్ నేతలతో పాటు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఉన్న బసవరాజు ఎన్‌కౌంటర్‌లో అమరుడవడంతో పార్టీలో అంతర్గత వైరుధ్యంగా ఉన్న ఆ విషయం బహిర్గతమైంది. ఆదివాసీ యోధుడు, పి.ఎల్.జి.ఏ. నేత హిడ్మా మరణం ప్రపంచ వ్యాప్తంగా సానుభూతి వచ్చినా ఆ పార్టీ నిలదొక్కుకోలేక పోతోంది. ప్రధానంగా తెలంగాణ ప్రాంతాల నుంచి ఉద్యమ నిర్మాణంలోకి వెళ్లి దీర్ఘకాలం పనిచేసిన నాయకత్వాన్ని కోల్పోవడం వలన ఈ పరిస్థితి దాపురించిందని చెప్పవచ్చు.

అలుపెరుగని దాడితో అతలాకుతలం..!

ఆదివాసీల జీవన స్థితిగతుల మెరుగు కోసం, నిర్వాసితుల సమస్య పైన, అటవీ ప్రాంతాల నుంచి అపార ఖనిజ సంపద, కార్పొరేట్ శక్తుల నుంచి రక్షణ కోసం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా అటవీ సంపద రక్షణ కోసం, తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేసిన నేతలు ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉద్యమకారులు నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. జైళ్ల పాలయ్యారు. ఈ త్యాగాల, గాయాల కారణంగానే ప్రజల నుంచి, బుద్ధి జీవుల నుంచి, ప్రజాస్వామికవాదుల నుంచి మద్దతు పొందగలిగారు. ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలననే డిమాండ్‌కు ప్రాధాన్యత తేగలిగారు. కానీ, ప్రభుత్వం జరిపిన అలుపెరుగని దాడితో ఉద్యమం అతలాకుతలమైంది. అన్నిటికంటే ప్రధానంగా నాయకత్వ లొంగుబాటు సామాజిక మాధ్యమాలలో, మీడియాలో భారీ చర్చకు తెర లేపింది. విశ్లేషకులలో అనేక సంశయాలకు తావిచ్చింది.

ఆ ప్రకటనతో గందరగోళం

ప్రధానంగా వారు లొంగిపోయిన తర్వాత తెలంగాణ ప్రభుత్వంతో జరిపిన చర్చల సందర్భంగా రాజకీయ పార్టీగా ఏర్పడతామని, కేంద్రం సహకరిస్తే పి.ఎల్.జి.ఎ. ను రద్దు చేస్తామని అన్నట్టు/ప్రకటించినట్లు వార్తలు వచ్చాయి. దాంతో ఉద్యమ సానుభూతిపరులు, పరిశీలకులు, రాజకీయ విశ్లేషకులు సైతం ఖంగుతిన్నారు. ఆపరేషన్ కగార్ ప్రకటించిన తర్వాత ఆ పార్టీ అధినాయకత్వం సమావేశమే కాలేక పోయిందని, సమీక్ష జరపడం కూడా వీలు కాలేదని ప్రచారం జరుగుతున్న సమయంలో వచ్చిన ప్రకటన గందరగోళానికి గురిచేసింది. అందరితో చర్చ చేయకుండానే, విధివిధానాలను ప్రకటించే అధికారం ఈ కొద్దిమందికి ఎక్కడిదని కొంతమంది అంటే, పార్టీని నమ్ముకుని ప్రాణాలు కోల్పో యిన వారి పరిస్థితి, జైళ్ల పాలైన వారి పరిస్థితి, ఉద్యమంలో మిగిలిన వారి పరిస్థితి ఏమిటన్నది ప్రధానాంశంగా మారింది. వెనువెంటనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇక అర్బన్ నక్సలైట్ల పని పడతామని ప్రకటించడం మరో విశేషం. రాహుల్ గాంధీని సైతం అర్బన్ నక్సలైట్ అంటున్న తర్వాత భవిష్యత్తు ఎలా ఉండబోతోందన్నది అగమ్య గోచరం. ఈ అంశాన్ని మానవ హక్కుల, పౌర హక్కుల సంఘాలు మాత్ర మే గొంతు విప్పుతున్నాయి. గట్టిగా ఖండిస్తున్నాయి. రాజకీ య పార్టీలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు మూగనోము నోస్తు న్నాయి. ఇలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో ప్రభుత్వం విధించిన గడువుకు మాసం ముందుగానే ఇంతటి విపత్కర పరిస్థితులు ఏర్పడడం నిజంగానే ఆశ్చర్యం కలిగించక మానదు.

చరిత్రలో నిలిచిపోయే ఉద్యమం

మావోయిస్టు పార్టీ ఇక చరిత్రగానే మిగిలిపోతుందా? సాయుధపోరాటం అనే అంశం కనుమరుగైనట్లేనా? అంటే నిజమేనా అనిపిస్తోంది. కానీ, మావోయిస్టు పార్టీ పీడిత తాడిత ప్రజల కోసం సుదీర్ఘ కాలం సాగించిన ఉద్యమాలు, వారు నిర్మించిన పత్యామ్నాయ ప్రభుత్వ రూపు రేఖలు – విశేషాలు, అసమాన త్యాగాలు, తిరుగుబాటు సిద్ధాంతం చరిత్రలో, పీడిత ప్రజల హృదయాల్లో నిలిచి పోతాయి. లిపి నేర్పి, వ్యవసాయం, సంస్కృతి సంప్రదాయం, విద్యా వైద్య రంగాలలో చేసిన కృషి, ఆత్మగౌరవ పోరాటాలు, జల్ జంగల్ జమీన్ నినాదానికి ఇచ్చిన బలం మధ్యభారత దేశంలోని దండకారణ్య ఆదివాసీ ప్రజల గుండెల్లో అజరామరంగా నిలుస్తాయన్నది చెరిపి వేయలేని వాస్తవమే కదా! మధ్య భారత ప్రాంతానికి,ఆ పార్టీ అందించిన రాజకీయ చైతన్యం, పోరాటస్ఫూర్తి భవిష్యత్ లో ఎలాంటి రూపం తీసుకుంటుందో చరిత్ర మాత్రమే రుజువు చూపగలదు. చరిత్రను తన దృష్టితో కాకుండా,వాస్తవిక దృష్టితో చూస్తే కనిపించేదంతా నిష్టూర సత్యం.

**- రమణాచారి**

# సీపీ బ్రౌన్ సమాధిని పునర్మించిన డా.దాసోజు కు సన్మానం

తెలుగు సాహిత్యాన్ని ఉద్ధరించిన సూరీడు, భాషాభివృద్ధికి కృషి చేసిన సీపీ బ్రౌన్ సమాధిని లండన్లో పునర్మించిన తెలుగువాడు డా.దాసోజు రాములును ప్రపంచ తెలుగు రచయితల సంఘం,మండలి కృష్ణారావు శతజయంతి కమిటి తరఫున సోమవారం విజయవాడ ఐలాపురం హోటల్ లో సన్మానం చేసారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్, అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు,ప్రధాన కార్యదర్శి జీ వీ పూర్ణచంద్ తదితరులు దాసోజు దంపతులను దుస్సాలువా,మొమెంటోలతో సన్మానించారు.

2009లో లండన్లో జరిగిన తెలుగు చరిత్ర మహాసభలకు వచ్చిన మండలి బుద్ధప్రసాద్,యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ లు స్థానికుడు జి.కృష్ణమూర్తి సహాయంతో సీపీ బ్రౌన్ సమాధిని అన్వేషణలో పడ్డారు.బెంగాల్ లో జన్మించిన బ్రౌన్ జీవితాంతం తెలుగునేల మీదే జీవించి భాషాభ్యుదయానికి కృషి చేసారు.చరమ దశలో లో లండన్ వెళ్లి అక్కడే మరణించారు.లండన్ సరిహద్దుల్లోని శ్మశానంలో ఆయన సమాధి ఉందని తెలుసుకుని వీరిద్దరూ అన్వేషణ చేపట్టారు. చివరికి కనిపెట్టారు.పేరు సరిగా కనిపించేందుకు అక్కడ ఉన్న ఆకులతో ఆయన సమాధి మీద లక్ష్మీప్రసాద్ రుద్దగా సీపీ బ్రౌన్ అని పేరు కనిపించింది.ఆరోజు సాయంత్రం డా.దాసోజు రాములుని కలిసారు.మాటల్లో ఈ విషయం చెప్పడంతో ఆయన శ్రద్ధ తీసుకుని సమాధిని పునర్మించడానికి హామీ ఇచ్చారు.బ్రౌన్ అవివాహితుడు..వారి కుటుంబంలో ఉన్న ఏకైక సోదరుడ్ని పట్టుకుని అనుమతి తీసుకోవడానికి డా.రాములు చాలా శ్రమించారు.ఎట్టకేలకు తెలుగుభాషా సూర్యుని సమాధిని నేడు దర్శనీయ స్థలంగా మార్చిన ఘనత డా.రాములదే.తెలుగునిఘంటువు స్వయంగా రాయడమే కాక వేమన పద్యాలు వెలుగులోకి తెచ్చింది బ్రౌన్.అలాగే ఎన్నో తెలుగు ప్రభంధాలు తన ఖర్చుతో అచ్చు వేయించిన బ్రౌన్ రుణం తెలుగు వారు తీర్చుకోలేనిది.ఆయన రుణాన్ని ఈ విధంగా డా.దాసోజు తీర్చుకున్నాడని వ్యక్తులు అభినందించారు.50 సంవత్సరాలు క్రితం బ్రిటన్ వెళ్లిన డా.దాసోజు అప్పటినుంచి లండన్ వచ్చే తెలుగువారికి ఆతిథ్యం ఇచ్చేవారు. సాక్షాత్తు తెలుగు సీపీ సార్వభౌముడు ,మాజీ సీఎం ఎన్టీ రామారావు కు ఆయన ఇంట్లో ఆతిథ్యం కల్పించడం విశేషం.ఆయన "తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్"(తాల్) స్థాపించి భాష,తెలుగు సంస్కృతి పెంపొందించే కార్యక్రమాలు చేపట్టారు.ఈనాడు లండన్ లో నివసిస్తున్న వేలాది కుటుంబాల్లోని పిల్లలు తెలుగు మాట్లాడడం మాకు గర్వకారణం గా ఉందని ఈ సందర్భంగా డా.రాములు అన్నారు.రాములు అనేక దేవాలయాలు నిర్మించేందుకు కృషి చేసారు. బర్మింగ్ హాంలో లాగా లండన్లో గోవిందుడి దేవాలయం నిర్మించాలని సంకల్పంచేసి ప్రారంభించారు.టిటీడీ సహాయంతో పెద్ద దేవాలయం నిర్మించాలని ఇండియా వచ్చారు.

తొలుత డా. దాసోజును శతాధిక రచయిత జీవీ పూర్ణచంద్ సభకు పరిచయం చేసారు.సభకు గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి,ప్రజా ప్రతినిధి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సీపీ బ్రౌన్ సమాధిని పునర్మించడంలో డా.రాములుచేసిన కృషితో తాము సమాధి కనుగొన్న తృప్తి మిగిలిందన్నారు.కష్టం అంతా ఆయనదే నన్నారు.ఆయన భార్య తెలుగువారిని ఆదరించి అన్నంపెట్టిన అన్నపూర్ణ గా అభివర్ణించారు.బ్రౌన్ భాషకు చేసిన సేవకు గాను ఆయన సమాధి తెలుగు వారు పునర్ నిర్మించడం తెలుగుభాషాభిమానులకు ఆనందం కలిగించే విషయమన్నారు. సభలో డా.ఉష,సాంబశివరావు,బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మి, రచయిత సత్యవతి తదితరులు మాట్లాడారు.దామోదర గణపతిరావు"తెలుగమ్మా! నిన్ను విడిచి ఉండలేను మతమా" అంటూ తెలుగు తల్లి మీద పాడి సభికులను అలరింపజేసారు.సాహితీ వేత్తలు, అభిమానులు పలువురు ఈ సభకు హాజరయ్యారు.

**యం.వి.రామారావు**

# విద్యార్థులకు 'ఏఐ' కోచింగ్



ప్రతిభను వెలికితీయటానికి నిర్వహించే పరీక్షలకు సన్నద్ధం కావటం, ఎదుర్కోవటం అంత తేలిక కాదు. నిపుణుల కోచింగ్ అవసరం. మాదిరి ప్రశ్నా పత్రాలను సాధన చేయాలి. నమూనా పరీక్షలతో కుస్తీ పట్టాలి. వచ్చిన మార్కులను విశ్లేషించుకోవాలి. ఇంకా ఎంత తీవ్రంగా కృషి చేయాలో తేల్చుకోవాలి. ఒకప్పుడంటే ఏమో గానీ నేటి కృత్రిమ మేధ (ఏఐ) యుగంలో ఇది ఒకింత సులువుగా మారిందనటం నిస్సందేహం. అవును, ఇప్పుడు విద్యార్థులు, ఉద్యోగార్థులకు పరీక్షల్లో విజయం సాధించటానికి ఏఐ చేదోడుగా నిలుస్తోంది. ఉపాధ్యాయుడిలా బోధిస్తోంది. గైడ్‌గా దారి చూపుతోంది. సామర్థ్యాన్ని విశ్లేషిస్తోంది. ప్రభుత్వాలు సైతం ఇందుకు సై అంటుండటం గొప్ప విషయం.

కృత్రిమ మేధ అన్ని రంగాలకూ విస్తరించింది.




బోధనలోనైతే సరికొత్త మార్పులను తీసుకొస్తోంది. దీన్ని ప్రభుత్వాలూ అందిపుచ్చుకుంటున్నాయి. కేరళ ప్రభుత్వం గత నెలలో హయ్యర్ సెకండరీ, ఒకేషనల్ హయ్యర్ సెకండరీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆరంభించిన ఏఐ ఆధారిత కోచింగ్ కార్యక్రమమే దీనికి నిదర్శనం. కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ టెక్నాలజీ ఫర్ ఎడ్యుకేషన్ (కైట్) పోర్టల్‌లో అందుబాటులో ఉండే ఇది వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. విద్యార్థుల సామర్థ్యం, పరీక్షకు సన్నద్ధమైన విధానాన్ని బట్టి వారికే ప్రత్యేకించిన స్టడీ ప్లాన్స్‌ను జనరేట్ చేయటం దీని ప్రత్యేకత. పాఠశాలలు జారీచేసిన ఐడీ కార్డులతో ఉన్నత తరగతుల విద్యార్థులు ప్రభుత్వ వెబ్‌సైట్లకు లాగిన్ అయ్యి, ఏఐ కోచింగ్‌ను తీసుకోవచ్చు. నైపుణ్యాన్ని పెంచుకోవచ్చు. మరి పర్సనల్ కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల వంటివి లేనివారి సంగతో? ఇలాంటి విద్యార్థులకు ప్రిన్సిపల్స్ అవసరమైన డిజిటల్ పరికరాలను సమకూర్చే ఏర్పాటూ చేశారు. ఈ ఏఐ ఆధారిత కోచింగ్ విధానం విద్యార్థులు రాసిన ప్రతి పరీక్షనూ విశ్లేషించి, ఎంతమేరకు పురోగతి సాధించారో చూపిస్తుంది. బిగినర్, ఇంటర్‌మీడియరీ, ఎక్స్‌లెంట్.. ఇలా మూడు అంచెల్లో ప్రశ్నలను ముందుంచుతుంది. పాఠ్యపుస్తకాల్లోనివే కాకుండా సుమారు 20వేల మంది నిపుణులు ధ్రువీకరించిన ప్రశ్నలూ ఇందులో అందుబాటులో



ఉంటాయి. పరీక్షల్లో పోటీ పడటానికి విద్యార్థులను బాగా సన్నద్ధం చేయటానికిది మంచి ఉపాయమే కదా. ముమ్ముందు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలూ దీన్ని అనుసరించినా ఆశ్చర్యపోనవసరం లేదు.

క్రిష్‌గురు బడులకు దన్ను

ఇప్పటికే దేశంలో కొన్ని పాఠశాలలు విద్యార్థులకు సాయం చేయటానికి ఏఐ సాయం తీసుకుంటున్నాయి కూడా. దీనికి ఒక ఉదాహరణ– క్రిష్‌గురు అనే ఏఐ ఆధారిత అసిస్టెంట్. అలన్ స్కాట్ ఎంటర్‌ప్రైజెస్ రూపొందించిన దీన్ని ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా 50 పాఠశాలలు ఉపయోగించుకుంటున్నాయి. ఇదో ఆఫ్‌లైన్ లెర్నింగ్ టూల్. పాఠశాలల కోసం ముఖ్యంగా ఇంటర్నెట్ సదుపాయం లేని స్కూళ్లను ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకొని తయారుచేశారు. టీచింగ్, ఆన్సరింగ్, గైడెన్స్, ఎక్స్‌పెరిమింటేషన్, అసెస్‌మెంట్ అన్నీ ఒక్క టూల్‌లోనే నిక్షిప్తమై ఉంటాయి. ఈ వేదిక జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండటం గొప్ప విషయం.

జెమినైతో జయం

జేఈఈ సన్నద్ధత కోసం గూగుల్ జెమినై రూపొందించిన




ప్రొవిజన్స్ అనతికాలంలోనే ఎంతో ఆదరణ పొందాయి. ఆరంభించిన కొద్ది నెలల్లోనే సుమారు 20 లక్షల మంది వీటిని వాడుకున్నారు. దీని ద్వారా విద్యార్థులు జేఈఈ కోసం నమూనా పరీక్షలు రాయొచ్చు. మనదేశానికి ఫిజిక్స్‌వాలా, కెరీర్స్360 సంస్థలు పరీక్షించిన కంటెంట్ ఆధారంగా ఇది ప్రశ్నలు సంధిస్తుంది. విద్యార్థులు నమూనా పరీక్ష పూర్తి చేసిన వెంటనే ఫీడ్‌బ్యాక్ అందిస్తుంది. ఏయే విషయాల్లో బలంగా ఉన్నారో, ఎక్కడ సవరించుకోవాల్సిన అవసరముందో చెబుతుంది.

జేఈఈ స్టడీ అసిస్టెంట్ కన్నా ముందు శ్యాట్ పరీక్షల కోసమూ జెమినై అవకాశాలు కల్పించింది. తమ యాప్‌లో స్టడీ నోట్స్‌ను యాడ్ చేసి క్విజ్‌లను జనరేట్




చేయటానికి తోడ్పడే అదనపు ఫీచర్లనూ గూగుల్ తీసుకొచ్చింది. అడ్వాన్స్‌డ్ ఫిజిక్స్ దగ్గరి నుంచి విస్తృత సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ వరకూ పలు సబ్జెక్టుల కోసం జెమినైని వాడుకోవచ్చు. నోట్‌బుక్‌ఎల్ఎం సాయంతో స్టడీ మెటీరియల్స్‌ను క్విజ్‌లు, ఫ్లాష్ కార్డులు, ఆడియో, వీడియో సారాంశాల రూపంలోకీ మార్చుకోవచ్చు.

**ఐనా అనంత బోధన**

మనదేశానికి చెందిన ప్రముఖ ఆన్‌లైన్ బోధన వేదిక ఇన్ఫినిటీ లెర్న్ విద్యార్థులకు గైడ్‌గా ఉపయోగపడటానికి గత సంవత్సరం మొట్టమొదటి వాయిస్ మోడల్ ఐనాను పరిచయం చేసింది. ఇందులో పెయిడ్, నాన్‌పెయిడ్ యూజర్లు లక్షలాది మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇది 96.7% కచ్చితత్వంతో స్పందిస్తుండటం గమనార్హం. నెలకు 2 లక్షల కన్నా



ఎక్కువ మంది విద్యార్థులు దీనికి ప్రశ్నలు సంధిస్తున్నారు. ఇది సగటున ఐదు సెకండ్లలోపే జవాబులిచ్చేస్తోంది కూడా. కేవలం ప్రశ్నలకు జవాబులివ్వటం తోనే సరిపెట్టటం లేదు. నిజమైన ఉపాధ్యాయుడి మాదిరిగా స్ఫూర్తినీ అందిస్తోంది. ఒకరకంగా ఇది విద్యాబోధనను, నేర్చుకునే ప్రక్రియను మరింత చేరువ చేస్తోందని చెప్పొచ్చు.

ఫొటోమ్యాత్ లెక్కల సహాయకుడు

జేఈఈ ఆశావహులకు నచ్చే ఏఐ ప్రాబ్లమ్ సాల్వర్ టూల్స్‌లో ఒకటి ఫొటోమ్యాత్. ఈ యాప్‌తో లెక్కను స్కాన్ చేస్తే చాలు, అంచెలంచెలుగా వివరణ అందిస్తుంది. కచ్చితమైన జవాబులు చూపిస్తుంది. ఇందులో ఉపాధ్యాయులు ఆమోదించిన పలు పద్ధతులుంటాయి.

చాట్‌జీపీటీ ఆల్‌రౌండర్

విద్యార్థులు అతి ఎక్కువగా వాడుతున్న టూల్స్‌లో చాట్‌జీపీటీ ఒకటి. దీన్ని ఆల్‌రౌండ్ స్టడీ అసిస్టెంట్‌గా చెప్పుకోవచ్చు. ఐఐటీ జేఈఈ ప్రిపరేషన్, ఐఐటీ జేఈఈ ట్యూటర్, స్టడీజీపీటీ, స్టడీ మోడ్ వంటివన్నీ విద్యార్థులకు, ఉద్యోగార్థులకు ఉపయోగపడేవే. ఉపాధ్యాయులతో మాట్లాడుతున్నట్టుగా ప్రశ్నలను వేసి, జవాబులు పొందటం చాలామందిని ఆకట్టుకుంటోంది. జేఈఈకి సిద్ధమయ్యేవారు ఫిజిక్స్ భావనలను, కెమిస్ట్రీ ప్రతిచర్యలను వివరంగా తెలుసుకోవటానికి.. లెక్కలను అంచెలంచెలుగా అర్థం చేసుకోవటానికి దీన్ని వాడుకోవచ్చు.

ముఖ్యంగా ఎక్కడైనా కొరుకుడుపడని విషయముంటే ఏదో తుది జవాబు తెలుసు కోవటం కన్నా మరింత లోతుగా అవగతం చేసుకోవటానికి బాగా ఉపయోగపడుతుంది. ఉచిత వర్షన్‌లోనే మూల భావనలను అర్థం చేసుకోవచ్చు. సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. పెయిడ్ వర్షన్‌లోనైతే మరింత త్వరగా, కచ్చితంగా సమాధానాలు పొందొచ్చు. రీజనింగ్ కూడా బాగుంటుంది. అప్పటికే కొంత విషయం తెలిసి ఉండి, సందేహాలను నివృత్తి చేసుకోవాలనుకునేవారికిది మంచి అవకాశం. త్వరగానూ పునశ్చరణ చేసుకోవచ్చు.

**నోషన్‌ఏఐ ప్రణాళిక ప్రకారం**

యూపీఎస్సీ, జేఈఈ వంటి పరీక్షలకు ప్రణాళికా బద్ధంగా సిద్ధం కావటానికిది ఎంతగానో తోడ్పడుతుంది. దీంతో యూపీఎస్సీ ఆశావహులు చరిత్ర, రాజనీతి శాస్త్రం వంటి సబ్జెక్టులకు నిర్మాణాత్మక నోట్స్‌ను క్రియేట్ చేసుకోవచ్చు. పెద్ద నోట్స్‌ను సంక్షిప్తీకరించుకోవటానికి, కంటెంట్‌ను సరళమైన భాషలో తిరిగి రాసుకోవటానికి, నెలవారీగా కరెంట్ అఫైర్స్‌ను వర్గీకరించుకోవటానికి ఉపయోగించుకోవచ్చు. జేఈఈకి సిద్ధమయ్యేవారు ఫార్ములా షీట్స్, పొరపాట్ల జాబితా వంటివీ రూపొందించుకోవచ్చు. రోజువారీ ప్రాక్టీస్‌ను షెడ్యూల్ చేసుకోవచ్చు.

# పిల్లలు విలువలు నేర్చుకోవాలంటే భారత్ బెస్ట్..!



చాలామంది విదేశీయులు మన మాతృగడ్డపై మమకారం పెంచుకుని ఇక్కడే శాశ్వత నివాసం ఏర్పరుచుకుంటున్నారు. ముఖ్యంగా ఇక్కడ సంస్కృతి, ఆచార వ్యవహారాలకు ఫిదా అంటూ ఇక్కడే ఉండిపోవాలని నిర్ణయించుకుంటున్నారు. పైగా వాళ్ల సతంతి కూడా ఇక్కడ పెరిగితేనే మంచిదని భావిస్తుండటం విశేషం. ఆ కోవలోకి తాజాగా మరో రష్యన్ తల్లి వచ్చి చేరింది. ఆ పిల్లల తల్లి పోస్ట్‌లో పేర్కొన్న విషయాలు వింటుంటే మన గడ్డపై మమకారం, ప్రేమ రెట్టింపు అవ్వడమే కాదు భారతీయులుగా గర్వం ఉప్పొంగుతుంది కూడా. మరి ఇంతకీ ఆమె ఆ పోస్ట్‌లో ఏం చెప్పుకొచ్చిందంటే.. బెంగళూరులో నివశిస్తున్న ఈ రష్యన్ మహిళ తాను తన భర్త భారతదేశాన్ని కేవలం పర్యాటక ప్రదేశంగా కాకుండా శాశ్వత నివాసంగా ఎందుకు మార్చుకున్నామో వెల్లడించింది పోస్ట్‌లో. ఈ గడ్డపై ఉంటేనే తన పిల్లలు మంచిగా పెరుగుతారని, ఇది పిల్లల పెంపకానికి అత్యంత అనుకూలమైన వాతావరణమని, విశాల దృక్పథంతో వ్యవహరించడం అలవడుతుందని అటోంది. ఈ భారతదేశం తమ కుటుంబానికి ఎన్నో నేర్పించిందంటూ ఇలా వివరించింది. వేగాన్ని తగ్గించడం దగ్గర నుంచి తొందరపడకుండా ఉండటం, మాటకు స్పదించడం, శ్రద్ధగా వినడం వంటివి తమ కుటుంబం నేర్చుకుందని తెలిపింది. అలాగే తాము ఇక్కడ భారతీయులను తాము ఎంతగానో ప్రేమిస్తున్నామని, వారి కపటం లేని మనసు, దయ, ప్రతిఫలాప్రేక్ష లేని హెల్పింగ్ నేచర్ మమ్మల్ని ఎంతగానో కట్టిపడేశాయని చెప్పుకొచ్చింది. ముఖ్యంగా పొరుగువారితో సత్సంబంధాలు చాలా బాగుంటాయని, ఇక్కడ చిరునవ్వే అందరి కామన్‌భాష అని అంటోంది. అందువల్లే తన పిల్లలను ఇక్కడే పెంచాలని స్ట్రాంగ్‌గా ఫిక్స్ అయ్యానంటోంది ఈ తల్లి. ఈ బహుళ సంస్కృతి, బహుభాషా వాతావరణంలో ఎన్నో నేర్చుకోగలరు, ముఖ్యంగా గౌరవించడం, చిన్న చిన్న వాటికి ప్రశంసించడం వంటివి నేర్చుకుంటారని చెబుతోంది. ఈ వెచ్చని వాతావరణం ఎంజాయ్ చేయడం ఓ థ్రిల్, అలాగే ఏడాది పొడవునా కాలానుగుణ తాజా పండ్లను ఆస్వాదించడంలో ఓ మజా ఉందంటోంది. అందువల్లే తాము భారతదేశాన్ని తమ నివాస స్థలంగా మార్చుకున్నామంటూ పోస్ట్‌ని ముగించింది. అయితే నెటిజన్లు స్పందిస్తూ..మా భారత్‌కి స్వాగతం, మా మృతృభూమి చాలా అందమైనది, ఎవరినైనా తనలో ఇట్టే కలిపేసుకుంటుంది అని ఆమెకు సాదారంగా ఆహ్వానం పలుకుతూ పోస్టులు పెట్టారు.

# అక్కడ మాత్రం కీప్యాడ్ ఫోనులే! ఎందుకో తెలుసా?



**ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఫోన్‌లేని ప్రపంచాన్నే ఊహించలేం. అదీగాక చేతిలో ఫోన్ లేకపోతే ఏ పని సాగదు, కాలు కూడా కదపలేం. అంతలా టెక్నాలజీపై ఆధారపడిపోయాం లేదా బానిసలమైపోయాం అనొచ్చేమో..!. ఏ చిన్న సందేహమైనా..ఏదైనా.. తెలియని ప్రాంతానికి వెళ్లాలన్నా.. చేతిలో ఫోన్ ఉంటే చిటికెలో పనైపోతుంది. అంతలా మనకు అన్నింటిని అరచేతిలోకి వచ్చేసేలా అమర్చి పెట్టేసింది. అలాంటి స్మార్ట్ ఫోన్‌ని స్వచ్ఛంధంగా వాడకూడదని నిషేధం విధించుకుంది ఓ గ్రామం. అలా ఎందుకు చేసిందో తెలిస్తే..కచ్చితంగా సెల్యూట్ చేస్తారంతా. అయితే ఇది మరోకంగా విమర్శలకు దారితీసింది. ఆ నిషేధం కూడా సమంజసంగా ఉంటే..ఇతర గ్రామాలకు ఆదర్శంగానూ, అభినందనీయంగానూ ఉండేది. ఇంతకీ ఎందుకోసం స్మార్ట్ ఫోన్‌ని సీరియస్‌గా బ్యాన్ చేశారంటే..**

రాజస్థాన్‌లోని జలోర్ జిల్లాలోని 15 గ్రామాలు ఈ అనూహ్య నిర్ణయం తీసుకున్నాయట. యావత్తు ప్రపంచం 6జీ వైపు దూసుకుపోతే అక్కడ మాత్రం మహిళలను కీప్యాడ్ ఫోన్ల యుగానికి వెళ్లిపోదాం అంటోంది. చౌదరి కమ్యూనిటీకి చెందిన సుంధమాతా పట్టి పంచాయితీ స్మార్ట్‌ఫోన్ ఉపయోగించకుండా నిషేధం విధించింది. ముఖ్యంగా అక్కడ మహిళలు, బాలికలు వినయోగించకూడదు. అత్యవసరం అనకుంటే కీప్యాడ్ ఫోన్‌లే ఉపయాగించాలి అక్కడి మహిళలు. ఇదంతా ఎందుకంటే..మొబైల్ ఫోన్ ఒక వ్యసనంగా మారి పక్కదారి పట్టిస్తోందని, ముఖ్యంగా చిన్నారులపై దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉందనే ఆయా గ్రామాలు స్మార్ట్ ఫోన్‌ని ఉపయోగించకూడదని నిషేధం విధించాయట. అంతేగాదు చదువుకునే పిల్లలు సైతం తమ ఇంట్లో ఫోన్ ఉపయోగించుకోవచ్చు గానీ బయటకు తీసుకురావడానికి వీల్లేదట. మహిళలే ఎందుకంటే..కచ్చితం అమ్మతోపాటు పిల్లలు ఉంటారు. దాంతో తరుచుగా చిన్నారులు వాటిని వినియోగించే అవకాశం ఉన్నందున మహిళలు కీప్యాడ్ ఫోన్‌లే ఉపయోగించాలని నిర్ణయించిందట పంచాయతీ. కాగా, ఆదివారం ఘాజీపూర్ గ్రామంలో జరిగిన పంచాయతీ సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. 14 పట్టి సమాజం అధ్యక్షుడైన సుజనారామ్ చౌదరి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. అక్కడి పంచాయతీ ప్రకారం..దేవరామ్ కర్నోల్ వర్గం ముందుకు తెచ్చిన ప్రతిపాదనను పంచ్ హిమ్మతారామ్ చదివి వినిపించారు. చర్చల అనంతరం, సమావేశానికి హాజరైన పంచ్ సభ్యులందరూ ఈ నిబంధనను అమలు చేసేందుకు మొగ్గుచూపారు. ఈ తీర్మానం జనవరి 26 నుంచి అమలవుతుందట.

**ఏయే గ్రామాల్లో ఇది అమలు అంటే..**

ఈ నిర్ణయం భిన్‌మల్ ప్రాంతంలోని పలు గ్రామాలలో అమలు చేయబడుతుంది. వీటిలో ఘాజీపూర్, పావలి, కల్డా, మనోజియావాస్, రాజికావాస్, దట్లావాస్, రాజ్‌పురా, కోడి, సిద్రోడి, ఆల్డి, రోప్సి, ఖానాదేవల్, సావిధర్, హాత్మీ కి ధాని, ఖాన్‌పూర్ గ్రామాలు ఉన్నాయి. నిజానికి పంచాయితీ చర్య సామాజిక కార్యకర్తలు, మహిళా హక్కుల సంస్థల నుంచి తారాస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది కేవలం మహిళా వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. ఏ నిషేధం అయినా లింగ సమానత్వానికి పెద్ద పీటవేసేలా ఉండాలి గానీ, మహిళలే లక్ష్యంగా నిషేధం అంటే సహించదగినది కాదంటున్నారు సామాజికకార్యకర్తలు, మహిళా సంఘాలు. అందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవ్వడమే కాదు హాట్‌టాపిక్‌గా మారింది కూడా.

# వాటే ట్రయల్ రూమ్! ఆ వైబ్స్‌కి ఫిదా అవ్వాల్సిందే







ఇన్‌స్టాగ్రామ్ యూజర్ సార్థక్ సచ్‌దేవా షేర్ చేసిన వీడియో నెట్టింట తెగ చక్కెర్లు కొడుతోంది. అది చూస్తే దుబాయ్‌లో ట్రయల్ రూమ్స్ ఇలా ఉంటాయా అనిపిస్తుంది. ఆ వీడియోలో దుబాయ్‌లోని ఎ&వీ స్టోర్‌లోని హైటెక్ ట్రయల్ రూమ్‌ని కళ్లకు కట్టినట్లు చూపించాడు సార్థక్ సచ్‌దేవా. చక్కటి మ్యూజిక్‌ని వింటూ డ్రెస్ మార్చుకోవచ్చు. అంతేగాదు అక్కడ ముందు ఉన్న టచ్‌స్క్రీన్ ప్యానెల్‌లో హైప్, వైబ్, చిల్, లోకల్ అనే నాలుగు రకాల సంగీత శైలిని అందిస్తుంది. వాటిలో మనకు నచ్చింది ఏదో ఒకటి ఎంచుకున్నాక..మొత్తం ట్రయల్ రూమ్ మ్యూజిక్ పరంగానే కాదు రూమ్ వ్యూ కూడా మారిపోతుంది. ఇక లోపలి గది గోడలు స్క్రీన్‌లతో ఉంటాయి. ఇందులోని డైనమిక్ విజువల్స్, కదిలే నమునాలు మనం ఎంచుకున్న సంగీతానికి అనుగుణంగా గది అంతా లైటింగ్‌ని ప్రొజెక్ట్ చేస్తాయి. సింపుల్‌గా చెప్పాలంటే..ఆ గది హంగుఆర్భాటం, మంచి సంగీతానికి అందులోనే లీనమై ఉండిపోయేలా చేస్తుంది.అందుకు సంబంధించిన వీడియోకి "దుబాయ్‌లో వైరల్ డ్రెస్సింగ్ రూమ్!" అనే క్యాప్షన్ ఇచ్చి మరి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. నెటిజన్లు కూడా ఈ వీడియోని చూసి..ఇలాంటి ట్రయల్ రూమ్ అయితే అక్కడే ఉండిపోతా అంటూ కామెంట్ చేస్తూ పోస్టులు పెట్టారు.

# మీ సిమ్ కార్డు యాక్టివ్‌గా లేదా?



వాట్సప్, టెలిగ్రామ్ వంటి మెసేజింగ్ యాప్స్ వాడుతున్నారా? అయితే మీ ప్రధాన పరికరంలో రిజిస్టర్డ్ సిమ్ కార్డు యాక్టివ్‌గా ఉందేమో కూడా చూసుకోండి. లేకపోతే ఇలాంటి మెసేజింగ్ యాప్స్ ఇకపై పనిచేయవు. ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ వంటి వాటిని అరికట్టటానికి కేంద్ర ప్రభుత్వం నవంబరులో సిమ్ బైండింగ్ నిబంధనలు తీసుకొచ్చింది. వీటి అమలుకు 90 రోజుల సమయం ఇచ్చింది. గడువు ముగియటంతో ఇటీవలే అమల్లోకి వచ్చాయి.

సిమ్ బైండింగ్ అంటే?: చాలా మెసేజింగ్ యాప్‌లు ఖాతాను సృష్టించుకునేటప్పుడు నమోదు చేసుకున్న మొబైల్ నంబరుకు ఓటీపీని పంపించటం ద్వారా యూజర్లను ధ్రువీకరిస్తుంటాయి. ఒకసారి ధ్రువీకరించుకుంటే చాలు. ఫోన్ నుంచి సిమ్‌ను తొలగించినా, మార్చినా, డీయాక్టివేట్ అయినా యాప్ పనిచేస్తూనే ఉంటుంది. సిమ్ యాక్టివ్‌గా లేకపోయినా క్యూఆర్ కోడ్ స్కాన్ లేదా ఓటీపీ అథెంటికేషన్‌తో వాట్సప్ వెబ్ వంటి వెబ్ ఆధారిత వర్షన్లను యాక్సెస్ చేయొచ్చు. సిమ్ బైండింగ్ నిబంధన దీనికి చెక్ పెట్టింది. రిజిస్ట్రేషన్ కోసం వాడిన యాక్టివ్ సిమ్‌తో నేరుగా ఖాతా అనుసంధానమయ్యేలా చూడటం తప్పనిసరైంది. అంటే ఫోన్‌లో యాక్టివ్ సిమ్ లేకపోతే యూజర్లు తమ ఖాతాలను వాడుకోలేరన్నమాట.

వాట్సప్ వెబ్, డెస్క్‌టాప్ యూజర్లకూ మార్పులు: మొబైల్ ఫోన్లలో సిమ్ ధ్రువీకరణతో పాటు వెబ్ ఆధారిత సెషన్లకూ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. తరచూ తిరిగి ధ్రువీకరించుకోవటం తప్పనిసరైంది. ఉదాహరణకు– వాట్సప్ వెబ్ ప్రతి ఆరు గంటలకోసారి దానంతటదే లాగ్ అవుట్ అవుతుంది. తిరిగి లాగిన్ అయ్యాకే వాడుకోవటం సాధ్యమవుతుంది. ఈ ఆరుగంటల నిబంధన వెబ్, డెస్క్‌టాప్ సెషన్లకు మాత్రమే. సిమ్‌తో కూడిన మొబైల్ ఫోన్లలో నిరంతరాయంగా మెసేజింగ్ యాప్స్ వాడుకోవచ్చు. పరికరంలో సిమ్ కార్డు యాక్టివ్‌గా ఉంటే దేశంలో గానీ విదేశాల్లో గానీ ప్రయాణించేవారికి ఎలాంటి అంతరాయాలు ఉండవని ప్రభుత్వం పేర్కొంటోంది.

# నానో బనానా తాజాగా




గూగుల్ ప్రాచుర్యం పొందిన తమ నానో బనానా తాజా వర్షన్‌ను విడుదల చేసింది. దీని పేరు నానో బనానా 2. వెబ్ సెర్చ్ నుంచి అప్పటికప్పుడు సమాచారాన్ని, ఇమేజెస్‌ను గ్రహించటం ద్వారా పనిచేస్తుంది. పాత వర్షన్ కన్నా మరింత వాస్తవిక దృశ్యాలను, ఇంకాస్త వేగంగానూ సృష్టిస్తుంది. మరింత ప్రకాశవంతమైన లైటింగ్, స్పష్టమైన టెక్చర్స్, వివరాలతో కూడిన ఇమేజ్‌లతో కనువిందు చేయగలదు. ఇది జెమినై యాప్‌లో ఫాస్ట్, థింకింగ్, ప్రొ మోడ్స్‌లో డిఫాల్ట్‌గా అందుబాటులో ఉంటుంది. దీంతో ప్రొ ఫీచర్లు ఎక్కువ మందికి అందుబాటులోకి వచ్చినట్టయ్యింది.

ఫీచర్లు ఇవీ..

అధునాతన టెక్స్ట్ రెండరింగ్ అండ్ ట్రాన్స్‌లేషన్: యూజర్లు తమ మార్కెటింగ్ ప్రచార లేదా గ్రీటింగ్ కార్డుల కోసం కచ్చితమైన, విశ్వసనీయమైన టెక్స్ట్‌ను సృష్టించుకోవచ్చు. తమ ఐడియాలను ప్రపంచవ్యాప్తంగా పంచుకోవటానికి ఇమేజ్‌లోనే టెక్స్ట్‌ను అనువాదం చేసుకోవచ్చు.

సంక్లిష్ట సూచనల అనుసరణ: సూచనల అనుసరణను ఈ కొత్త మోడల్‌లో మెరుగుపరచారు. అంటే యూజర్ల సంక్లిష్ట అభ్యర్థనలను ఇంకాస్త కచ్చితంగా అనుసరిస్తుందన్నమాట. ఇలా యూజర్లు కోరినట్టుగా ఇమేజ్‌లను ముందుంచుతుంది.

వాడకానికి సిద్ధంగా స్పెసిఫికేషన్లు: కోరుకున్న ఇమేజ్‌ల రెజల్యూషన్ 512పీఎక్స్ నుంచి 4కే వరకూ ఉండటం వల్ల యూజర్లు వెంటనే వాడుకోవటానికి సిద్ధంగా ఉంటాయి.



మార్చుకోదగిన థింకింగ్ స్థాయులు: ఈ మోడల్ రీజనింగ్‌లో యూజర్లకు మరింత పట్టు లభిస్తుంది. థింకింగ్ స్థాయులను సవరించుకోవచ్చు. సంక్లిష్ట ప్రాంప్ట్‌ల ద్వారా దీని బుర్రకు పని చెప్పొచ్చు.

ఇలా వాడుకోవాలి

జెమినై యాప్‌ను ఓపెన్ చేసి నానో బనానా 2లోకి వెళ్లాలి. ఇప్పటివరకూ ఉన్న నానో బనానా స్థానంలో ఇది ప్రత్యక్షమవుతుంది.

గూగుల్ యాప్‌లో ఏఐ మోడ్, లెన్స్‌లోనూ ఈ కొత్త మోడల్ అందుబాటులో ఉంటుంది. మొబైల్ ఫోన్లు, డెస్క్‌టాప్ మీద మొత్తం 141 కొత్త దేశాల్లో, అదనంగా 8 భాషల్లో వాడుకోవచ్చు.

గూగుల్ క్లౌడ్‌లో వర్టెక్స్ ఏఐలోని జెమినై ఏపీఐతో ప్రివ్యూలోనూ దీన్ని ఉపయోగించుకోవచ్చు.

గూగుల్ యాడ్స్‌లోనూ ఇప్పుడు నానో బనానా 2 అందుబాటులోకి వచ్చింది. దీంతో ప్రచార సామగ్రిని మరింత ఆకర్షణీయంగా, తేలికగా సృష్టించుకోవచ్చు.

# గోదావరి జిల్లాల సమాచారమ్

## యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రవాసాంధ్రులకు మంత్రి సుభాష్ భరోసా



**రామచంద్రపురం :** యుద్ధం నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో చిక్కుకుని భయాందోళనలకు గురైన ప్రవాసాంధ్రులకు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ధైర్యం చెప్పారు. యుద్ధ వాతావరణంలో బిక్కుబిక్కుమంటున్న తెలుగువారిని ఆదుకోడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసానిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం మంత్రి కొందరు బాధితులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. వారి పరిస్థితిని తెలుసుకుని ఆందోళన చెందవద్దని, ధైర్యాన్ని కోల్పోవద్దని చెప్పారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలుగువారిని క్షేమంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. కొన్ని విమానాశ్రయాల్లో ప్రయాణికులు చిక్కుకుపోయిన నేపథ్యంలో తనతో పాటు ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో సాయం అందించేందుకు 'ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ ఈ helpline@apnrts.com, హెల్ప్‌లైన్ వాట్సప్ నంబర్ +918500027678 ద్వారా సమాచారం అందించాలని సూచించారు. ఇరుదేశాల మధ్య త్వరలోనే శాంతి నెలకొని సాధారణ పరిస్థితులు ఏర్పడాలని ఆకాంక్షించారు. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న పలువురు వీడియో కాల్ ద్వారా మంత్రికి తమ ఇబ్బందులను వివరించారు.

తమ పరిస్థితిని మంత్రికి వివరిస్తున్న ప్రవాసాంధ్రులు

అక్కడి పరిస్థితులపై ఆరా

కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెళ్లంకకు చెందిన కువైట్ బీసీ చైతన్య వేదిక వ్యవస్థాపకుడు కట్టా భాస్కర్, దిండికి చెందిన కట్టా నాగేశ్వరరావు, రాజోలు మండలం కూనవరం ప్రాంతానికి చెందిన బొంతు నాగరాజు, అల్లవరం మండలం గోడి గ్రామానికి చెందిన గెద్దాడ మురళీకృష్ణ మస్కట్ నుంచి మాట్లాడారు. తామున్న ప్రాంతాలు, యుద్ధ వాతావరణంపై చర్చించారు. ఖతార్ నుంచి మామిడికుదురు మండలం పాశర్లపూడిలంకకు చెందిన యూఏఈ శెట్టిబలిజ ఐక్య సంఘం నాయకులు పితాని సత్యనారాయణ (సత్యమూర్తి), బెహరిన్ నుంచి నరసాపురానికి చెందిన చింతపల్లి లక్ష్మీనారాయణ, సౌదీ నుంచి పి.గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన పితాని రాంబాబు, దుబాయ్ నుంచి పెనుగొండ మండలం ములపర్రు గ్రామానికి చెందిన కదలి వెంకటకృష్ణ, మలికిపురం మండలం గుడపల్లికి చెందిన పెచ్చెట్టి సూరిబాబు తదితరులు మంత్రికి అక్కడి పరిస్థితులు వివరించారు.

## జిల్లాలో ఎంఎల్‌హెచ్‌పీల తీరిది..

**రాజమహేంద్రవరం:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆరోగ్య అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల లక్ష్యం నెరవేరడం లేదు. మిడ్ లెవిల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) ఆధీనంలో ఉండే ఈ కేంద్రాల్లో వైద్యం సంగతి అటుంచి కనీసం ఆరోగ్య అవగాహన కార్యక్రమాలైనా చేపట్టడం లేదు. నెలకు మూడు సమావేశాలు నిర్వహించి పాఠశాలలకు వెళ్లి చిన్నారులు, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉండగా ఆ దిశగా ఎటువంటి చర్యలు కానరావడం లేదు. సమావేశాలు, సదస్సులు నిర్వహించినట్లు చూపిస్తూ ప్రభుత్వం ఇస్తున్న నిధులు పక్కదారి పట్టిస్తున్నారు.

**ఏటా రూ.11 లక్షలు..**

జిల్లా వ్యాప్తంగా 368 హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలున్నాయి. వీటిలో ఒక్కో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం విధులు నిర్వహిస్తారు. ఎంఎల్‌హెచ్‌పీ ఆధ్వర్యంలో పియర్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఆ కేంద్రం పరిధిలోని పాఠశాలలకు వెళ్లి 14 ఏళ్లలోపు బాలికల్లో వచ్చే ఆరోగ్య సమస్యలు, పరిష్కారాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలి. క్లబ్ మీటింగ్ పేరిట ఆ కేంద్రం పరిధిలోని ప్రజలకు సామాజిక రుగ్మతలు, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. ఒక కేంద్రం పరిధిలో నెలకు మూడు సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. వచ్చిన వారికి స్నాక్స్ అందించాలి. ఇందుకు ఒక్కో సమావేశానికి రూ.వెయ్యి చొప్పున నెలకు రూ.3 వేలు ఇస్తారు. వీటికి సంబంధించి గతేడాదికి రూ.11.04 లక్షలు మంజూరయ్యాయి. ఆరోగ్య అవగాహన సదస్సులు, పాఠశాలల్లో సమావేశాలు పెట్టకుండా క్షేత్రస్థాయిలో వేరే కార్యక్రమానికి వెళ్లినప్పుడు ఈ సదస్సులు పెట్టినట్లు చూపించి నిధులు మళ్లించేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

**హెచ్‌డీఎస్ నిధులూ ఇంతేనా?**

ఈ కేంద్రాల నిర్వహణకు సంబంధించి ఏడాదికి రూ.10 వేలు ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ(హెచ్‌డీఎస్)కు అందుతాయి. ఇవి కూడా తప్పుడు లెక్కలు చూపించి స్వాహా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. 2019 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంపై క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టారీతిన సాగుతోంది. కొందరు ఎంఎల్‌హెచ్‌పీలు కనీసం ఆ సబ్‌సెంటర్‌కు రోజువారీ విధులకు కూడా సక్రమంగా హాజరవడం లేదని తెలుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు నేరుగా తనిఖీలు లేకపోవడం.. ఇతర ఆదేశాలు సైతం జూమ్ సమావేశాల్లోనే ఇస్తుండడంతో లక్ష్యం తప్పుదారి పడుతోంది. పీహెచ్‌సీ వైద్యాధికారి పర్యవేక్షణ మరింత పెంచాల్సిన అవసరం ఉంది.

## ఇంటి నుంచి వెళ్లి పోయిన బాలిక

**అనపర్తి:** ఇంటి నుంచి అదృశ్యమైన మల్లిడి విహారికారెడ్డి అనే 14 ఏళ్ల బాలికను పోలీసులు క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఫిర్యాదు అందిన ఐదు గంటల్లోనే ఆమెను గుర్తించినట్టు ఎస్సై వి.రవిచంద్ర కుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. వివరాలు ఇవీ.. బలభద్రపురానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని విహారికారెడ్డి నెల రోజులుగా స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటోంది. అలాగే ఎక్కువ సమయం సెల్‌ఫోన్ చూస్తూ గడుపుతోంది. దీంతో ఆ బాలికను తండ్రి సత్యనారాయణరెడ్డి సోమవారం మందలించాడు. అనంతరం పని మీద రాజమహేంద్రవరం వెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చేసరికీ విహారికారెడ్డి కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బిక్కవోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ సారథ్యంలో రంగంపేట, బిక్కవోలు ఎస్సై లు శివ ప్రసాద్, రవిచంద్ర కుమార్ మూడు టీములుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం, బలబద్రపురం గ్రామస్తులు ఇచ్చిన సమాచారంపై దర్యాప్తు మొదలుపెట్టారు. ఆ బాలిక విశాఖపట్నం వెళ్లినట్టు గుర్తించి, అక్కడి నుంచి బిక్కవోలు తీసుకుని వచ్చి మంగళవారం తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు.

## రఘుదేవపురం ర్యాంపు వద్ద గోదావరి తీరంలో

### నిలిపిన ఇసుక లారీలు

**సీతానగరం :** రఘుదేవపురం ర్యాంపు నుంచి ఇసుక లారీలు మంగళవారం రాజమహేంద్రవరం ఉ సీతానగరం నాలుగు లేన్ల రోడ్డు ఎక్కాయి. అదే రోడ్డులో మైన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో వెంటనే ర్యాంపు నుంచి తిరిగి గోదావరి పరివాహక ప్రాంతంలోకి వెళ్లిపోయాయి. దీంతో సాయంత్రం 4 గంటల నుంచి ఇసుక ఎగుమతులను ర్యాంపు నిర్వాహకులు నిలిపేశారు. ప్రక్కిల్లంక, సీతానగరం రెవెన్యూ లంక భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు పొంది, నిబంధనలను తుంగలో తొక్కి అధిక లోడుతో లారీలపై ఇసుక తరలిస్తున్నారు. బిల్లులు లేకుండా అమ్మకాలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో మైన్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారని తెలిసి ఇలా వెనక్కి తిప్పేశారు. అనంతరం రాత్రి సమయంలో తరలించారు.

## అక్రమాలు.. నిగ్గు తేల్చేదెప్పుడు..?



**రాజమహేంద్రవరం:** భాస్కర్ నగర్ కాలనీలో భూ మాఫియా వెలుగులోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ బాధ్యులపై చర్యల్లేవు. గత ప్రభుత్వ హయంలో అధికారం అడ్డుపెట్టుకొని జరిగిన భూ దందాపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. రూ. కోట్లు విలువైన భూములను నకిలీ పత్రాలు సృష్టించి అమ్మేశారు. కూటమి అధికారం చేపట్టగానే అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అసెంబ్లీలో ప్రస్తావించడంతో ప్రభుత్వ స్పందించి విచారణకు ఆదేశించింది. అధికారులు ప్రాథరిమిక విచారణ పూర్తి చేసి నివేదిక ప్రభుత్వం, జిల్లా కలెక్టర్‌కు అందించారు.

**ఏం జరిగిందంటే..**

1970లో వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు సొసైటీగా ఏర్పడి భాస్కర్ నగర్ కాలనీలో 36 ఎకరాలు కొనుగోలు చేసి ప్లాట్లుగా విభజించారు. అప్పట్లో కొంత మంది మాత్రమే నేరుగా వాటిని రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు. కొంత కాలం తర్వాత సొసైటీ నడపకపోవడంతో సహకార శాఖ స్వాధీనం చేసుకుంది. అందులో పని చేస్తున్న అధికారుల అండతో, ఇక్కడ సబ్ రిజిస్ట్రార్ సహాయంతో ఖాళీగా ఉన్న ప్లాట్లకు పత్రాలు సృష్టించి, ఇతరుల పేర్లతో రిజిస్ట్రేషన్లు చేయించారు. గతంలో పని చేసిన అధికారులు ఇందుకు బాధ్యులుగా ఉన్నారు. అందుకు ప్రతిఫలంగా రెండు మూడు ప్లాట్లు వారి అనూయాయుల పేర్లతో రిజిస్ట్రర్ చేయించారు. భారీగా నగదు కూడా చేతులు మారినట్లు తెలుస్తుంది. దీని వెనుక రాజకీయ నాయకుల పాత్ర ఉన్నట్లు తేలింది.

**36 ఎకరాలు.. 278 ప్లాట్లు..**

మొత్తం 36 ఎకరాల్లో 278 ప్లాటుగా విభజించినట్లు తేల్చారు. వాటిలో 135 ప్లాట్లు సక్రమంగా ఉన్నట్లు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. మిగిలిన వాటిలో అక్రమాలు ఉన్నట్లు తేల్చారు. వీటిలో కొన్ని నకిలీ ధ్రువీకరణ పత్రాలు, దొంగ రిజిస్ట్రేషన్లు, పేర్లు మార్పులు ఉన్నట్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. ఇంతలో కలెక్టర్ బదిలీ కావడంతో కొంత ఆలస్యమైంది. ఒక్కొక్క ప్లాటు రూ. 2 కోట్లకు పైగా విలువ చేయగా, సుమారు రూ.200 కోట్లు పైబడి అక్రమాలు జరిగినట్లు తెలుస్తుంది. పూర్వం ఉద్యోగులు కొనుగోలు చేసిన భూములకు సంబంధించి రికార్డులు మాయం చేసి కొత్తవి సృష్టించి అమ్మకాలు చేసేశారు. వీటిలో కొన్ని చోట్ల భారీ భవంతులు నిర్మించారు.

**మాకేంటి సంబంధం..?**

గతంలో జరిగిన సంఘటనకు మేం బాధ్యులం కాదంటూ ప్రస్తుతం ఉన్న అధికారులు తప్పించుకొంటున్నారు. పదోన్నతులతో మరి కొంత మంది ఉద్యోగులు సీట్లు మారిపోతున్నారు. నగరం నడిబొడ్డున రూ. కోట్లు విలువ చేసే భూములు దర్జాగా కాజేస్తే కాపాడాల్సింది పోయి, తప్పించుకొనేందుకు యంత్రాంగం ప్రయత్నాలు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## కోనసీమలో గల్ఫ్ గుబులు



**అమలాపురం :** పశ్చిమాసియాలో అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం జిల్లాలోని పలు పల్లెల్లో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. జిల్లా నుంచి వేల మంది అక్కడికి వెళ్లి పలు సంస్థల్లో జీవనోపాధి పొందుతున్నారు. అమెరికా, ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తున్న గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడులకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో తమ వాళ్లు ఎలా ఉన్నారోనని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

**ఈ 5 దేశాల్లోనే..**

జిల్లా నుంచి ఎక్కువగా దుబాయ్, సౌదీ, ఖతార్, కువైట్, బహ్రెయిన్ దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్తున్నారు. కనీస విద్యార్హత లేకున్నా పని చేసుకునేందుకు అక్కడ అవకాశముంది. మహిళలు ఇళ్లలో పనులు, వంట వారికి సహాయకులుగా, ఇతర పనులకు వెళ్తుంటారు. పురుషులు ఇంటి పనివారిగా, డ్రైవర్లుగా, గొర్రెలు, ఒంటెల కాపరులు, నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. మరికొందరు ఇజ్రాయెల్, ఇరాన్‌లలో ఉన్నారు.

**130 మంది చినగోవలంక గ్రామస్థులు**

తాళ్లరేవు మండలం చినగోవలంకకు చెందిన 130 మంది గల్ఫ్‌లోని వివిధ దేశాల్లో ఉన్నారు. ప్రస్తుతానికి ప్రమాదం లేదని కువైట్‌లో ఉన్నవారు తెలిపారు. ఫోన్ ద్వారా క్షేమ సమాచారం ఇస్తున్నారన్నారు. కువైట్‌లో ఉంటున్న కురాటి రాము, బహ్రెయిన్ ఉండే నల్లి గిరి ప్రసాద్ వీడియోకాల్‌లో మాట్లాడారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీఎన్ఆర్ఐ విభాగ ప్రతినిధులు జూమ్‌కాల్ ద్వారా మాట్లాడి భరోసా ఇచ్చారు.

**కొవిడ్ తరహా వాతావరణం**

కొవిడ్ సమయంలో దుబాయ్‌లో జనసంచారం లేక ప్రధాన రహదారులు మొదలు గల్లీల వరకు నిర్మానుష్యంగా ఉండేవి. ప్రస్తుతం జనం ఇళ్లకు పరిమితమై అదే పరిస్థితి నెలకొంది. రోడ్లు ఖాళీగా ఉన్నాయి. బుర్జ్ ఖలీఫా ప్రాంతంలో నేను ఉంటున్నాను. రెండు రోజుల క్రితం ఇక్కడ ఎయిర్‌బేస్‌పై మిస్సైల్ దాడి జరిగింది. ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించింది.

## అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి.. 100 మంది అంగన్వాడీలు నిరసన



**పెరవలి:** శాంతియుతంగా తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం పట్ల మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల పరిధిలోని 100 మంది అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సెక్టార్ యూనియన్ లీడర్ కృష్ణవేణి మాట్లాడుతూ.. కనీస వేతనాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో మార్చి 2న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రభుత్వానికి ముందుగానే తెలియజేశామన్నారు. అక్కడ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని తెల్లవారుజామున 4 గంటలకు పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి బస్సులో తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ నాయకులను విడుదల చేసి, సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## పెళ్లి చేసుకుంటానని మోసగించిన సచివాలయ ఉద్యోగి అరెస్టు

**రాయవరం:** వారిద్దరికీ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. చాటింగ్‌లు చేసుకుని ఫోన్ నంబర్లు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం అతను ప్రేమిస్తున్నానని చెప్పి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెకు శారీరకంగా దగ్గరయ్యాడు. తాను గర్భవతినని.. పెళ్లి ఎపుడు చేసుకుందామని ఆమె అడగ్గా అతను మొహం చాటేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో గ్రామ సచివాలయ ఉద్యోగిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు మంగళవారం రాత్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట న్యూకాలనీకి చెందిన నూకతట్టు శ్రీనివాస్ ఆత్రేయపురం మండలంలోని వద్దిపర్రులో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. రాయవరం గ్రామానికి చెందిన ఓ యువతి మండపేటలోని బంధువుల ఇంటికి వెళ్లిన సందర్భంలో పొరుగునే ఉన్న అతను ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. అప్పటికే ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెను ఫాలో అవుతూ సంవత్సరానికి పైగా ప్రేమ వ్యవహారం నడిపాడు. ఈ క్రమంలో శారీరకంగా దగ్గరైన అనంతరం పెళ్లికి నిరాకరించడంతో పాటు మరో యువతిని పెళ్లి చేసుకునే ప్రయత్నంలో అతను ఉన్నట్లు తెలుసుకున్న యువతి.. తనను నమ్మించి మోసం చేశాడని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసి మంగళవారం యువకున్ని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

## కాలువలో మహిళ మృతదేహం

**అనపర్తి:** అనపర్తి కొత్తూరు శివారు కై లాస భూమి ఎదురుగా ఉన్న ఎర్ర కాలువలో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే.. అనపర్తికి చెందిన పడాల వెంకట రామకృష్ణారెడ్డి తండ్రి ఏడాది క్రితం చనిపోయారు. అప్పటి నుంచీ తల్లి పుష్పవతి (75) శేషయ్య నగర్‌లోని సొంత ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నారు. ఆమె చాలా కాలంగా గర్భాశయ క్యాన్సర్‌తో బాధపడుతూ కాకినాడ జీజీహెచ్‌లో మందులు వాడుతున్నారు. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం కనబడకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. కాగా.. ఈ నెల ఒకటిన రామకృష్ణారెడ్డి తన తల్లికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఇంటికి వెళ్లి చూడగా కనిపించలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో అనపర్తి కొత్తూరు శివారు కై లాస భూమి ఎదురుగా ఉన్న ఎర్ర కాలువలో ఆమె మృతదేహం ఉన్నట్టు సమాచారం అందింది.

## విజయదుర్గా పీఠంలో పూజలు

**రాయవరం:** మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో మంగళవారం చంద్రగ్రహణానంతరం సంప్రోక్షణ నిర్వహించారు. భక్తుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేతుగ్రస్త చంద్రగ్రహణ హోమం నిర్వహించారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) ఆదేశాల మేరకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం 3.20 గంటలకు ప్రారంభమైన హోమం సాయంత్రం 6.46 వరకూ కొనసాగింది. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ పీఠంలో భక్తుల సంక్షేమాన్ని ఆశించి ఈ హోమాన్ని నిర్వహించామన్నారు. గ్రహణానంతరం పీఠంలోని అమ్మవారితో పాటు పరివార దేవతలకు సంప్రోక్షణ అనంతరం పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. బుధవారం ఉదయం నుంచి భక్తులకు అమ్మవారి పునఃదర్శనాన్ని, సామూహిక కుంకుమ పూజలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు భాస్కర నారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్య కనకదుర్గ, బుజ్జి, పీఆర్వో బాబీ పాల్గొన్నారు.

## కంటైనర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



**చౌటుప్పల్ :** హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వద్ద మంగళవారం ఉదయం కంటైనర్ వాహనాన్ని వెనుక నుంచి ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులు సుమారు పది మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో హైదరాబాద్‌కు బయలుదేరింది. మంగళవారం ఉదయం ఆరున్నర గంటలకు దండుమల్కాపురం వద్దకు చేరుకుంది. ఆ సమయంలో ముందున్న కంటైనర్‌ను వెనుక ఉన్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ఢీకొట్టింది. బస్సులో 36 మంది ప్రయాణికులు ఉండగా, డ్రైవర్ దొర ప్రసాద్, ప్రయాణికులు తుర్రం గీతాంజలి, సూర్య ప్రభావతి, సాత వెంకటలక్ష్మి, కృష్ణతోపాటు పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముగ్గురిని మధ్యాహ్నం డిశ్చార్జి చేశారు. మిగిలిన వారిని ఉదయం వేరే బస్సులో హైదరాబాద్‌కు తరలించారు. ఈ బస్సు నిడదవోలు నుంచి పంగిడి, జంగారెడ్డిగూడెం, సత్తుపల్లి, సూర్యాపేట మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుండగా నిడదవోలు-జంగారెడ్డిగూడెం మధ్య 36 మంది ఎక్కారు. ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

**స్పందించిన మంత్రి దుర్గేష్..**

ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగిందనే సమాచారం అందిన వెంటనే రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తక్షణమే స్పందించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాదం జరిగిన తీరును, ప్రయాణికుల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన వారిని సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలు అధైర్యపడవద్దని, ప్రయాణికుల భద్రత విషయంలో రాజీ పడేది లేదని పేర్కొన్నారు.

## కళ్లెదుటే కాలువలో గల్లంతు



**అనపర్తి గ్రామీణం:** హోలీ పండగలో ఆనందోత్సాహాల మధ్య రంగులు పూసుకుని కేరింతలు కొట్టిన చిన్నారులు ఆ రంగులను వదిలించుకోవాలని స్నానం చేసేందుకు ఎర్రకాలువలోకి దిగారు. వీరిలో ఇద్దరు బాలురు ప్రవాహంలో కొట్టుకుపోతుండగా స్థానికులు ఒకరిని ఒడ్డుకు చేర్చారు. మరో తొమ్మిదేళ్ల బాలుడు గల్లంతయ్యాడు. అనపర్తి ధరణికోట శివాలయం సమీపంలోని ఎర్రకాలువ గట్టు వద్ద మంగళవారం బాలుడు గల్లంతవగా అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. బిక్కవోలు మండలం రంగాపురానికి చెందిన పెయింటర్ కొమరపు విజయకుమార్ (దేవా), అశ్విని దంపతులు ఎనిమిదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం అనపర్తి పాతవూరు వచ్చి ఓ ఇంట్లో ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. రెండో కొడుకు రాహుల్ (9) 3వ తరగతి చదువుతున్నారు. హోలీ పండుగ సందర్భంగా అన్నయ్య బన్ను, స్నేహితులు సాత్విక్, శేఖర్‌లతో కలిసి రంగులు పూసుకుని స్నానం చేసేందుకు ఎర్రకాలువకు వెళ్లారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో శేఖర్, రాహుల్ కొట్టుకుపోతుండగా స్థానికుడు సత్తిబాబు నీటిలోకి దూకి శేఖర్‌ను బయటకు తీసుకొచ్చారు. రాహుల్ ప్రవాహ వేగంలో గల్లంతయ్యాడు. కళ్ల ముందే తమ్ముడు నీటిలో కొట్టుకుపోవడాన్ని చూసి బన్ను కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పోలీసులు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలాన్ని ఎస్సై శ్రీనునాయక్, అదనపు ఎస్సై దుర్గాప్రసాద్ పరిశీలించారు. బాలుడి తండ్రి విజయ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కంటికిరెప్పలా కాచుకుంటున్న కొడుకు గల్లంతవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. క్షేమంగా వస్తాడనే ఆశతో ఎదురుచూస్తున్న తీరు కన్నీరు పెట్టించింది.

## ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



**ధవళేశ్వరం :** భర్త వేధింపులు తట్టుకోలేక మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. మంగళవారం మృతురాలి తల్లి ఫిర్యాదుతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజమహేంద్రవరం గ్రామీణం మోరంపూడి గణేశ్‌నగర్‌కు చెందిన తమ్మ సత్యనారాయణ కుమారుడు రవికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన కాపా సూర్యకుమారి కుమార్తె విజయలక్ష్మి(40)తో 2002లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. విజయలక్ష్మి మోరంపూడి కూడలి సమీపంలో టీ దుకాణం నడుపుతోంది. వివాహమైనప్పటి నుంచి అదనపుకట్నం తీసుకురమ్మని రవి వేధిస్తూ ఉండేవాడు. సోమవారం భర్త నుంచి వేధింపులు ఎక్కువవడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు విజయలక్ష్మి తన తల్లి, సోదరుడికి వాట్సప్ సందేశం పంపించారు. వారు కంగారుపడి ఇరుగుపొరుగు వారికి ఫోన్ చేసి సమాచారం అందించారు. అప్పటికే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రవికి వేరే మహిళతో అక్రమ సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# వేతనాలు పెంచే వరకు పోరాటం ఆగదు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** ఒకవైపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటూ ప్రగల్భాలు.. మరోవైపు హక్కుల కో సం పోరాడుతున్న మహిళా లోకంపై పోలీసుల బూట్ల చప్పుళ్లు.. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలపై ప్రభుత్వం ప్రయోగించిన నిర్బంధకాండపై విశాఖ నగరం అట్టుడికిపోయింది. విజయవాడలో అంగన్‌వాడీల అరెస్టును నిరసిస్తూ జీవీఎంసీ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ చేపట్టిన వేలాది మంది కార్యకర్తలు, లలితా జ్యువెలర్స్ జంక్షన్ వద్ద రాస్తారోకోతో హోరెత్తించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండుటెండలోనే రోడ్డుపై బైఠాయించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

హామీలు ఇచ్చి మోసం చేశారు: ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వి కుమార్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎల్.దేవి, కె.వెంకటలక్ష్మి, ఉప ప్రధాన కార్యదర్శి బందా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 42 రోజుల పాటు సమ్మె నిర్వహించినప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని, గ్రాట్యుటీ అమలు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడం దారుణమని వారు మండిపడ్డారు. తెల్లవారుజామునే మహిళల అరెస్టులుమార్చి 22న 'చలో విజయవాడ' పిలుపుతో శాంతియుత ధర్నా చేపట్టగా చర్చలకు పిలుస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. తెల్లవారుజామున 4.30 గంటలకు పోలీసులు ఒక్కసారిగా విరుచుకుపడి మహిళలను ఈడ్చుకెళ్లి వాహనాల్లో కుక్కేశారని అన్నారు. అరెస్టు చేసిన వారిని సుమారు 100 కి.మీ దూరంలోని ఏలూరు, చిలకలూరిపేట, జంగారెడ్డిగూడెం, పిడుగురాళ్ల, గుంటూరు, మంగళగిరి తదితర పోలీస్ స్టేషన్లకు తరలించారని తెలిపారు. ప్రాథమిక అవసరాలకు కూడా అనుమతి ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు.

మహిళా సాధికారత మాటల్లోనేనా?

ఒకవైపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారతపై ప్రకటనలు చేస్తూ, మరోవైపు మహిళలపై ఇలాంటి దౌర్జన్యానికి పాల్పడటం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని, అంగనవాడీ యూనియన్‌తో చర్చలు ప్రారంభించాలని, గతంలో ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

గురజాడ విగ్రహం వద్ద మానవహారం

సుమారు రెండు గంటల పాటు పోలీసులతో వాదోపవాదాలు జరిగిన అనంతరం విజయవాడలో అరెస్టు చేసిన వారిని విడుదల చేసినట్లు సమాచారం అందడంతో ఇక్కడి ఆందోళనను విరమించారు. అనంతరం గురజాడ అప్పారావు విగ్రహం వద్ద భారీ మానవహారం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఇచ్చే భవిష్యత్ కార్యాచరణ పిలుపును విజయవంతం చేయాలని నాయకులు కోరారు. వందలాది అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అరకు కాఫీకి కొత్త ఉత్సాహం: భారత ప్రభుత్వ కాఫీ బోర్డు ప్రయత్నాలు బలోపేతం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 మండలాల్లో కాఫీ బోర్డు తన కార్యకలాపాలను ముమ్మరం చేయడం ద్వారా అరకు కాఫీకి కొత్త గుర్తింపు లభిస్తోంది. గిరిజన రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శిక్షణ అలాగే ఆర్థిక సాయం అందించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఉత్తరాఖండ్ జర్నలిస్టుల బృందం అరకులోని కాఫీ నర్సరీలను సందర్శించి, నాణ్యమైన కాఫీ ఉత్పత్తి కోసం అనుసరిస్తున్న శాస్త్రీయ పద్ధతులను పరిశీలించింది.

అరకు వ్యాలీ కాఫీని అంతర్జాతీయ బ్రాండ్‌గా మార్చడానికి, అలాగే ఎగుమతులను పెంచడానికి ప్రత్యేక మార్కెటింగ్ వ్యూహాలను అమలు చేస్తున్నారు. నాణ్యమైన కాఫీ ఉత్పత్తిని ప్రోత్సహించడం, అలాగే గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచడం కోసం ఒక ముఖ్యమైన అడుగు పడింది. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పదకొండు మండలాల్లో భారత ప్రభుత్వ కాఫీ బోర్డు చేపట్టిన కార్యక్రమాలు కొత్త ఊపును సంతరించుకున్నాయి. "అరకు కాఫీ"కి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడంతోపాటూ స్థానిక పండించే వారికి నేరుగా ప్రయోజనాలు చేకూరేలా చేయడానికి అనేక కేంద్రీకృత చర్యలు అమలు చేయడం జరుగుతుంది. ఈ చొరవలో భాగంగా, పత్రికా సమాచార కార్యాలయం (పీ×దీ) ఉత్తరాఖండ్ జర్నలిస్టుల కోసం ఒక ప్రత్యేక మీడియా పర్యటనను ఏర్పాటు చేసింది. ఈ పర్యటనలో భాగంగా, మీడియా ప్రతినిధులను అరకు ప్రాంతంలోని దుంబ్రిగుడ మండలం, ముసిరి గ్రామంలో కాఫీ బోర్డు నిర్వహిస్తున్న కాఫీ నర్సరీకి తీసుకువెళ్లారు. కాఫీ మొక్కలను పెంచే విధానం, ఆధునిక నర్సరీ నిర్వహణ పద్ధతులు, అలాగే వాటి నాణ్యమైన ఉత్పత్తిని నిర్ధారించడానికి అనుసరిస్తున్న ప్రమాణాల గురించి జర్నలిస్టులకు వివరించారు.

భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే కాఫీ బోర్డు, అరకు ప్రాంతంలో స్థిరమైన కాఫీ సాగును చురుకుగా ప్రోత్సహిస్తోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన నాటడం సామాగ్రి, సేంద్రీయ సాగు, మెరుగైన ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలపై ఈ ప్రాంతంలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కాఫీ బోర్డు మినుములూరు సీనియర్ లైజన్ అధికారి శ్రీ సామల రమేష్ తెలిపారు. రైతులకు క్రమం తప్పకుండా శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం అందించడం జరుగుతోంది. అలాగే కాఫీ నాణ్యతను, దిగుబడిని మెరుగుపరచడానికి శాస్త్రీయ పద్ధతులనూ అవలంబిస్తున్నారు. ఈ చర్చా సమయంలో అరకు లోయ జూనియర్ లైజన్ అధికారి శ్రీమతి వి.వి.కె.ఎం. లక్ష్మి సైతం పాల్గొన్నారు.

భారత ప్రభుత్వం కాఫీ పండించే రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం, ఆర్థిక సహాయం, మార్కెట్ అనుసంధానం, బ్రాండింగ్ మద్దతును అందిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో "అరకు వ్యాలీ కాఫీ"ని ప్రోత్సహించడానికి ఒక ప్రత్యేక మార్కెటింగ్ వ్యూహం రూపొందించడం జరిగింది.

స్థానిక గిరిజన రైతులు ఈ చొరవను స్వాగతించారు, ఈ ప్రయత్నాలు తమ ఆదాయాన్ని గణనీయంగా పెంచుతాయని, అలాగే తమ కష్టానికి తగిన గుర్తింపుని ఇస్తాయని పేర్కొన్నారు. నిరంతర విధానపరమైన మద్దతు, శాస్త్రీయ జోక్యంతో, అరకు కాఫీ దేశంలోనే ఒక ప్రముఖ ప్రీమియం కాఫీ బ్రాండ్‌గా ఎదిగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. రానున్న సంవత్సరాల్లో కాఫీ ఉత్పత్తిని పెంచడానికి, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు ప్రాంతంలో కాఫీ ఉత్పత్తి పెంపు, ఎగుమతులు పెంచేందుకు కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనున్నట్లు కాఫీ బోర్డు వెల్లడించింది.

# పోలీస్ వారి హెచ్చరిక

## జాగ్రత్త - మన భద్రత మన చేతుల్లోనే బంగారం ధర బాగా పెరిగింది

👉 ధర పెరిగిన కొద్దీ ప్రమాదాల అవకాశాలు కూడా పెరిగాయి
👉 పిల్లల చెవులకు, ముక్కుకు బంగారం వద్దు.
👉 పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దు.
👩 మహిళలు
👉 ఒంటరిగా ఉన్నప్పుడు భారీ బంగారు ఆభరణాలు ధరించవద్దు.
👉 నిర్మానుష్య ప్రాంతాలనుండి రావడం వెళ్ళడం తగ్గించండి.
👉 రాత్రిళ్లు బైక్ మీద బంగారం ధరించి శుభకార్యాలకు / ఇతర కార్యక్రమాలకు వెళ్లడంఉరావడం వద్దు.
👉 తప్పనిసరిగా బైక్ మీద వెళ్లాల్సి వస్తే బంగారు ఆభరణాలు అసలు ధరించవద్దు.
👉 అపరిచితులకు లిఫ్ట్ ఇవ్వవద్దు.
👉 ప్రయాణం సాధ్యమైనంతవరకు హైవేలు, రద్దీ రోడ్ల మీదే సాగేలా చూసుకోండి.
👉 నిర్మానుష్య ప్రాంతాల్లో ఆగవద్దు.
🏠 ఒంటరి ఆడవారు ఉండే గృహాలు ఉ ప్రత్యేక జాగ్రత్తలు
👉 గేట్లు, తలుపులకు ఎప్పుడూ తాళం వేసి ఉంచండి.
👉 అపరిచితులతో ఎక్కువ మాటలు పెట్టవద్దు.
👉 "ఇంట్లో ఒంటరిగా ఉన్నాను" అనే సమాచారం ఎవరికీ చెప్పవద్దు.
🏠 ఇంటి భద్రత (అందరికీ)
👉 ఇంట్లో బంగారం ఉంచకండి.
👉 తప్పనిసరిగా బ్యాంక్ లాకర్‌లో పెట్టండి.
👉 అపరిచితులు తిరుగుతుంటే వెంటనే గ్రూప్‌లో తెలియజేయండి.
🚨 వాస్తవ పరిస్థితి
👉 ప్రమాదాలు చెప్పి రావు
👉 ఈ ఒక్క నెలలోనే చైన్ స్నాచింగ్‌లు విపరీతంగా పెరిగాయి
👉 ప్రధాన కారణం ఉ బంగారం ధర పెరగడం
📞 అత్యవసరంలో
👉 అనుమానం వస్తే వెంటనే 100/112 కి కాల్ చేయండి.. అప్రమత్తంగా ఉండండి.

**పోలీస్ శాఖ**

# సింహగిరిపై పెళ్లిసందడి

**సింహాచలం (విశాఖ సమాచారం):** సింహగిరిపై వెలసిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి పెళ్లిసందడి మొదలైంది. సింహగిరి నుంచి కొండదిగువకు విచ్చేసి తన సోదరి అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారు వద్దకు వెళ్లి తనకు పిల్లనివ్వమని స్వామివారు ప్రార్థించారు. తొలుత నిరాకరించిన అమ్మవారు, స్వామివారి వైభవం, భక్తజనసందోహం చూసి ఆశ్చర్యపడి చివరకు అంగీకరించారు. దీంతో ఈ నెల 19న ఉగాది రోజు పెళ్లిరాట ఉత్సవం, అలాగే 29న చైత్ర శుద్ధ ఏకాదశి నాడు వార్షిక కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**పాల్గుణ పౌర్ణమి డోలోత్సవం వైభవం**

పాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి డోలోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఆనవాయితీగా అడవివరం గ్రామంలోని కొండదిగువ పుష్కరిణి కల్యాణమండపంలోని ఉద్యానవన మండపంలో ఈ ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఈసారి చంద్రగ్రహణం కారణంగా వేకువజామునే డోలోత్సవం నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గడిచిన యాభై ఏళ్లలో ఇంత తెల్లవారుజామున డోలోత్సవం జరగలేదని దేవస్థానం వైదికులు తెలిపారు.

**పల్లకీ ఊరేగింపు.. భక్తుల పరవశం**

ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీదేవి, భూదేవి సమేతంగా విశేషంగా అలంకరించి సింహగిరి నుంచి పల్లకీలో తెల్లవారుజామున 4 గంటలకు కొండదిగువకు తీసుకొచ్చారు. దేవస్థానం ఈవో జె.వెంకటరావు దంపతులు, అధికారులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద హారతుల మధ్య స్వామివారిని ఆహ్వానించారు. అనంతరం పుష్కరిణి సత్రం వద్ద ఉద్యానవన మండపంలో ఏర్పాటు చేసిన డోలిపై వేంచేపచేసి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, చూర్ణోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. అర్చకులు సమర్పించిన వసంతాలను భక్తులపై చల్లగా, స్వామికి పెళ్లికుదిరిన ఆనందంలో భక్తులు ఒకరిపై ఒకరు వసంతాలు జల్లుకుని ఆనంద డోలికల్లో మునిగిపోయారు. అనంతరం పానకం ప్రసాదంగా అందించారు.

గ్రామ తిరువీధి మహోత్సవం : అడవివరంలో తిరువీధి ఉత్సవం ఘనంగా జరిగింది. పెళ్లికొడుకు అలంకరణలో ఇంటిముందుకు విచ్చేసిన స్వామివారికి గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం స్వామిని తిరిగి సింహగిరికి చేర్చారు. దేవ స్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేదపండితులు, పారాయణదారులు ఈ ఉత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

# విజ్ఞాన వారోత్సవాలు... 2026



**తూర్పుగోదావరి :** జిల్లా విద్యాశాఖ అధికారి కె. వాసుదేవరావు వారి ఉత్తర్వుల ప్రకారం బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోపాలపురం నందు విజ్ఞాన వారోత్సవాలు-2026 లో భాగంగా "మండల స్థాయి" పోటీలు మండల విద్యాశాఖ అధికారులు జి. శ్రీనివాసరావు, ఏ. మహేశ్వర రావు, క్లస్టర్ చైర్మన్ పి. వెంకట కనక పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రైమరీ విభాగం, సెకండరీ విభాగం లో పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్ కాంపిటీషన్, డిబేట్ కాంపిటీషన్, సైన్స్ సెమినార్, ఫాన్సీ డ్రెస్ వివిధ రకాల కాంపిటీషన్లలలో మండల స్థాయిలో పోటీలు నిర్వహించడం జరిగినదని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోపాలపురం విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజంపాలెం విద్యార్థులు మండల స్థాయిలో సెలెక్ట్ అయినట్లు తెలియజేశారు. మండల స్థాయిలో సెలెక్ట్ అయిన విద్యార్థులు "జిల్లాస్థాయి పోటీల"కు 6వ తారీఖున ఉదయం 9 గంటలకు ఎస్కెవిటి హైస్కూల్ రాజమహేంద్రవరంలో పోటీలకు హాజరు కావలసి ఉందని అన్నారు. జిల్లా స్థాయికి ఎన్నికైన ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థులకు, గైడ్ టీచర్లకు మండల విద్యాశాఖ తరఫున అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీఆర్పీ కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# హోలీ పండుగ కథ (సంక్షిప్తంగా)



ఒకప్పుడు హిరణ్యకశిపుడు అనే రాక్షస రాజు ఉండేవాడు. అతను తానే దేవుడని అందరూ పూజించాలని కోరుకున్నాడు. కానీ అతని కుమారుడు ప్రహ్లాదుడు మాత్రం విష్ణుమూర్తిని భక్తితో ఆరాధించేవాడు.

దీనికి కోపగించిన హిరణ్యకశిపుడు తన చెల్లెలు హోలికా సహాయంతో ప్రహ్లాదుడిని మంటల్లో కాల్చివేయాలని యత్నించాడు. హోలికాకు అగ్ని తగలదనే వరం ఉండేది. కానీ విష్ణువు కృపతో ప్రహ్లాదుడు కాపాడబడ్డాడు, హోలికా దహనమైంది.

అందుకే చెడుపై మంచి గెలిచిన గుర్తుగా హోలికా దహనం చేసి, ఆనందంగా హోలీ పండుగ జరుపుకుంటారు.

🌙 1. హోలికా దహన్

పౌర్ణమి రాత్రి గ్రామాలు, కాలనీల్లో మంటలు వెలిగించి "హోలికా దహన్" చేస్తారు. చెడుపై మంచి గెలిచిందని సూచిస్తుంది.

# గ్రహణం పట్టింది.. రోకలి నిలబడింది

**తగరపువలస (విశాఖ సమాచారం):** ఇది ఒక వైజ్ఞానిక అద్భుతమో లేక తరాల నాటి నమ్మకమో తెలీదు కానీ.. నేటికీ పల్లెల్లో గ్రహణ గడియలను లెక్కగట్టడానికి రోకలిని ఉపయోగిస్తున్నారు. సూర్య, చంద్ర గ్రహణాల సమయాల్లో గ్రామీణులు అనుసరించే 'రోకలి సూత్రం'భీమిలి ప్రాంతంలో మరోసారి చర్చనీయాంశమైంది. జీవీఎంసీ భీమిలి జోన్ వలందపేటలో మంగళవారం చంద్రగ్రహణం సందర్భంగా మహిళలు ఈ పద్ధతిని ప్రదర్శించారు. ఒక కంచు గిన్నెలో పాలు పోసి, అందులో రోకలిని నిలబెట్టి పూజలు చేశారు. గ్రహణం పట్టినంత సేపు ఆ రోకలి ఆధారం లేకుండా నిటారుగా నిలబడటం అందరినీ ఆశ్చర్యపరిచింది. సుమారు మూడు గంటల పాటు అలాగే ఉన్న రోకలి, గ్రహణం వీడగానే దానంతట అదే పక్కకు వాలిపోయింది. దీన్ని బట్టే గ్రహణ పట్టు విడుపులను తాము గుర్తిస్తామని ఈ ప్రాంత వాసులు చెబుతున్నారు.

# అతిథి అధ్యాపకులు వినూత్న నిరసన



ఏ యూ రిజిస్ట్రార్ కార్యాలయంలో వద్ద వెజిటేబుల్స్ అమ్ముతూ గెస్ట్ ఫ్యాకల్టీలు వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** ఆంధ్ర యూనివర్సిటీ అతిథి అధ్యాపకుల నిరసన దీక్షలు 17వ రోజుకి చేరుకున్నాయి . అదేవిధంగా ఈరోజు వినూత్నంగా డాక్టరేట్స్ మార్ట్ కూరగాయల మార్కెట్ ను ఏర్పాటు చేశారు . ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అనేక రకాలుగా వెతుక్కోవాలని సూచించడంతో ఈరోజు డాక్టరేట్స్ వెజిటబుల్ మార్ట్ ఏర్పాటు చేయటం జరిగింది. మాల్లో పని చేసే వారందరికీ రోజు వారి వేతనం 1000 రుపీస్ గా ఇవ్వటం జరుగుతుంది . అదే రకంగా ఆంధ్ర యూనివర్సిటీ అతిథి ఆధ్యాపకులకు రోజు వారి వేతనం సుమారుగా 25 రూపాయలు మాత్రమే. రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీలు మాదిరిగా నెలవారీ జీతాలు ఇవ్వాలని ఈ సందర్భంగా యూనివర్సిటీ అధికారులు కోరడం జరుగుతుంది. కార్యక్రమంలో పాల్గొన్నవారిలో డా.సురేష్ మీనన్,శేషు, త్రినాధ్, రమ్య, సునీత, ఫణి చందన ,కోమలి రజిని, ప్రసాద్ ,రామ్ ,దాస్, రవి, శిరీష్, మురళి, అంబేద్కర్ గిరీష్ , తదితరులు ఉన్నారు.

# పోర్టులో లోవోల్టేజ్ షోర్ పవర్ సిస్టమ్ సౌకర్యం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** : నౌకల నుంచి వెలువడే ఉద్గారాలతో పాటు.. పోర్టు నుంచి వచ్చే కాలుష్యాన్ని తగ్గించేందుకు వంద శాతం చర్యలు తీసుకుంటున్నామని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డా. అంగముత్తు తెలిపారు. పోర్టులోని ఈక్యూఉ1 బెర్త్ వద్ద రూ.5.4 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 1000 కేవీఏ సామర్థ్యం గల లోవోల్టేజ్ షోర్ పవర్ సిస్టమ్ సౌకర్యాన్ని మంగళవారం ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన రోమాస్ ఎలక్ట్రిక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేశామని తెలిపారు. 'హరిత్ సాగర్' కార్యక్రమంలో భాగంగా పర్యావరణహిత పోర్టు కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు వీపీఏ నిరంతరం శ్రమిస్తోందన్నారు. ఇది పోర్టులో ప్రత్యామ్నాయ మారీటైమ్ పవర్(ఏఎంపీ) కార్యక్రమం దశలవారీ అమలులో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చైర్‌పర్సన్ రోష్ని అపరాంజితో పాటు వీపీఏ అధికారులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

# మార్చి 08న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాలికలు, యువతులకు దేశవ్యాప్త క్రీడా పోటీలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారం):** దేశంలో 250 ప్రాంతాలు ఎంపిక, ఏపీ నుంచి 08 జిల్లాల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్న మై భారత్ ఆంధ్రప్రదేశ్ మహిళలను క్రీడల్లో భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో కేంద్ర యువజన వ్యహారాలు & క్రీడల మంత్రిత్వ శాఖ ఈ ఏడాది 08 మార్చిన అంతర్జాతీయ మహిళా దినోత్సం సందర్భంగా "అస్మిత" అనే కార్యక్రమం ద్వారా దేశవాప్తంగా పెద్ద ఎత్తున క్రీడ పోటీలను నిర్వహిస్తున్నట్లు మై భారత్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ శ్రీ ఆసుమన్ ప్రసాద్ దాస్ తెలిపారు. ఈ రోజు(04 మార్చి 2026) ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో విజయవాడ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి విలేకర్ల సమావేశం నిర్వహించారు. మహిళలను గౌరవించడం మన దేశ సంప్రదాయమని.. దానికి కొనసాగింపుగా క్రీడల్లోనూ వారి భాగస్వామ్యం పెంచేలా, మరింత మంది బాలికల్ని క్రీడల వైపు ప్రోత్సహించేలా చేయడమే ఆస్మిత కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో పాల్గొనే వారు.. తర్వాతి తరాలకు కూడా ఆ క్రీడా స్ఫూర్తిని తీసుకెళతారని డైరెక్టర్ ప్రసాద్ దాస్ అన్నారు. "అస్మితా" కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా 250 ప్రాంతాల్లో నిర్వహించనుండగా.. ఆంధ్రప్రదేశ్ లోని 8 ప్రాంతాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని చిత్తూరు, తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, కర్నూలు, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఈ మహిళా క్రీడలను నిర్వహించనున్నారు. ఇందులో ప్రధానంగా అథ్లెటిక్స్ విభాగంలో 100 మీ.. 200 మీ., 400 మీ. పరుగు పోటీలు, క్రీడల్లో పాల్గొనే వారిని ఉత్సాహపరిచేలా టగ్ ఆఫ్ వార్ వంటి వినోదాత్మక క్రీడలు ఉండనున్నట్లు వివరించారు. ఈ క్రీడల్లో పాల్గొనే 13-28 ఏళ్ల వయస్సు గల బాలికలు, యువతులు అర్హులని వెల్లడించారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వాళ్లు తప్పనిసరిగా ఆధార్ కార్డు, 10వ తరగతి సర్టిఫికేట్, జనన ధృవీకరణ సర్టిఫికేట్ ధృవీకరణ చేస్తారు. పట్టణ, నగర, గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు, యువతుల్లో ఫిట్నెస్, చురుకైన జీవనశైలిని పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అస్మితా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు మై భారత్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, డిజిటల్ సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు జిల్లా యువజన వ్యవహారాల అధికారి సుంకర రాము తెలిపారు.

# వివాదంలో 'ఉమా మనోవికాస కేంద్రం' భవనం అధికారుల నివేదిక కోసం ఎదురుచూపులు



**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్ :** నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ వాటిని పక్కనబెట్టి నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు మళ్లీ తెరపైకి వచ్చాయి. కాకినాడ రూరల్ వాకలపూడిలో 'ఉమా మనోవికాస కేంద్రం' పేరిట సాగుతున్న భవన నిర్మాణం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అనుమతుల్లో పేర్కొన్న నమూనాకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారన్న అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై వార్తలు వెలువడటంతో స్పందించిన యాజమాన్యం తమపై చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ వివరణలు ఇస్తోంది. అక్రమం అంగీకరిస్తూనే అడ్డగోలు వాదనలు వినిపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ గారికి ఎస్ పి రెడ్డి సమర్పించిన వినతిపత్రమే వారి అక్రమాలకు సజీవ సాక్ష్యం. సిల్ట్ ప్లస్ రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని, దొంగచాటుగా సిల్ట్ ప్లస్ మూడు అంతస్తులు నిర్మించడం అక్రమం కాదా అనుమతి లేని అదనపు స్లాబులు వేయడం నిబంధనల ఉల్లంఘన కాదా మేము బిపిఎస్ (క్రమబద్ధీకరణ) కింద డబ్బులు కడతాం అని చెప్పడం ద్వారా తాము తప్పు చేశామని వారే అంగీకరించారు. మరి తప్పు చేసినప్పుడు పశ్చాత్తాపం ఉండాలి కానీ ప్రశ్నించిన మీడియాపై పడి ఏడవడం ఏ సంప్రదాయం నిర్మాణానికి సంబంధించిన అనుమతులు సంస్థ పేరు మీద లేవు; అది వ్యక్తుల పేరు మీద ఉన్న ప్రైవేట్ ఆస్తి. కానీ కలెక్టర్ వద్దకు వెళ్లేసరికి మాత్రం దివ్యాంగుల సేవ అనే సెంటిమెంట్ కార్డును వాడుతున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం భవనం కడుతున్నామని చెబుతున్న మీరు అదే పిల్లల భద్రతను పణంగా పెట్టి నిబంధనలకు విరుద్ధంగా అంతస్తులు ఎందుకు పెంచుతున్నారు రేపు ఏదైనా ప్రమాదం జరిగితే ఆ సేవ పేరుతో తప్పించుకుంటారా క్షేత్రస్థాయిలో వాస్తవాలను వెలికితీసిన ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మరియు సిక్స్ టీవీ వంటి ఛానళ్లపై నిందలు వేయడం అత్యంత హేయమైన చర్య. ముప్పై ఐదు మంది మీడియా ప్రతినిధులు వచ్చి డబ్బులు అడిగారని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. అక్రమ కట్టడాన్ని అడ్డుకున్నందుకు వాస్తవాలను ప్రజల ముందు ఉంచినందుకు మీడియాపై కక్షగట్టడం పత్రికా స్వేచ్ఛను ఖూనీ చేయడమే. తప్పు చేసిన వారు తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి అబద్ధపు ఆరోపణలు చేయడం వారి నైచ్యాన్ని తెలియజేస్తోంది. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం ఎందుకు చేయలేదు. మీది స్వచ్ఛమైన సేవ అయితే దొంగచాటుగా అదనపు అంతస్తులు ఎందుకు వేయాల్సి వచ్చింది అక్రమ నిర్మాణం అని తెలిసీ దానిని సమర్థించుకోవడానికి జర్నలిస్టుల మీద నిందలు వేయడం ధర్మమేనా దివ్యాంగుల పట్ల మాకు గౌరవం ఉంది కానీ ఆ పేరుతో జరిగే అక్రమాలను సహించేది లేదు. బిపిఎస్ పేరుతో అక్రమాలను సక్రమం చేసుకోవాలని చూస్తున్న ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారులను తప్పుదోవ పట్టిస్తూ జర్నలిస్టుల ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న ఎస్ పి రెడ్డి మరియు సదరు యాజమాన్యంపై విచారణ జరిపించాలి. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాన్ని తక్షణమే తొలగించి చట్టం అందరికీ ఒక్కటేనని నిరూపించాలి. తప్పు చేసిన వారు తలదించుకోవాలి కానీ ఎదురుదాడి చేయడం వారి అహంకారానికి నిదర్శనం. అక్రమ కట్టడాల వెనుక ఉన్న అసలు రహస్యాలను బయటపెట్టే వరకు మీడియా తన పోరాటాన్ని ఆపదు. సేవ అనే ముసుగులో సాగుతున్న ఈ అక్రమ దందాను అడ్డుకోవాల్సిందే.

# క్రీడా సినిమా సమాచారమ్

## దళపతి వల్ల స్ట్రగుల్స్..రాకింగ్ స్టార్ యష్ వల్ల హ్యాపీ!





కన్నడ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ ఏడాది ఒకేసారి తమిళ, తెలుగు భాషల్లో ఎంట్రీ ఇస్తోంది. ఇదే సమయంలో కన్నడతో పాటు తమిళ, తెలుగు భాషల్లో భారీ సినిమాలని నిర్మిస్తోంది. ఇప్పటికే కోలీవుడ్ లో స్టార్ హీరో దళపతి విజయ్ కథానాయకుడిగా ఆయన చివరి యూవీ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ –జన నాయగన్–ని నిర్మించింది. దీన్ని జనవరి 9న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేసింది. కానీ సెన్సార్ వివాదం కారణంగా సినిమా పోస్ట్ పోన్ కావడం, కేసు మద్రాస్ హైకోర్టు వరకు వెళ్లడంతో మేకర్స్ కొంత ఇబ్బందికి లోనయ్యారు దళపతి విజయ్‌కి ఈ మూవీ ఫేర్‌వెల్ ఫిల్మ్ అవ్వాలని శతవిధాల ప్రయత్నించారు కానీ దాని వెనక రాజకీయ కోణం ఉండటంతో సినిమా రిలీజ్ మా చేతులు దాటిపోయిందని తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అయితే ఇదే సమయంలో కన్నడ రాకింగ్ స్టార్ యష్ కథానాయకుడిగా –టాక్సిక్– వంటి పాన్ ఇండియా మూవీని ఇదే కేవీఎన్ ప్రొడక్షన్స్ అధినేత వెంకట్ కె. నారాయణ అత్యంత భారీ స్థాయిలో నిర్మించారు. ఆయతో కలిసి హీరో యష్ కూడా ఈ మూవీకి నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించారు. గీతూ మోహన్ దాస్ డైరెక్ట్ చేసిన ఈ సినిమా మార్చి 19న బారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ కాబోతోంది. –జన నాయగన్– విషయంలో తీవ్ర ఆవేదనకు గురైన నిర్మాత వెంకట్ కె. నారాయణ –టాక్సిక్– విషయంలో మాత్రం ఫుల్ హ్యాపీగా ఉన్నారట. –జన నాయగన్– బడ్జెట్ రూ.300 కోట్లు. సినిమా రిలీజ్ ఆలస్యం అవుతుందడంతో బిజినెస్ పరంగా అంత పెద్ద మొత్తం బ్లాక్ అయిపోయింది. అయితే యష్ నటించిన –టాక్సిక్– పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. దీనికి ప్రధాన కారణం హీరో యష్ కావడంతో మేకర్స్ ఆనందంగా ఉన్నారట. ాశ్రీంశీ =ఘుం – టామ్‌ఉజెండయా సీక్రెట్ వెడ్డింగ్.. నిజమేనా? విషయం ఏంటంటే భారీ స్థాయిలో ఓ హాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా నిర్మాణం పరంగా బడ్జెట్ అంచనాలు దాటిపోయిందట. అయితే ఆ విషయం తెలుసుకున్న యష్ తన రెమ్యునరేషన్‌ని వదులుకుని సినిమా నిర్మాణంలో భాగస్వామి అయ్యారట. లాభాల్లో వాటా పద్ధతిలో ఈ మూవీకి యష్ భాగస్వామిగా వ్యవహరిస్తుండటంతో నిర్మాత వెంకట్ కె. నారాయణ చాలా హ్యాపీగా ఫీలవుతున్నాడని తెలిసింది. ఈ పద్ధతిని స్టార్ హీరోలు మాత్రమే గత కొంత కాలంగా పాటిస్తున్నారు. షారుక్ ఖాన్, చిరంజీవి వంటి వారు మాత్రమే సినిమా లాభాల్లో వాటాల రూపంలో పారితోషికాలని తీసుకుంటున్నారు. ఆ ఫార్ములాని –టాక్సిక్– మూవీకి యష్ ఫాలో అవుతుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో విశేషం ఏంటంటే దీనికి దర్శకురాలు గీతూ మోహన్ దాస్‌తో కలిసి యష్ స్టోరీ అందించడం. దీంతో తన అభిమానులు ఆశించిన అంశాలని చాలా వరకు ఇందులో యష్ పొందుపరిచినట్టుగా తెలుస్తోంది. ఇదిలా ఉంటే –కేజీఎఫ్ 2– తరువాత యష్ నుంచి వస్తున్న సినిమా కావడంతో అభిమానులు, సినీ ప్రియులు ఈ మూవీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రేక్షకుల నుంచి భారీ డిమాండ్ ఉండటంతో బిజినెస్ కూడా భారీగానే జరిగినట్టుగా ఇన్ సైడ్ టాక్.

## ఇలాంటి పోస్టర్ చూసి ఎన్నాళ్లయ్యిందో.




టాలీవుడ్‌లో ఒకప్పుడు సినిమా మినిమమ్ టాక్ అందుకుంటే చాలు.. థియేటర్ల దగ్గర '50 రోజులు', '100 రోజులు' షీల్డుల హంగామా మామూలుగా ఉండేది కాదు. సక్సెస్ పోస్టర్ల మీద ఆ నంబర్లు కనిపిస్తే వచ్చే కిక్కే వేరు. కానీ మారుతున్న కాలంతో పాటు ట్రెండ్ కూడా మారిపోయింది. ఇప్పుడు సినిమా రిలీజ్ అయిన రెండు మూడు వారాల్లోనే బాక్సాఫీస్ లెక్కలు తేలిపోతున్నాయి. ఆ తర్వాత ఫ్యాన్స్ కూడా కలెక్షన్ల పోస్టర్ల కోసమే వెయిట్ చేస్తున్నారు కానీ, ఇన్ని రోజులు ఆడింది అనే ఒకప్పటి క్లాసిక్ ఫీలింగ్‌ను మిస్ అవుతున్నారు ఈమధ్య కాలంలో ఇండస్ట్రీ హిట్ అనిపించుకున్న పెద్ద సినిమాలు కూడా ఏడు వారాలు ముగియకముందే ఓటీటీ బాట పడుతున్నాయి. దీంతో థియేటర్లలో సినిమా ఎక్కువ రోజులు నిలబడే పరిస్థితి కనిపించడం లేదు. అప్పట్లో ఒక మోస్తరు సినిమా కూడా తనదైన జోరుతో 75 రోజులు, 100 రోజులు పోస్టర్లను రిలీజ్ చేసేది. కానీ ఇప్పుడు మిలియన్ డాలర్ల మార్కు, వందల కోట్ల గ్రాస్ వసూళ్ల హంగామా మధ్య ఈ 'రోజుల' లెక్కలు కనుమరుగవుతున్నాయి. సరిగ్గా ఇక్కడే మెగాస్టార్ చిరంజీవి తన లేటెస్ట్ సినిమాతో ఆ పాత జ్ఞాపకాలను మళ్ళీ గుర్తు చేశారు. ాశ్రీంశీ =ఘుం – దళపతి వల్ల స్ట్రగుల్స్..రాకింగ్ స్టార్ యష్ వల్ల హ్యాపీ! అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' బాక్సాఫీస్ దగ్గర ఓ రికార్డ్ ని అందుకుంది. ఈ సినిమా ఏకంగా 109 సెంటర్లలో 50 రోజులు పూర్తి చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. అసలు ఇలాంటి పోస్టర్ చూసి ఎంత కాలం అయ్యిందో కదా అని నెటిజన్లు కూడా సోషల్ మీడియాలో చర్చించుకుంటున్నారు. నేటి ఓటీటీ కాలంలో కూడా 100కు పైగా కేంద్రాల్లో 50 రోజులు ఆడటం అంటే అది మెగాస్టార్ మాస్ పవర్‌కు నిదర్శనమనే చెప్పాలి. ఈ రికార్డు కేవలం థియేటర్లకే పరిమితం కాలేదు. ఒకవైపు ్గజుజు5' ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతూ అక్కడ కూడా నెంబర్ వన్ ప్లేస్‌లో దూసుకుపోతోంది. సాధారణంగా ఓటీటీలోకి వచ్చిన తర్వాత థియేటర్లలో ఆక్యుపెన్సీ తగ్గిపోతుంది, కానీ ఈ సినిమా విషయంలో మాత్రం అలా జరగలేదు. అటు బుక్ మై షోలో కూడా 3.8 మిలియన్లకు పైగా టికెట్లు సేల్ అయ్యి సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. నార్త్ అమెరికాలో కూడా 3.5 మిలియన్ డాలర్లు వసూలు చేసి గ్లోబల్ మార్కెట్‌లో తన సత్తా చాటుకుంది. చిరంజీవి సరసన నయనతార హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ స్పెషల్ రోల్ సినిమాకు ప్లస్ అయింది. మాస్, కామెడీ ఫ్యామిలీ ఎమోషన్స్ పక్కాగా కుదరడంతో ఆడియన్స్ మళ్ళీ మళ్ళీ థియేటర్లకు వెళ్లారు. భీమ్స్ సిసిరోలియో అందించిన మ్యూజిక్, ముఖ్యంగా సాంగ్స్ అన్నీ ఇప్పటికీ ట్రెండింగ్‌లోనే ఉన్నాయి. షైన్ స్క్రీన్స్ గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్టును నిర్మించాయి. ఏదేమైనా 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా కేవలం కలెక్షన్లతోనే కాకుండా, ఎక్కువ రోజులు థియేటర్లలో నిలబడి పాత రోజులను మళ్ళీ తలపించింది.

## అల్లు వారి కొత్త కోడలి సిస్టర్స్



అల్లు వారింట పెళ్లి వేడుకలు ఓ రేంజ్ లో జరుగుతున్నాయి. నిర్మాత అల్లు అరవింద్ చిన్నబ్బాయి, యంగ్ హీరో అల్లు శిరీష్ మరికొన్ని రోజుల్లో తన ప్రేయసి నయనికతో ఏడడుగులు వేయబోతున్నారు. అయితే ఇప్పటికే కాబోయే జంట.. మ్యారేజ్ షూట్ కు సంబంధించిన పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అందరినీ ఆకట్టుకుంటుండగా.. సినీ ప్రియులు, అల్లు ఫ్యాన్స్ అడ్వాన్స్ గా మ్యారేజ్ విషెస్ చెబుతున్నారు. అయితే ఆ ఫోటోల్లో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. అది నయనిక షేర్ చేసిన స్పెషల్ పిక్. అందులో అల్లు వారింటికి కాబోయే కొత్త కోడలు.. తన ఇద్దరు సిస్టర్స్ తో దిగిన ఫోటోను పోస్ట్ చేశారు. ముగ్గురూ స్టైలిష్ గా కనిపిస్తుండగా.. ఫ్యాషన్ ఐకాన్స్ గా అట్రాక్ట్ చేస్తున్నారు. పిక్ అదిరిపోయిందని నెటిజన్లు, సినీ ప్రియులు కామెంట్లు పెడుతున్నారు.! ఇక హైదరాబాద్ కు చెందిన బడా వ్యాపారవేత్త కుమార్తె నయనిక. ప్రస్తుతం ఆమె కూడా కొన్ని బిజినెస్ లు రన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే 2023 అక్టోబర్ లో మెగా హీరో వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి వివాహం సందర్భంగా హీరో నితిన్ తోపాటు ఆయన భార్య నిర్వహించిన పార్టీలో షాలిని స్నేహితురాలైన నయానికను అల్లు శిరీష్ మొదటిసారి కలుసుకున్నారు. మొదట స్నేహితులుగా మారిన వారిద్దరూ.. ఆ తర్వాత ప్రేమలో పడ్డారు. కొన్నాళ్లపాటు సీక్రెట్ గా ప్రేమాయణం సాగించారు. అనంతరం ఇరు కుటుంబాల అంగీకారంతో తాను నయనికను పెళ్లాడబోతున్నట్లు గత ఏడాది అల్లు శిరీష్ అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. గతేడాది అక్టోబర్ లో అల్లు శిరీష్ – నయనిక రెడ్డి ఎంగేజ్మెంట్ హైదరాబాద్ లో గ్రాండ్ గా జరిగింది.

## ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ ఎక్కడ జరగనుందంటే.



ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగనుంది. ఈ విషయాన్ని కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్ మేనన్ ధ్రువీకరించాడు. ఆర్సీబీ అయిదు మ్యాచులను తన హోం గ్రౌండైన చిన్నస్వామిలో ఆడనుందన్నాడు. అలాగే ఒక ప్లే ఆఫ్ మ్యాచ్‌కు కూడా ఈ మైదానం వేదిక కానుందని అతడు వెల్లడించాడు.

'రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు చిన్నస్వామి స్టేడియంలో అయిదు మ్యాచ్‌లు ఆడేందుకు అంగీకరించింది. అలాగే ఒక ప్లేఆఫ్ మ్యాచ్‌తో పాటు, ఫైనల్ మ్యాచ్ కూడా ఈ మైదానంలోనే జరగనుంది. వీటికి సంబంధించిన తేదీలను త్వరలోనే ప్రకటిస్తాం. షెడ్యూల్‌ను బీసీసీఐ త్వరలో విడుదల చేసే అవకాశముంది. చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ గర్జన మరోసారి ప్రతిధ్వనించనుంది' అని సంతోష్ మేనన్ వెల్లడించాడు.

ఎవరు ఫైనల్‌కు.. ఎవరు ఇంటికి?

'చిన్నస్వామి స్టేడియం మాకు హోం గ్రౌండ్ కంటే ఎక్కువ. ఇది మా ఉనికి. బెంగళూరు అభిమానుల ఉత్సాహమే మా ఆటగాళ్లకు ఇంధనం. ప్రతి దశలోనూ వారు క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలిచారు. మా ఫ్యాన్స్ మాకు మద్దతు తెలిపారు. వారి అభిమాన జట్టు బెంగళూరులో ఆడటాన్ని చూసేందుకు వారు పూర్తి అర్హులు' అని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సీఈఓ రాజేశ్ మేనన్ ఓ ప్రకటనలో పేర్కొన్నాడు.

## బుమ్రాను త్వరగా దించాలి



ఇంగ్లాండ్‌తో టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాను భారత్ ఆరంభంలోనే దించాలని.. పవర్ ప్లేలోనే కనీసం రెండు ఓవర్లు వేయించాలని టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ సలహా ఇచ్చాడు. గురువారం జరిగే భారత్–ఇంగ్లాండ్ మధ్య పోరులో భారత్‌దే కాస్త పైచేయిగా ఉండొచ్చని సన్నీ అన్నాడు. "టీ20 ప్రపంచకప్‌లో తలపడబోతున్న భారత్–ఇంగ్లాండ్ జట్లు రెండూ బలంగా ఉన్నాయి. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమతూకంగా కనిపిస్తున్నాయి. ఫినిషర్లకు కొదవలేదు. రెండు జట్ల బౌలింగ్‌లోనూ వైవిధ్యం ఉంది. ఐపీఎల్‌లో ఆడడంతో కొంతమంది ఇంగ్లాండ్ ప్లేయర్లకు భారత్‌లో పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. నాకౌట్ మ్యాచ్‌ల్లో ఎలా ఆడాలో భారత్–ఇంగ్లాండ్‌కు తెలుసు. కచ్చితంగా సెమీస్ పోరు హోరాహోరీగా సాగడం ఖాయం. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో పవర్‌ప్లేలో బుమ్రాకు కనీసం రెండు ఓవర్లు ఇవ్వాలి. కొత్త బంతితో ఆరంభంలోనే వికెట్లు పడగొట్టగల సత్తా అతడికి ఉంది. బుమ్రాను అయిదో ఓవర్లో దింపుతున్నారు. అప్పటికే బ్యాటర్లు ఒక్కొక్కరు 8–10 బంతులు ఆడి క్రీజులో కుదురుకుంటున్నారు.. దీని వల్ల బుమ్రాను సమర్థంగా ఎదుర్కొంటున్నారు. అదే అతడు ఆరంభంలోనే వస్తే వికెట్లు తీసే అవకాశం ఉంటుంది. భిన్నమైన బంతులు వేసే బుమ్రాను అర్థం చేసుకోవడం బ్యాటర్లకు కష్టం" అని సన్నీ అన్నాడు. బ్యాటింగ్ లైనప్‌లో ఉన్న సరళత భారత్‌కు కలిసొచ్చే విషయమని ఆయన అభిప్రాయపడ్డాడు. "భారత బ్యాటింగ్ లైనప్‌లో సరళత ఉంది. ఉదాహరణకు తిలక్ వర్మ ఏ స్థానంలోనైనా ఆడగలడు. అతడు చాలా తెలివైన ఆటగాడు. పరిస్థితిని అర్థం చేసుకుని అందుకు తగ్గట్టుగా ఆడతాడు. 5–6 స్థానాల్లో దిగి.. తాను ఏం చేయగలనో అది చేస్తాడు. వెస్టిండీస్‌పై అతడు స్వేచ్ఛగా ఆడడం వల్లే సంజు శాంసన్‌పై ఒత్తిడి తగ్గింది. అదే తిలక్ ఇబ్బంది పడి ఉంటే.. సంజు కష్టమైన షాట్లకు వెళ్లాల్సి వచ్చేది" అని సన్నీ తెలిపాడు. ఈ టోర్నీలో ఇంగ్లాండ్ స్టార్ జోస్ బట్లర్ ఇప్పటిదాకా తన ముద్ర వేయకపోయినా.. భారత్ అతడిని తక్కువ అంచనా వేయకూడదని.. వీలైనంత త్వరగా ఔట్ చేయాలని గావస్కర్ సలహా ఇచ్చాడు.

## 'మిస్టర్ కూల్' వేగానికి బ్రేక్: ధోనీకి భారీ జరిమానా?



టీమిండియా మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం ఎంఎస్ ధోనీకి ఆయన సొంత నగరం రాంచీలో ఊహించని పరిణామం ఎదురైంది. తన బైకులు, కార్ల పట్ల ఎంతో మక్కువ చూపే మహేంద్ర సింగ్ ధోనీ.. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కారణంగా జరిమానాకు గురయ్యాడు. ధోనీ వాహనం నగరంలోని నిర్ణీత వేగ పరిమితిని మించి ప్రయాణించినట్లు రాంచీ ట్రాఫిక్ నిఘా వ్యవస్థ గుర్తించింది. ఈ క్రమంలో పోలీసులు మోటారు వాహనాల చట్టం 1988లోని సెక్షన్ 183 కింద ధోనీకి రూ. 1000 జరిమానా విధిస్తూ ఈ–చలాన్‌ను జారీ చేశారు. రాంచీ నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ఏర్పాటు చేసిన అత్యాధునిక ఆటోమేటెడ్ సర్వైలెన్స్ సిస్టమ్ (జజుం) ఈ ఉల్లంఘనను ఫోటో తీసింది. ధోనీ నివాసం సమీపంలోనే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. సాధారణంగా ట్రాఫిక్ నిబంధనలను పాటించడంలో ముందుండే ధోనీ.. ఇలా ఓవర్ స్పీడింగ్ చేస్తూ కెమెరాలకు చిక్కడం అభిమానుల మధ్య చర్చనీయాంశంగా మారింది. జరిమానా మొత్తం చిన్నదే అయినప్పటికీ.. ధోనీ వంటి సెలబ్రిటీ కావడంతో ఈ వార్త సోషల్ మీడియాలో దావాగ్నిలా వ్యాపించింది. ధోనీకి ఈ ట్రాఫిక్ జరిమానా పడటం ఒక్కటే కాదు, గత కొన్ని రోజులుగా ఆయన చుట్టూ మరికొన్ని వివాదాలు కూడా నెలకొన్నాయి. రాంచీలోని హర్ము రోడ్డులో నివాసం కోసం కేటాయించిన స్థలాన్ని వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నారంటూ జార్ఖండ్ స్టేట్ హౌసింగ్ బోర్డ్ ఆయనకు నోటీసులు పంపింది. ఓ నివాస ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం చట్ట విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. ఇప్పుడు ట్రాఫిక్ చలాన్ తోడవ్వడం ఆయనకు కొంత ఇబ్బందికరంగా మారింది.

ఐపీఎల్ 2026 కోసం కఠిన శ్రమ

ఇవన్నీ ఒక ఎత్తు అయితే, క్రికెట్ మైదానంలో ధోనీ తన పతాక స్థాయి ప్రదర్శన ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. ఐపీఎల్ 2026 సీజన్ కోసం ఇప్పటికే ఆయన చెన్నై సూపర్ కింగ్స్ శిబిరంలో చేరి నెట్ ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 44 ఏళ్ల వయసులో కూడా ఆయన బ్యాటింగ్ పవర్ ఏమాత్రం తగ్గలేదని ప్రాక్టీస్ సెషన్లు చెబుతున్నాయి. గత సీజన్ (2025)లో సీఎస్కే పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచి తన అభిమానులను నిరాశపరిచింది. ఆ చేదు జ్ఞాపకాన్ని తుడిచేసి, ఈసారి ఐదోసారి కప్పును అందించడమే లక్ష్యంగా ధోనీ కసరత్తులు చేస్తున్నాడు.

## భారత్‌కు చుక్కలు చూపిస్తాం.. ఇంగ్లాండ్ ప్లేయర్ స్ట్రాంగ్ వార్నింగ్!



ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026 క్లైమాక్స్ దశకు చేరుకుంది. మార్చి 5న ముంబైలోని చారిత్రాత్మక వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండో సెమీఫైనల్ జరగనుంది. అయితే మైదానంలో ఆట మొదలవ్వకముందే ఇంగ్లాండ్ స్టార్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ తన కామెంట్స్‌తో వాతావరణాన్ని వేడెక్కించాడు. ముంబైలో హోరెత్తే భారత అభిమానుల కేకలను ఆపేస్తామంటూ సామ్ కరన్ చేసిన కామెంట్స్ ఇప్పుడు క్రీడాలోకంలో చర్చనీయాంశంగా మారాయి. సామ్ కరన్ చేసిన ఈ కామెంట్స్ 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌ను గుర్తు చేస్తున్నాయి. నాడు ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ లక్ష మందికి పైగా ఉన్న భారత అభిమానులను నిశ్శబ్దంగా మార్చడమే తన లక్ష్యమని చెప్పి.. అన్నంత పని చేసి కప్పును ఎగరేసుకుపోయాడు. ఇప్పుడు అదే తరహాలో సామ్ కరన్, "గురువారం వాంఖడే స్టేడియం నిశ్శబ్దంగా మారుతుందని నాకు నమ్మకం ఉంది" అని పేర్కొన్నాడు. స్టేడియంలో నిశ్శబ్దం నెలకొందంటే దాని అర్థం ఇంగ్లాండ్ ఆధిపత్యం ప్రదర్శిస్తోందని సామ్ కరన్ ధీమా వ్యక్తం చేశాడు. వాంఖడే స్టేడియం బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌గా పేరుగాంచింది. దీనిపై స్పందిస్తూ.. ఈ సెమీఫైనల్ మ్యాచ్ కూడా హై–స్కోరింగ్ పోరుగా నిలుస్తుందని సామ్ కరన్ అంచనా వేశారు. ఇరు జట్లలోనూ భారీ హిట్టర్లు ఉన్నందున సిక్సర్ల వర్షం కురవడం ఖాయమని తెలుస్తోంది. "మేము ఎవరికీ భయపడము, ఈ సవాల్‌ను ఎదుర్కోవడానికి ఇంగ్లాండ్ జట్టు పూర్తి ఉత్సాహంతో ఉంది" అని సామ్ కరన్ సూర్యసేనకు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశాడు.

సెమీస్ పోరులో హ్యాట్రిక్ రికార్డు:

టీ20 ప్రపంచకప్ చరిత్రలో భారత్–ఇంగ్లాండ్ సెమీఫైనల్లో తలపడటం ఇది వరుసగా మూడోసారి కావడం విశేషం. 2022లో ఇంగ్లాండ్ గెలవగా.. 2024లో భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఇప్పుడు 2026లో 'డిసైడర్' లాంటి ఈ మ్యాచ్ ముంబైలో జరుగుతుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. హ్యారీ బ్రూక్ సారథ్యంలోని ఇంగ్లాండ్ జట్టు పటిష్టంగా కనిపిస్తుండగా.. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో భారత్ స్వదేశీ గడ్డపై చెలరేగాలని పట్టుదలతో ఉంది.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com